thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

## సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 91 కరీంనగర్ మంగళవారం, 10 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### ఉగ్రవాదులు మళ్లీ తోకాడిస్తే విధ్వంసమే

చెన్నై : ఆపరేషన్ సిందూర్ ఇంకా పూర్తి కాలేదని, ఉగ్రవాదులు మళ్లీ తోకాడిస్తే సర్వనాశనమేనని కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా హెచ్చరించారు. తమిళనాడులోని మదురైలో జరిగిన బీజేపీ రాష్ట్ర నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో త్రివిధ దళాలు ఉగ్ర స్థావరాలను నాశనం చేశాయన్నారు.

పాక్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లను మన సైనికులు కూల్చివేశారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌కు తమిళనాడు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్ర రాజకీయాలపైనా అమిత్‌షా కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాట వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని అన్నారు.




# విజృంభిస్తున్న కరోనా..

## రాష్ట్రాల వారీగా కోవిడ్ కేసులివే..!

దేశంలో మళ్ళీ కరోనా విజృంభన రోజురోజుకి పెరుగుతూ ఉన్నది. ఇప్పటికే చాలా మంది ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ ఈ వైరస్ బారిన పడే వారి సంఖ్య కూడా తాజాగా పెరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు 6000కు పైగా కేసులు నమోదు అయ్యాయని ఈ విషయం పైన కేంద్ర ఆరోగ్య శాఖ తెలియజేసింది. ఇందులో భాగంగా కోవిడ్ వైరస్ బారిన పడి మరణించిన వారి సంఖ్యను కూడా తెలియజేశారు. ఇప్పటివరకు మొత్తం 65 మంది మరణించినట్లుగా తెలియజేశారు. కేరళలో ఇప్పటివరకు అత్యధికంగా 1950 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి.

కేరళలో అత్యధిక కేసులు నమోదు కాగా తర్వాతి స్థానంలో గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ ఉన్నాయి. దీంతో వైద్య సిబ్బంది సంసిద్ధతను తనిఖీ చేసేందుకు కేంద్ర మాక్ డ్రిల్స్ నిర్వహిస్తోంది. అన్ని దవాఖానాలలో ఆక్సిజన్, ఐసోలేషన్ బెడ్స్, వెంటిలేటర్లు, ఇతరఅత్యవసర ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలని రాష్ట్రాలను ఆదేశించింది. రాష్ట్రాల వారిగా కోవిడ్ కేసుల సంఖ్య విషయానికి వస్తే.. 1). కేరళ-1950 2). గుజరాత్ 822 3).వెస్ట్ బెంగాల్ 693 4).ఢిల్లీ 686 5).మహారాష్ట్ర తో 595 6).కర్ణాటక 366 7).ఉత్తరప్రదేశ్ 219 8). రాజస్థాన్ 132 9). తమిళనాడు 194 10). ఆంధ్రప్రదేశ్ 86 11). తెలంగాణ 10. ఇక మిగిలిన ప్రాంతాలలో చాలా తక్కువగానే ఉన్నట్లు తెలియజేశారు వైరస్ బారిన పడని ప్రాంతాల విషయానికి వస్తే అరుణాచల్ ప్రదేశ్, మిజోరం బట్టి ప్రాంతాలలో ఎలాంటి కేసులు నమోదు కాలేదని తెలియజేశారు. ఇక కరోనా కేసుల సంఖ్య రోజు పెరుగుతూ ఉండడంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆందోళన చెందు తూ ఉన్నాయి ప్రస్తుతం కేసులు పెరుగుదల వ్యాప్తిని సైతం అరికట్టడానికి పలు రకాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. అయితే వైద్యులు సైతం ఎవరు కూడా భయపడవద్దంటూ తెలియజేస్తున్నారు. 2021 లో కరోనా బీభత్సవం ఎలా సృష్టించిందో చెప్పాల్సిన పనిలేదు ఇప్పుడు మళ్లీ కూడా అలాంటి పరిస్థితులు వస్తున్నట్లు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరి రానున్న 24 గంటల లో కరోనా కేసుల పైన మరింత అప్డేట్ ఇస్తారేమో WHO చూడాలి మరి. ఏది ఏమైనా ప్రతి ఒక్కరూ కూడా తగిన జాగ్రత్తలు తీసుకొని బయటికి వెళ్లడం మంచిది.



### అమిత్ షా తెలంగాణ పర్యటన ఖరారు!

కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన ఖరారైంది. ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి సోమవారం అధికారిక ప్రకటన వెలువడినట్లు తెలుస్తోంది. జూన్ చివరివారంలో అమిత్‌షా తెలంగాణకు రానున్నారు. నిజామాబాద్‌లో జాతీయ పసుపుబోర్డు కార్యాలయం ప్రారంభించనున్నారు. దీంతో పాటు పసుపుబోర్డు లోగో ఆవిష్కరణలో కూడా అమిత్‌షా పాల్గొంటారని సమాచారం. ఇదిలా ఉంటే.. నిజామాబాద్ నగరంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం నెలవారీ అద్దె ప్రాతిపదికన పసుపు బోర్డు కార్యాలయానికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి వాస్తు దోషం కారణంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ఉపయోగించడం లేదు. దీంతో ఏడాదిన్నర కాలంగా ఈ కార్యాలయం వృథాగానే పడి ఉంది. పసుపు బోర్డు కార్యాలయం కోసం కేటాయించాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరగా.. గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.



### ప్రభాకర్‌రావుపై సిట్ ప్రశ్నల వర్షం

హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విచారణ ముగింది. సిట్ అధికారులు ఆయన్ను దాదాపు ఎనిమిది గంటల పాటు విచారించారు. డీసీపీ విజయ్, ఏసీపీ వెంకటగిరి ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. తిరుపతన్న, రాధాకిషన్‌రావు, ప్రణీత్‌రావు, భుజంగరావు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా పోలీసులు పలు విధాలుగా ప్రశ్నలు అడిగారు. అలాగే, ఇప్పటివరకు సేకరించిన ఆధారాలను ఆయన ముందు ఉంచి ప్రశ్నించినట్లు సమాచారం. నేటి విచారణ ముగియగా.. ఈ నెల 11న మరోసారి విచారణకు రావాలని పోలీసులు ప్రభాకర్‌రావుకు సూచించారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావుపై పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయన ఏ1గా ఉన్నారు. ప్రభాకర్‌రావు నుంచి కీలక సమాచారం రాబట్టడమే లక్ష్యంగా సిట్ అధికారులు ఆయన్ను ప్రశ్నించారు.

ఈ కేసులో ఇప్పటికే ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు, భుజంగరావు, తిరుపతన్నను సిట్ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారు ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రభాకర్‌రావును ప్రశ్నించినట్లు సమాచారం. ఈ కేసు నమోదైన సమయంలోనే ప్రభాకర్ రావు అమెరికా వెళ్లిపోయారు. ఆ తర్వాత తిరిగి రాకపోవడంతో పోలీసులు ఆయన పాస్‌పోర్టు రద్దు చేయించారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విచారణకు సహకరించేందుకు ఎమర్జెన్సీ ట్రావెల్ డాక్యుమెంట్‌తో ఆదివారం రాత్రి 8.20 గంటల సమయంలో ఎమిరేట్స్ విమానంలో దుబాయ్ మీదుగా హైదరాబాద్ చేరుకున్నారు. ఐజీ స్థాయిలో పదవీ విరమణ చేసిన అధికారి పోలీసు విచారణకు హాజరు కావడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం.

### మంత్రుల శాఖల కేటాయింపుపై...

# ఉత్కంఠ!

**తెలంగాణ కొత్త మంత్రులకు శాఖలు.. పాత మంత్రుల శాఖల్లో మార్పులు, కీలకమైన హెూంశాఖ ఆయనకే..?!**




హైదరాబాద్ : తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ పూర్తయింది. మంత్రులుగా ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌లు ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ నేపథ్యంలో ప్రస్తుతం శాఖల కేటాయింపుపై తీవ్ర చర్చ జరుగుతోంది. కొత్త మంత్రులకు శాఖలు కేటాయించాల్సి ఉంది. ఈ విషయమై ఏఐసీసీ అధిష్ఠానంతో చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ చేరుకున్నారు.

మంత్రుల శాఖల పునర్వ్యవస్థీకరణపై అధిష్ఠానంతో సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

**కీలక శాఖల్లో మార్పులు, చేర్పులు?...** అయితే పాత మంత్రుల శాఖల్లో పెద్ద మొత్తంలో మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఆర్థిక శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రుల మార్పుపై సీఎం ఏఐసీసీ అధిష్ఠానంతో చర్చించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆర్థిక శాఖను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పౌర సరఫరాల శాఖను ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. భట్టి ఆర్థిక శాఖతో పాటు విద్యుత్, ఉత్తమ్ సివిల్ సప్లయ్ శాఖతో పాటు భారీ నీటి పారుదల శాఖలను పర్యవేక్షిస్తున్నారు. ఈ శాఖల మార్పులతో పాటుగా.. సీఎం రేవంత్ రెడ్డి వద్దే ఉన్నహెూం, మున్సిపల్, విద్యా శాఖ, ఇతర కీలక శాఖల కేటాయింపులపైనా ఢిల్లీలో చర్చించే అవకాశముంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కీలకమైన హెూం శాఖ ఇచ్చే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. అలాగే శ్రీధర్‌బాబుకు ఐటీతో పాటు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఇతర కీలక శాఖలు కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో ఐటీ శాఖ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం హెూం, మున్సిపల్ సీఎం వద్దే ఉన్నాయి. కొత్తగా మంత్రివర్గంలోకి వచ్చిన వారికి కూడా ప్రాధాన్యతతో కూడిన శాఖలు దక్కే అవకాశం ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన తర్వాత శాఖల కేటాయింపుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఈ కేబినెట్ మంత్రుల మార్పులు ప్రభుత్వ పనితీరుపై ఎలాంటి ప్రభావం చూపుతాయో వేచి చూడాలి మరి.



# అటు మోడీ...ఇటు బాబు...

## ఒకే విజనరీ - ఒకే ఆలోచనతో...!

# ఏడాది పూర్తి చేసుకున్న ఎన్డీఏ ప్రభుత్వం!!

కేంద్రంలో నరేంద్ర మోడీ వరసగా మూడవ సారి అధికారం చేపట్టి జూన్ 9 నాటికి సరిగ్గా 11 ఏళ్ళు పూర్తయ్యింది. 2014లో తొలిసారి ప్రధాని పీఠాన్ని అధిరోహించిన మోడీ ఇప్పటిదాకా నాన్ స్టాప్ గా పాలన చేస్తూనే ఉన్నారు. ప్రధానిగా అలా నెగ్గుతూనే ఉన్నారు. ఇక 2024లో బీజేపీకి సొంతంగా మెజారిటీ రాకపోయినా ఎన్డీయే మిత్రుల సాయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి మరీ మోడీ హ్యాట్రిక్ పీఎం గా రికార్డు క్రియేట్ చేశారు. అలా మోడీ ప్రధాని పదవిలో ఉన్న కాలం 11 ఏళ్ళు పూర్తి అవుతోంది. దాంతో బీజేపీ ఈ మహత్తర అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ దేశవ్యాప్తంగా ర్యాలీలు విజయోత్సవాలు సమావేశాలు చర్చలు మేధ మధనాలు రౌండ్ టేబిల్ మీటింగ్స్ ఇలా కాదేదీ ప్రచారం అన్నట్లుగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమాలు ఏకంగా 70 రోజుల పాటు సాగుతాయని బీజేపీ నేతలు చెబుతున్నారు. గత నేలలో బీజేపీ తిరంగా ర్యాలీలు చేసింది. జూన్ నుంచి మరో రెండున్నర నెలల పాటు మోడీ నాయకత్వంలో బీజేపీ పదకొండేళ్ళ పాలనం మీద దేశవ్యాప్తంగా విజయ సంరంభాలకు తెర తీస్తోంది అన్న మాట. విషయం ఏది అయినా జనాలకు కనెక్ట్ కావడమే ఇక్కడ ఆలోచన. ఈ పదకొండేళ్ళ కాలంలో మోడీ ప్రభుత్వం దేశంలో ఏమి చేసింది, ప్రజలకు ఏ రకంగా అభివృద్ధి ఫలాలను అందించింది అన్నది చర్చకు పెడుతూ జనంలోకి పోవడమే అసలు ఉద్దేశ్యం. కేంద్ర మంత్రుల నుంచి స్థానిక పార్టీ నాయకుల దాకా అంతా ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఇక ఏపీలో చూస్తే జూన్ 12 నాటికి ఏపీలో కూటమి పాలనకు ఏడాది పూర్తి అవుతోంది. దాంతో ఆ రోజు అంతా ఏపీ వ్యాప్తంగా విజయోత్సవాలు నిర్వహించాలని కూటమి పెద్ద చంద్రబాబు పిలుపు ఇచ్చారు.

ప్రతీ నియోజకవర్గంలో మండలంలో గ్రామంలో కూటమి ఏడాది పాటు చేసిన పాలనలో సాధించిన విజయాలతో పాటు వైసీపీ అయిదేళ్ళ పాలనలో చేసిన అరాచకాలను జనాలను వివరించాలని కూటమి పెద్దలు సూచిస్తున్నారు. దాంతో విజయోత్సవాలే ప్రచార అస్త్రాలుగా మార్చుకుని మోడీ చంద్రబాబు ఒకే రకమైన ఆలోచనతో ముందుకు సాగుతున్నారన్న మాట. ప్రజలకు తాము ఏమి మేలు చేసింది ఈ సందర్భంగా అటు బీజేపీ ఇటు టీడీపీ జనసేన పార్టీలు వివరిస్తారు. ఇదే పాలన మరింత కాలము కొనసాగేలా జనాల దీవెనలు అందుకునేందుకు కూడా వారికి విన్నపాలు చేస్తారు మొత్తానికి మోడీ బాబు విజయోత్సాహంతో ఉన్నారు. క్యాడర్ కూడా రంగంలోకి దిగితే ఈ ఉత్సవాల ఉత్సాహం ఏమిటి జనాల నుంచి వచ్చే రియాక్షన్ ఏ విధంగా ఉంటుంది అన్నది అర్ధమవుతుంది అని అంటున్నారు.




## మహారాష్ట్ర, సీడబ్ల్యూసీ అభ్యంతరాల వల్లే కాళేశ్వరం రీ డిజైన్ చేశాం: హరీశ్‌రావు

హైదరాబాద్: కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ మంత్రి హరీశ్‌రావు విచారణ ముగిసింది. దాదాపు 40 నిమిషాల పాటు ఆయన్ని జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. ప్రాజెక్టు రీడిజైనింగ్ కారణాలను హరీశ్‌రావు ఆయనకు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేఅవుట్‌ను చూపించి వివరణ ఇచ్చారు. మహారాష్ట్ర, సీడబ్ల్యూసీ అభ్యంతరాల వల్లే రీడిజైనింగ్ చేసినట్లు చెప్పారు. తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత సమస్య వల్ల రీడిజైనింగ్ చేసినట్లు తెలిపారు. వాప్కోస్ ద్వారా సర్వే చేయించిన తర్వాతే ప్రాజెక్టు స్థలం మార్చినట్లు కమిషన్‌కు వివరించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గురించి జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించగా.. అన్ని ఆనకట్టల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదం ఉందని హరీశ్‌రావు తెలిపారు. ఇంజినీర్ల సూచన మేరకే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మార్పు జరిగిందన్నారు. స్థలాల మార్పు గతంలోనూ కొన్ని ప్రాజెక్టుల విషయంలో జరిగిందని గుర్తు చేశారు. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి నేరుగా నీరు తరలించవద్దని విశ్రాంత ఇంజినీర్లు చెప్పారన్న హరీశ్‌రావు.. వారి సూచన మేరకే స్థలం మార్చినట్లు తెలిపారు. ప్రాజెక్టుకు రుణ సేకరణ కోసమే కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు చేశామని, మంత్రి వర్గ ఆమోదం, ప్రభుత్వ గ్యారెంటీతోనే కార్పొరేషన్ ఏర్పాటు జరిగిందని కమిషన్‌కు వివరించారు. కేంద్రప్రభుత్వ సంస్థలు, బ్యాంకుల నుంచే రుణాలు తీసుకున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ నుంచి కాకుండా బడ్జెట్ నుంచి నిధులు ఎందుకు కేటాయించారని పీసీ ఘోష్ ప్రశ్నించారు. జలాశయాల నుంచి ఎత్తిపోసిన నీటి వివరాలను అడిగారు. ఆనకట్టల్లో నీరు నిల్వ చేయాలని ఎవరు ఆదేశించారని ప్రశ్నించగా.. ప్రాజెక్టుల్లో నీటి నిల్వ ఇంజినీర్లు చూసుకునే అంశమని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని హరీశ్‌రావు వివరించారు.

**స్వయంగా కేసీఆర్ వెళ్లి అడిగినా..** "కమిషన్ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చాను. అన్ని ఆధారాలు సమర్పించా. తమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు ఎందుకు మార్చారని చాలా సేపు ప్రశ్నించారు. తమ్మిడిహట్టి వద్దే కట్టడానికి అన్ని ప్రయత్నాలు చేశామని చెప్పాను. దీనిపై అనాడే అప్పటి మహారాష్ట్ర కాంగ్రెస్ మంత్రిని కోరాం. మీకు మీరుగా నిర్ణయించుకొని పనులు ప్రారంభిస్తే ఖర్చు వృథాగా మారే అవకాశం ఉందని చెప్పారు. తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఐదారు సమావేశాలు జరిగాయి. కేసీఆరే స్వయంగా మహారాష్ట్ర వెళ్లి.. సీఎం ఫడణవీస్‌కు చెప్పే ప్రయత్నం చేశారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం పోయి.. భాజపా ప్రభుత్వం వస్తే.. మళ్లీ సంప్రదించాం. తమ్మిడిహట్టి వద్ద అనుమతించాలని.. ఎంత నష్టపరిహారమైనా ఇస్తామని స్పష్టంగా చెప్పాం. ఏడేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకోనప్పుడు మేమెలా ఒప్పుకుంటామని మహారాష్ట్ర సీఎం చెప్పారు. ఏడేళ్లు మహారాష్ట్ర, దిల్లీ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా తమ్మిడి హట్టి వద్ద బ్యారేజ్ ఒప్పించడంతో తీవ్రంగా విఫలమయ్యారు. ఈ సమయంలోనే తమ్మిడిహట్టి వద్ద నీళు లేవని సెంట్రల్ వాటర్ కమిషన్ రెండు లేఖలు రాసింది. నీటి లభ్యత తక్కువ ఉందని.. ప్రత్యామ్నాయం చూసుకోవాలని లేఖలో పేర్కొంది. అందుకే ప్రాజెక్టు రీ డిజైన్ చేయాల్సి వచ్చింది. సీడబ్ల్యూసీ నుంచి వచ్చిన మూడు లేఖలు కమిషన్‌కు ఇచ్చాం" అని హరీశ్‌రావు అన్నారు.




హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో మద్యం ప్రియులకు శుభవార్త. త్వరలోనే మద్యం ధరలు తగ్గే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు, ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాష్ట్రంలో మద్యం మార్కెట్ను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా.. తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ నూతన మద్యం బ్రాండ్ల ప్రవేశానికి గత ఫిబ్రవరిలో జారీ చేసిన నోటిఫికేషన్కు అసాధారణ స్పందన లభించింది. ఈ పరిణామం మార్కెట్లో పోటీని గణనీయంగా పెంచుతుందని, ఫలితంగా బీరు, మద్యం ధరలు తగ్గుతాయని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. TGBCL ఆహ్వానించిన దరఖాస్తులకు అనూహ్యమైన స్పందన లభించడం రాష్ట్ర మద్యం రంగంలో నూతన అధ్యాయానికి సంకేతం. మొత్తం 92 కంపెనీలు 604 కొత్త బ్రాండ్లను తెలంగాణ మార్కెట్లోకి ప్రవేశపెట్టేందుకు ఉత్సాహం చూపాయి. వీటిలో 331 భారతీయ మద్యం బ్రాండ్లు కాగా, 273 విదేశీ బ్రాండ్లు ఉన్నాయి. ఈ విస్తృత శ్రేణి ఎంపికలు వినియోగదారులకు అనేక ప్రయోజనాలను చేకూరుస్తాయి. కొత్తగా 47 కంపెనీలు 386 బ్రాండ్లను ప్రతిపాదించగా, ఇప్పటికే మార్కెట్లో ఉన్న 45 సరఫరా కంపెనీలు మరో 218 బ్రాండ్లను ప్రవేశపెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 51 కంపెనీలు 1,031 రకాల మద్యాన్ని %ు+దీజూ%కి సరఫరా చేస్తున్నాయి. ఈ కొత్త బ్రాండ్ల రాకతో వినియోగదారులకు మరిన్ని ఎంపికలు అందుబాటులోకి వస్తాయి. ఈ చర్యలన్నీ మార్కెట్ స్థిరత్వానికి దోహదపడటమే కాకుండా, వినియోగదారులకు అధిక ఎంపికలను అందిస్తాయి. దీంతో ధరలు తగ్గే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అదే సమయంలో ప్రభుత్వ ఆదాయాన్ని పెంపొందించే అవకాశం ఉంది.

2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ శాఖ రూ. 34,600 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. కొత్త బ్రాండ్ల ప్రవేశంతో వినియోగదారులకు ఎక్కువ ఎంపికలు లభించడమే కాకుండా, కంపెనీల మధ్య ఆరోగ్యకరమైన పోటీ నెలకొంటుంది. ఇది దీర్ఘకాలంలో ధరల స్థిరీకరణకు, లేదా తగ్గుదలకు దారితీయవచ్చు.




## ఐఈడీ పేల్చిన మావోయిస్టులు.. అదనపు ఎస్పీ మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మావోయిస్టులు ఘాతుకానికి ఒడిగట్టారు. దోంద్రా సమీపంలో పోలీసు వాహనాన్ని ఐఈడీతో పేల్చేశారు. ఈ ఘటనలో అదనపు ఎస్పీ ఆకాశ్ రావు గిరిపుంజే మృతి చెందారు. డీఎస్పీ, సీఐ సహా పలువురు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను దగ్గర్లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న అదనపు బలగాలు సంఘటనా స్థలికి చేరుకున్నాయి. మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి.

**దాడి కోసం ఉచ్చులోకి లాగారా..?...** జూన్ 10వ తేదీన మావోయిస్టులు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసు బలగాలు అప్రమత్తంగా ఉన్నాయి. ఆదివారం మావోలు చిక్వార్ గూడ వద్ద పొక్లెయిన్‌ను దహనం చేశారు. దీంతో ఆ ప్రదేశానికి వెళ్లేందుకు.. కాంటా-ఎరబోరా మార్గంలో ఏఎస్పీ ఆకాశ్‌రావ్, మిగిలిన సిబ్బందితో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు ప్రెజర్ ఐఈడీని పేల్చారు. దీంతో ఏఎస్పీ తీవ్రంగా గాయపడటంతో.. సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడే ఆయన తుదిశ్వాస విడిచారు. గాయపడిన వారికి కొంటా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ దాడిపై ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్ శర్మ దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. ఆకాశ్‌రావ్ మృతికి సంతాపం తెలిపారు. ఆయన యోధుడని కొనియాడారు. ఆయన మృతి విషాద క్షణమన్నారు.

**హిడ్మా సొంత గ్రామంలో ఇన్ఫార్మర్ పేరిట హత్య...** మావోయిస్టు పార్టీ అగ్ర నేత మాడ్వి హిడ్మా సొంత గ్రామం పూవర్తి గ్రామ పటేల్ రామయ్యను శనివారం రాత్రి ఘోరంగా హత్య చేశారు. మావోయిస్టులే ఈ ఘాతుకానికి పాల్పడ్డట్లు తెలుస్తోంది. దాదాపు 15 మంది పదునైన ఆయుధాలతో అతనిపై దాడి చేసి పొడిచి చంపారు. అతడు పోలీస్ ఇన్ఫార్మర్ అనే అనుమానంతోనే ఈ ఘాతుకానికి ఒడికట్టినట్లు తెలుస్తోంది.

**బస్తర్ డివిజన్‌పై కన్ను..** బస్తర్ డివిజన్‌లోని బస్తర్, బీజాపూర్, దంతెవాడ, కాంకేర్, కొండగావ్, నారాయణ్‌పూర్, సుక్మా జిల్లాల్లో మావోయిస్టుల కార్యకలాపాలను కట్టడి చేయగలిగితే దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని అణిచివేయొచ్చుననే లక్ష్యంతో భద్రతా బలగాలు ఇక్కడ ఆపరేషన్లు మొదలుపెట్టాయి. ఛత్తీస్‌గఢ్‌లో 2023లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో 90 శాతం ఈ డివిజన్‌లోనే జరిగాయి. బస్తర్‌పై 'గురి'పెట్టిన బలగాలు మావోయిస్టుల అణిచివేతలో దూకుడు ప్రదర్శిస్తున్నాయి. మరోవైపు ఇంద్రావతి టైగర్ రిజర్వ్‌లో భద్రతా దళాలు నిర్వహించిన ఆపరేషన్‌లో భారీ విజయాలు సాధించాయి.

గుండెకోట గ్రామం వద్ద మావోల ప్రధాన కార్యదర్శి బసవరాజు, ఇంద్రావతి టైగర్ రిజర్వులో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ సహా పలువురిని నేల కూల్చాయి.

## పథకం మేరకే ప్రభాకర్‌రావు లొంగుబాటు: బండి సంజయ్

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు పథకం మేరకే లొంగిపోయారని కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. సిట్ విచారణలో ఆయన ఇచ్చిన వాంగ్మూలాన్ని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్‌రావుకు కేసీఆర్ కుటుంబంతో అమెరికాలో కౌన్సిలింగ్



పూర్తయిందని అందుకే ఆయన లొంగిపోయారని చెప్పారు. కాంగ్రెస్, భాజపా, భారాస నేతల ఫోన్లు ట్యాప్ చేశారని విమర్శించారు. "జడ్జిల ఫోన్లు కూడా ట్యాప్ చేసిన ఘనుడు ప్రభాకర్‌రావు. ఎవరి ఆదేశాలతో ఫోన్ ట్యాపింగ్ చేశారో ప్రజలకు తెలియాలి. ఫోన్ ట్యాప్ చేసి ఏం చేశారు? ఆడియోలు ఎవరికి పంపారు? ట్యాపింగ్ ఆడియోలను అడ్డుపెట్టుకొని ఎవరిని బెదిరించారు? కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోంది. కాంగ్రెస్ వచ్చాక ఒక్క అవినీతి కేసు విచారణ ముందుకు సాగలేదు. ప్రభాకర్‌రావు, సూత్రధారులను దోషులుగా తేల్చాల్సిందే" బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## టీజీఎస్ఆర్టీసీకి ప్రభుత్వం రూ.6,088 కోట్లు చెల్లించింది

సూర్యపేట: తెలంగాణ ఆర్టీసీలో ఇప్పటి వరకు ప్రయాణించిన మహిళలకు రూ. 182 కోట్ల జీరో టికెట్లు జారీ చేసినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సూర్యాపేట ఆర్టీసీ డిపోలో ఎలక్ట్రిక్ బస్సులను ఆయన ప్రారంభించారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. "మహాలక్ష్మి పేరిట ఉచిత ప్రయాణంతో కొందరు ఆందోళన చెందారు.



మహిళలు ఉచిత ప్రయాణం చేసినా ప్రభుత్వం ఆర్టీసీకి డబ్బులు చెల్లించింది. ఇప్పటి వరకు ఆర్టీసీకి రూ. 6,088 కోట్లు చెల్లించింది. బస్సులు పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నందునే ఆర్టీసీ నిలదొక్కుకుంటోంది"అని తెలిపారు. ఈవీ బస్సుల ప్రారంభోత్సవంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, శంకర్ నాయక్, అద్దంకి దయాకర్, ఉత్తమ్ పద్మావతి, మందుల సామేల్ పాల్గొన్నారు.




## గోల్కొండ మహంకాళి ఆలయం నుంచి స్టార్ట్ - రూ.20 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

హైదరాబాద్ : హైదరాబాద్ - సికింద్రాబాద్ జంట నగరాలు బోనాల పండుగకు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 26 నుంచి ఆషాఢ బోనాల వేడుకలు ప్రారంభమై నెలరోజుల పాటు జరగనున్నాయి. తొలుత గోల్కొండ జగదాంబ మహంకాళి ఆలయంలో బోనం సమర్పిస్తారు. హైదరాబాద్‌లో 28 ప్రముఖ ఆలయాలు ఉండగా.. వీటి పరిధిలో బోనాలు నిర్వహించనున్నారు. ఆయా ఆలయాల్లో పూజా కార్యక్రమాలకు హాజరయ్యే అతిథుల వివరాలను ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్లు లిస్ట్ అవుట్ చేశారు. అంతేకాకుండా, గతంలో జరిగిన పొరపాట్లకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నది. ఆలయాలకు వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. చలువ పందిళ్లు వేస్తున్నారు.

ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. బోనం సమర్పణలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు. పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ ఇబ్బందులపై రివ్యూలు నిర్వహిస్తున్నారు. ఏర్పాట్లపై అధికారులకు ఇప్పటికే మంత్రి కొండా సురేఖ, కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఒకటిరెండ్రోజుల్లో ఆలయ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్టు తెలిసింది.

**బల్కంపేట ఎలమ్మ ఆలయంలో జులై 1న...** బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో జులై 1వ తేదీన బోనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

అలాగే, 13, 14 తేదీల్లో సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో, 20, 21 తేదీల్లో లాల్ దర్వాజా సింహవాహినీ మహంకాళి ఆలయంలో, నాచారంలోని మహంకాళి సమేత మహంకాళేశ్వర ఆలయంలో బోనాలు ఉంటాయని అధికారులు వెల్లడించారు.

**ఏర్పాట్లకు 20 కోట్లు మంజూరు...** ఆషాఢ బోనాల ఏర్పాట్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఆలయాలకు వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. గ్రేడ్లను బట్టి ఆలయాలకు దేవాదాయశాఖ ఫండ్స్?రిలీజ్ చేసింది. బోనాల వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ ప్రణాళికలు రూపొందిస్తున్నారు.




హైదరాబాద్ : జంట నగరాల తాగునీటి అవసరాలు తీరుస్తున్న మెట్రోవాటర్ బోర్డు ఇక నుంచి తన పరిధిని మరింత విస్తరించుకునేందుకు సిద్ధమవుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ట్రిపుల్‌ఆర్ వరకూ వాటర్ బోర్డు విస్తరించనుంది. ఇందుకోసం అధికారులు యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని ప్రాంతాలతోపాటు ఔటర్ రింగ్ రోడ్‌లోని మరికొన్ని గ్రామాలకు రోజుకు 550 ఎంజీడీ నీటిని వాటర్ బోర్డు సరఫరా చేస్తున్నది. త్వరలో గోదావరి రెండు, మూడో దశ పనులు పూర్తయితే మరింత నీటి లభ్యత ఏర్పడనుంది. రోజుకు 160 ఎంజీడీల నీరు అదనంగా అందించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ట్రిపుల్‌ఆర్ వరకూ ఉన్న గ్రామాల వరకూ తాగునీటిని సరఫరా చేసేలా వాటర్ బోర్డు పరిధిని విస్తరించనున్నారు. ఇప్పటికే ట్రిపుల్ ఆర్‌వరకూ ఉన్న ప్రాంతాలను అర్బన్‌కోర్ ఏరియాగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తుండడంతో రియల్‌ఎస్టేట్ కూడాపుంజుకుంటోంది. ఆయా ప్రాంతాల్లో భూముల ధరలు కూడా పెరుగుతున్నాయి. వాటర్ బోర్డు పరిధి పెరగడం వల్ల ఆయా ప్రాంతాల్లో నిర్మాణాలు చేసుకునే వారికి అవసరమైనతం నీటిని కూడా అందించనున్నట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వాటర్?బోర్డు పరిధి 1450 చ. కి.మీ. కాగా, కొత్తగా ట్రిపుల్ ఆర్ వరకూ విస్తరిస్తే మరో 2500 చ.కి.మీ. వరకూ పెరిగే అవకాశం ఉంటుందని వివరించారు. దీంతో ప్రస్తుతం ఆయా ప్రాంతాలు బోర్డు పరిధిలోకి వస్తే రోజుకు 750 ఎంజీడీల నీటిని సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు.

హైదరాబాద్ : మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచందర్నాయక్కు శాసనసభ డిప్యూటీ స్పీకర్ పదవి వరించింది. వృత్తిరీత్యా వైద్యుడైన రాంచందర్నాయక్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్పై ఘన విజయం సాధించి తొలిసారి చట్టసభలో అడుగుపెట్టారు. 18 నెలలుగా ప్రభుత్వ విప్గా కొనసాగుతున్న రాంచందర్నాయక్కు డిప్యూటీ స్పీకర్ పదవి దక్కడం.. మహబూబాబాద్ జిల్లాకు దక్కిన గౌరవమని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం బొమ్మకల్లు సర్పంచ్తండాకు చెందిన జాటోతు రాంచందర్నాయక్ ఉస్మానియా నుంచి ఎంబీబీఎస్తో పాటు ఎంఎస్ సర్జన్ పట్టాలు పొందారు. సూర్యాపేటలో శివసాయి ఆస్పత్రి స్థాపించి, వైద్య సేవలందించారు. రాంచందర్నాయక్ సతీమణి ప్రమీల కూడా వైద్యురాలే. ఆమె గైనకాలజిస్టుగా వైద్య వృత్తిలో కొనసాగుతున్నారు. వైద్యుడిగా కొనసాగుతుండగా.. టీడీపీ అనుబంధ ఆరోగ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాంచందర్ నాయక్ 2006లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ తరఫున డోర్నకల్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగి ఓటమి చవిచూశారు. 2023లో జరిగిన ఎన్నికల్లో తొలిసారి విజయం సాధించారు



చురకలు



# పౌర హక్కుల కోసం పరితపించిన మేధావి బాల గోపాల్

## - జూన్ 10... పౌర హక్కుల పోరాట యోధుని జయంతి



పౌరహక్కుల ఉద్యమానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన ఘనత బాలగోపాల్ కే దక్కుతుంది. బాలగోపాల్ ఒక మధ్యతరగతి తెలుగు బ్రాహ్మణ దంపతుల ఎనిమిది మంది పిల్లలలో ఐదవ సంతానం- కందాళ్ళ పార్థనాథ శర్మ మరియు రాళ్ళపల్లి నాగమణి దంపతులకు బాలగోపాల్ 1952, జూన్ 10న బళ్ళారి, కర్ణాటకలో జన్మించాడు. ఆయన సోదరులలో ఒకరైన అనంత భారత సైన్యంలో డాక్టర్. . మాతామహుడు: ప్రముఖ సాహితీవేత్త రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ. ఈటీవీ2లో చాలాకాలం తెలుగు వెలుగు కార్యక్రమానికి నిర్వాహకురాలు గా ఉన్న మృణాళిని సోదరి. ఒకటి నుంచి డిగ్రీ వరకు తిరుపతిలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి, వరంగల్ లోని ఆర్ఈసీ నుంచి గణితంలో పీహెచ్డీ, 1980లో కాకతీయ విశ్వ విద్యాలయంలో గణిత అధ్యాకు డిగా ఉద్యోగంలో చేరిక, 1985లో ఉద్యోగానికి రాజీనామా, అప్పటి నుంచి హక్కుల ఉద్యమానికే పూర్తిగా అంకితం అయ్యాడు. మూడు దశాబ్దాలుగా అవిశ్రాంత కృషి సలిపిన ప్రముఖ హక్కుల నేత, న్యాయవాది, హేతువాది మేధావి. హైదరాబాద్ లోని గుడిమల్కాపూర్ ప్రియా కాలనీలో నివసించాడు. ఆయన భార్య వసంత లక్ష్మి ఆంధ్రజ్యోతిలో పాత్రికేయురాలు. వారికి ప్రభాత అనే కుమారుడు కలిగాడు. మానవతా విలువల కోసం పోరు సల్పుతు, ఆదివాసీ ఉద్యమం నుంచి విప్లవోద్యమం వరకు, పౌరహక్కుల ఉద్యమం నుంచి మానవ హక్కులు ఉద్యమం వరకు, కూలీ పోరాటం నుంచి భూపోరాటం వరకు అన్నిరకాల ఉద్యమాలతో పెనవేసుకు పోయిన నాయకు డాయన. ఎక్కడ అన్యాయం, వివక్ష, అణిచివేత, అసమానతలు కనిపించినా నిష్కర్షగా, నిక్కచ్చిగా, నిర్భయంగా పోరాడాడు. ఈ క్రమంలో వచ్చిన బెదిరింపుల్ని ఏనాడూ లెక్కచేయలేదు. ఆయనపై ఎన్నోసార్లు భౌతిక దాడులు జరిగినా రెట్టించిన ఉత్సాహంతో పనిచేశాడు. బూటకపు ఎన్కౌంటర్లను వెలుగు లోకి తేవడంతో పోలీసులు ఆయనపై నక్సలైట్గా ముద్ర వేశారు. కొత్తగూడెంలో ఓసారి ఆయనపై దాడికి పాల్పడిన పోలీసులు చనిపోయాడని భావించి, మురికి కాల్వలో పడేసి వెళ్లగా పీడీఎస్యూ కార్యకర్తలు ఆయన్ను కాపాడారు. ఆయన మానవ హక్కుల ఉద్యమంతో పూర్తిగా సంబంధం కలిగి ఉన్న తరువాత చాలా కాలం తరువాత న్యాయవాదిగా మారడానికి ఎంచు కున్నాడు. బాలగోపాల్ 1983 మరియు 1997 మధ్య ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ (ఎపిసిఎల్సి) ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు. ఎపిసిఎల్సి లో అభిప్రాయ భేదాల తరువాత, అతను ఎపిసిఎల్సిని వదిలి మానవ హక్కుల ఫోరంను ఏర్పాటు చేశాడు.

26 సంవత్సరాల కాలంలో, అతను ఆంధ్రప్రదేశ్ మరియు ఇతర ప్రాంతాలలో ప్రభుత్వ దళాలు వేలాది మంది చట్టవిరుద్ధ హత్యల కేసులను నమోదు చేశాడు. 1980 ల చివరలో మావోయిస్టులు చేసిన కిడ్నాప్ వరుస సందర్భంగా, అప్రమత్తమైన సంస్థ ప్రజా బంధు ( ?(ఫ్రెండ్స్ ఆఫ్ ది పీపుల్ ) ఆయనను అపహరించి, ఇద్దరు పోలీసు అధికారులను నక్సలైట్ కస్టడీ నుండి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసుల తో సంబంధాలున్నాయని అనుమానించిన ఈ సంస్థ, అపహరణకు గురైన పోలీసులను తిరిగి ఇచ్చిన తర్వాతే ఆయనను విడుదల చేసింది. బాలగోపాల్ 90 దశక ప్రారంభం వరకు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ప్రచురించిన అనేక వ్యాసాలలో మాండలిక మార్క్సిస్ట్ పద్ధతిని అనుసరించాడు. సోవియట్ యూనియన్ పతనంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలగోపాల్ సమాధానాల కోసం మార్క్సిజంలో మానవతావాద సంప్రదాయాలను అన్వేషించడం ప్రారంభించాడు. 90 వ దశకంలో ఆయన వ్యాసాలు ఈ మార్పును ప్రతిబింబిస్తాయి. రాజ్య హింస తోపాటు ప్రైవేటు హింసను ఆయన వ్యతిరేకించాడు. నక్సల్బరీ ఉద్యమానికి ఎంతోమంది కార్యకర్తలను అందించిన ఆయన ఆ తర్వాత క్రమంలో విప్లవపార్టీల వైఖరిని తప్పుబట్టారు. ప్రజలకు చేరువకావడంలో ఎం.ఎల్ పార్టీలు విఫలమయ్యాయని విమర్శిం చారు. ఆయన రాసిన 'నక్సల్బరీ ఉద్యమం, గమ్యం, గమనం', 'చీకటి కోణం' పుస్తకాలు సంచలనం సృష్టించాయి. మావోయిస్టుల హింస చర్యలపై ఆయన బహిరంగంగా విమర్శిం చడం నక్సలైట్ల నుండి తీవ్ర విమర్శలను ఆకర్షించింది. పశ్చిమ బెంగాల్లోని లాల్ ఘడ్ లో జరిగిన హింసపై ఆయన చేసిన వ్యాఖ్యల తరువాత, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల కోటేశ్వర్ రావు... బాలగోపాల్ను లాల్ గఢ్ నిరోధక ప్రాంతాన్ని సందర్శించి నిజమైన చిత్రాన్ని తెలుసుకోవాలని సవాలు చేశాడు. ఆయన 2008 లో భారతదేశ ప్రణాళికా సంఘం ఏర్పాటు చేసిన తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధి సవాళ్ళపై నిపుణుల సమూహంలో సభ్యుడిగా పనిచేశాడు. మానవ హక్కులు అవిభక్తమైనవని ఆయన నమ్మాడు. అతను తన సరళమైన జీవనానికి మరియు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో క్రమం తప్పకుండా కనిపించే విశ్లేషణాత్మక వ్యాసాలకు ప్రసిద్ధి చెందాడు. ఇపిడబ్ల్యులోని అతని కథనాలలో ఇందిరా గాంధీ పాలన, రిజర్వేషన్ల సమస్య, వివిధ ప్రదేశాలలో ఎప్పటికప్పుడు మానవ హక్కుల ఉల్లంఘన, గుజరాత్ అల్లర్లు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, భూసేకరణ, ఆంధ్రప్రదేశ్లోని షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ, వైయస్ఆర్ ప్రభుత్వం మరియు సిపిఐ-మావోయిస్టుల మధ్య చర్చలు తదితరాలతో ఆయన పాత్ర విడదీయరానిది. రాడికల్ విప్లవం కోసం తాము కృషి చేస్తున్నామని చెప్పుకునే వారి మానవ హక్కుల ఉల్లంఘనను ఆయన తెలుగు వ్యాసం 'చీకటి కోణాలు' లో ప్రత్యక్షంగా ప్రశ్నించారు. మానవ హక్కుల ఫోరం ఏర్పడిన తరువాత, అతను తన కార్య కలాపాలను విస్తరిం చాడు. జమ్మూ కాశ్మీర్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ మరియు ఒరిస్సాలో తీవ్రమైన సామాజిక గందరగోళానికి గురైన ప్రాంతాలను సందర్శించాడు. ఒరిస్సాలో అతని నిజనిర్ధారణ బృందాలు రాయగడ జిల్లాను సందర్శించాయి. ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీల పనితీరులో ఉన్న వంచనను ఆయన విశ్లేషించాడు, బహిర్గతం చేశాడు. బాల గోపాల్ దాదాపు ఒక దశాబ్దం క్రితం న్యాయశాస్త్రం అభ్యసించడం ప్రారంభించాడు. పోలీసులు హత్యలను ఎదుర్కో వటానికి సంబంధించిన డజన్ల కొద్దీ కేసులను వాదించాడు. ఎన్కౌంట ర్లలో పాల్గొన్న పోలీసులపైన హత్యానేరం నమోదు చేయాలని ఆయన గట్టిగా వాదించి విజయం సాధించాడు. ఈ రాష్ట్రంలో ఆయన అడుగుపెట్టని పల్లె లేదు, పట్టణం లేదు. అరణ్యాల నుంచి జనారణ్యాల వరకూ ఎక్కడ ఏ సమస్య తలెత్తినా ఆయన తప్పని సరిగా ఆ ప్రాంతానికి వెళ్లి అధ్యయనం చేసేవాడు. అందుకే మన భౌగోళిక, నైసర్గిక స్థితిగతులపై ఆయనకున్న జ్ఞానం అపారం. ఆయన అక్టోబర్ 8, 2009 రాత్రి హైదరాబాద్ లోని బంజారా హిల్స్ లో గుండెపోటుతో మరణించాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494

# హాస్య రస ప్రధాన చిత్ర దర్శకుడు ఇ.వి.వి - జూన్ 10...ఇ.వి.వి సత్యనారాయణ జయంతి



టాలీవుడ్లో అత్యంత విజయ వంతమైన దర్శకుడిగా ఇ.వి.వి సత్యనారాయణ నిలిచాడు. ఆయన 80 మరియు 90 లలో చాలా సూపర్ హిట్స్ ఇచ్చాడు. రాఘవేంద్ర రావు సీనియర్ దర్శకునిగా దూసుకుపోతున్న రోజుల్లో ఆయనకు గట్టి పోటీ ఇచ్చి అంతకు మించిన హిట్లు అందు కున్నాడు ఇ.వి.వి.. రాఘవేంద్ర రావు స్టార్ హీరోలతో సినిమాలు తీస్తే, ఇ.వి.వి. చిన్న హీరోలు, మధ్యస్థ హీరోలతో తీసి, హిట్లు, సూపర్ హిట్లు సాధించాడు. అలా 70 కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించిన కమర్షియల్ హిట్లతో కె రాఘవేంద్రరావుకు గట్టి పోటీ ఇచ్చాడు. ఆయన సినిమాల్లో కామెడీకి పెద్ద పీట వేసేవాడు. అప్పట్లో చాలా బాధగా ఉంటే.. మద్యం వదిలేసి ఇ.వి.వి సినిమాలు చూడండి అంటూ జోకులు కూడా వేసుకునే వాడట. ఆయన సినిమాల్లో నాన్ స్టాప్ కామెడీ ఉండేది. ఇప్పటికీ ఇ.వి.వి సినిమాలు చూసి ఎంజాయ్ చేసే వాళ్ళు చాలా మంది ఉన్నారు. అయితే తొలుత ఇ.వి.వి తన మొదటి సినిమా ఇ.వి.వి రాజేంద్ర ప్రసాద్ ను హీరోగా పెట్టి తీసిన చెవిలో పువ్వు చిత్రం పెద్ద ఫ్లాప్ అయ్యింది. ఫ్లాప్ అయ్యిందని%ూ% గోదావరిలో దూకి చావాలని అనుకున్నాడట. ఓ సారి రైలు ప్రయాణం చేస్తున్నప్పుడు ఈ అఘాయిత్యానికి పాల్పడడం అనుకుని.. మళ్ళీ తన పిల్లలు, భార్య గుర్తొచ్చి ఆగిపోయాడట. తరువాత ఆయన ప్రతిభను గుర్తించిన నిర్మాత రామానాయుడు 'ప్రేమఖైది' అనే చిత్రం చేసే అవకాశం కల్పించారు. అది పెద్ద హిట్ అయ్యింది. దీంతో వరుస అవకాశాలు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి%ూ% అంటూ ఆయన చిన్న కొడుకు అల్లరి నరేష్ ఓ ఇంటర్వ్యూలో చెప్పడం జరిగింది. ఇ.వి.విగా ప్రసిద్ధిచెందిన ఈదర వీర వెంకట సత్యనారాయణ (జూన్ 10, 1958 – జనవరి 21, 2011) తెలుగు సినిమా దర్శకుడు. తెలుగులో పలు విజయవంతమైన చిత్రాలు నిర్మించిన దర్శకుడు. జంధ్యాల శిష్యుడు. జంధ్యాల ఒరవడిలో హాస్యప్రధాన చిత్రాలు నిర్మించాడు. జంధ్యాల కంటే కొంతఘాటైన హాస్యాన్ని చిత్రాల్లో ప్రవేశ పెట్టాడు. రాజేంద్ర ప్రసాద్ తో ఆ ఒక్కటి అడక్కు, అప్పుల అప్పారావు, ఆలీబాబా అరడజను దొంగలు వంటి చిత్రాలు, నరేష్ తో జంబలకిడి పంబ మొదలైన చిత్రాలు తీశాడు. సీతారత్నంగారి అబ్బాయి, ఏవండీ ఆవిడ వచ్చింది (శోభన్ బాబు) లాంటి చిత్రాల తర్వాత ఆమె, తాళి వంటి మహిళా పరమైన చిత్రాలు తీశాడు. అగ్రనటులైన చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ లతో చిత్రాలు తీశాడు. తర్వాత కుమారులిద్దర్ని హీరోలుగా పరిచయం చేశాడు. సత్యనారాయణ పశ్చిమ గోదావరి జిల్లాలోని దొమ్మేరులో వ్యవసాయ కుటుంబంలో పుట్టాడు. నాన్న వెంకటరావు, అమ్మ వెంకటరత్నం. ఆయన కుటుంబానికి దొమ్మేరులో 70 ఎకరాల పొలం ఉండేది. బాల్యం నుండి సినిమాలంటే ఆసక్తితో కనీసం వారానికి రెండు సినిమాలైన చూసేవాడు. ఇంటర్మీడియట్ వరకు బుద్ధిగానే చదివినా, ఇంటర్కు నిడుదవోలు వెళ్ళిన సత్యనారాయణ కాలేజికి వెళ్ళకుండా రోజూ ఉదయం ఆట, మధ్యాహ్నం ఆట సినిమాలను చూడటం ఎక్కువై, హాజరు తక్కువై ఇంటర్మీయడ్ తప్పాడు. అప్పుడు సత్యనారాయణ తండ్రి ఆయన ను కాలేజీకి పంపించి లాభం లేదని నిశ్చయించి తండ్రితో పాటు పొలం పనులు చూసుకోవటానికి నియమించాడు. 19 యేళ్ళకే 1976లో సరస్వతి కుమారితో పెళ్ళైంది. తర్వాత ఇద్దరు కొడుకులు పుట్టారు. వారికి రాజేష్, నరేష్ అని పేరు పెట్టారు. కొన్నాళ్ళకు వ్యవసాయంలో పెద్ద నష్టాలు రావడంతో పొలాలు అమ్మేయ వలసిన పరిస్థితి కలిగింది. ఆ పరిస్థితుల్లో అక్కడ ఉండటానికి సత్యనారాయణ ఇబ్బంది పడి ఎక్కడికైనా మరో ఊరికి వెళ్ళిపోవాలను కున్నాడు. ఇ.వి.వి స్నేహితుడు నిర్మాత నవతా కృష్ణంరాజు మేనల్లుడైన సుబ్బ రాజును సంప్రదించి ఒక సిఫారుసు ఉత్తరం పట్టుకుని మొదటిసారి మద్రాసు వెళ్ళాడు. నవతా కృష్ణం రాజును కలిసి ఉత్తరం ఇవ్వగా ఆయన సినీరంగంలో జీవితం అనుకున్నంత సులభం కాదని, తిరిగి సొంత ఊరికి వెళ్ళిపొమ్మని హితవు చెప్పాడు. దాంతో పూర్తిగా నిరాశచెందిన సత్యనారాయణ, తిరిగి వెళ్ళినా చేసేదేమీ లేదనుకుని మద్రాసులోనే ఉండి వివిధ ప్రదేశాలు తిరుగు తుండేవాడు. పాండీ బజారుకు వెళ్ళి అక్కడ సహాయ దర్శకులు చెప్పుకునే మాటలు వినేవాడు. ప్రతి ఉదయం నవత కృష్ణంరాజు కార్యాలయం గేటు వద్ద నుంచుని ఉండేవాడు. ఒక నెలరోజుల తర్వాత కుర్రవాని పట్టుదలను చూసి ఏం చెయ్య గలవు అని అడిగాడు. సహాయ దర్శకున్ని అవుతానని చెప్పిన ఇ.వి.విని కనకాల దేవదాసు క్రింద ఓ ఇంటి భాగోతం సినిమాకు సహాయ దర్శకునిగా అవకాశం కల్పించాడు. రంభ, రచన, ఊహ, రవళి నటీమణులను తెలుగు చిత్ర సీమకు అయన పరిచయం చేశాడు. చెవిలో పువ్వు (1990), ప్రేమ ఖైదీ (1991), అప్పుల అప్పారావు (1991), సీతారత్నం గారి అబ్బాయి (1992), 420 (1992), జంబలకడి పంబ (1992), ఏవండీ ఆవిడ వచ్చింది (1993), వారసుడు (1993), ఆ ఒక్కటీ అడక్కు (1993), అబ్బాయి గారు (1993), ఆలీబాబా అరడజను దొంగలు (1994), హలో బ్రదర్ (1994), మగ రాయుడు (1994), ఆమె (1994), అల్లుడా మజాకా (1995), ఆయనకి ఇద్దరు (1995), తెలుగు వీర లేవరా (1995), ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు (1996), అదిరింది అల్లుడు (1996), అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి (1996), చిలక్కొట్టుడు (1996), వీడెవడండీ బాబు (1997), నేను ప్రేమిస్తున్నాను (1997), తాళి (1997), మా నాన్నకి పెళ్ళి (1997), ఆవిడా మా ఆవిడే (1998), మావిడాకులు (1998), కన్యాదానం (1998), నేటి గాంధీ (1999), సూర్యవంశం (1999), పిల్ల నచ్చింది (1999), చాలా బాగుంది (2000), గొప్పింటి అల్లుడు (2000), అమ్మో ఒకటో తారీఖు (2001), మా ఆవిడ మీద ఒట్టు మీ ఆవిడ చాలా మంచిది (2001), థాంక్యూ సుబ్బారావ్ (2001), వీడెక్కడి మొగుడండి (2001), హాయ్ (2002), తొట్టి గ్యాంగ్ (2002), ఆడంతే అదోటైపు (2003), మా అల్లుడు వెరీగుడ్డు (2003), ఆరుగురు పతివ్రతలు (2004), ఎవడి గోల వాడిది (2005), నువ్వంటే నాకిష్టం (2005), కితకితలు (2006), అత్తిలి సత్తిబాబు ఎల్ కెజి (2007), పెళ్ళైంది కానీ... (2007), ఫిట్టింగ్ మాస్టర్ (2009), బెండు అప్పారావ్ ఆర్ఎంపి (2009), బురిడి (2010), కత్తి కాంతారావు (2010) తదితర చిత్రాలకు దర్శకత్వం వహించాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494

# గుండమ్మ కథ చిత్ర నిర్మాణ నేపథ్యం - 63 వసంతాల గుండమ్మ కథ చిత్రరాజం

తెలుగు ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసి, నాటి, నేటి తరాల సినిమా ప్రేక్షకుల ఆదరాన్ని చూరగొన్న అలనాటి చిత్రరాజం గుండమ్మ కథ. తెలుగు చిత్ర సీమలో క్షణం తీరిక దొరకని అగ్రశ్రేణి నటులతో నిర్మించిన మల్టీ స్టారర్ సినిమా అది. 1962 జూన్ 7న విడుదలై 62 వసంతాలు పూర్తి చేసుకున్న ఆ చిత్రం నిర్మాణం వెనక విశేషాలు ఎన్నో...ఎన్నెన్నో... ఎన్టీఆర్, ఏఎన్నార్ లాంటి హీరోలు ఉన్నా, "గుండమ్మ కథ" అని సూర్యకాంతం పాత్ర పేరుమీద సినిమా పేరు పెట్టడమే గొప్ప వైవిధ్యం. జానపద బ్రహ్మగా పేరొందిన విఠలాచార్య కన్నడంలో "మనె తుంబిద హెణ్ణు" పేరిట కుటుంబ కథాచిత్రాన్ని ముందుగా తీశారు. నిర్మాత అయిన విఠలాచార్య, చిత్ర నిర్మాణానికి వాహినీ స్టూడియోస్ అధినేత బి.నాగిరెడ్డి సహకారం తీసుకున్నారు. ఆ కృతజ్ఞతతో నాగిరెడ్డి అడగగానే సినిమా హక్కులను విఠలాచార్య ఆయనకి ఇచ్చేశారు.. అయితే ఇందులో గుండమ్మ కుటుంబ వ్యవహారాలు నాటకీయంగా సాగుతూ, నాగిరెడ్డికి తమాషాగా అనిపించాయి. దాంతో విజయా ప్రొడక్షన్స్ చరిత్రలోనే "తొలిసారి ఓ రీమేక్" చేసేందుకు సిద్ధపడ్డారు. కథలో చిన్న చిన్న మార్పులు చేసి డి.వి.నరసరాజుతో ట్రీట్మెంట్, మాటలు రాయించారు నాగిరెడ్డి. సినిమాకు దర్శకునిగా నాగిరెడ్డి సోదరుడు బి.ఎన్.రెడ్డిని అనుకున్నారు. అయితే బి.ఎన్.రెడ్డి కళాత్మక చిత్రాల తరహా దర్శకుడు కావడమూ, ఇది ఆయన తరహా సినిమా కాకపోవడంతో పాటు బి.ఎన్.రెడ్డి లాంటి అగ్ర దర్శకుడు ఓ రీమేక్ సినిమా చేస్తే బాగుండదన్న ఆలోచనతో, నాగిరెడ్డే ఇతర దర్శకునితో చేద్దామని నిర్ణయించుకున్నారు. పి.పుల్లయ్య దర్శకత్వం వహిస్తే బావుంటుందని, ఆయనకు నరసరాజు సిద్ధం చేసిన డైలాగ్ వెర్షన్ పంపారు. అది చదివిన పుల్లయ్య ఈ కథ, ట్రీట్మెంట్ నాకు నచ్చలేదు అని ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. దాంతో సినిమా నిర్మాణం మళ్ళీ వెనుక బడింది. ఈ స్క్రిప్ట్ తన సన్నిహితుడు, సహ నిర్మాత, రచయిత అయిన చక్రపాణికి ఇచ్చారు నాగిరెడ్డి. అయితే చక్రపాణికి గుండమ్మ కుటుంబ వ్యవహారాలు, ఆ పాత్రలు బాగా నచ్చిన నాగిరెడ్డి మాత్రం ఎలాగైనా సినిమా తీయాల్సిందేనన్న పట్టుదలతో ఉండిరి. ఇక చక్రపాణి మొత్తం స్క్రిప్టును తిరగరాసే పనిలో, "విలియం షేక్స్పియర్ రాసిన ద టేమింగ్ ఆఫ్ ద ష్రూ" నాటకంలో కథానాయికల పాత్రలను, వారి స్వభావాలను ఆధారం చేసుకుని కథను తిరగ రాశారు. సినిమాకు దర్శకునిగా చివరకు కమలాకర కామేశ్వరరావుని ఎంచుకున్నారు నాగిరెడ్డి. తర్వాత చక్రపాణి తిరగ రాసిన కథకు ట్రీట్మెంట్, సీనిక్ ఆర్డర్ కోసం చక్రపాణితో, కమలాకర కామేశ్వరరావు, డి.వి.నరసరాజు కథా పర చర్చలు జరిపారు. ఆ చర్చల్లో భాగంగా అప్పటివరకూ ఉన్న గుండమ్మ భర్త పాత్రను తొలగించి, గుండమ్మను వితంతువుగా చూపిద్దామని చక్రపాణి నిర్ణయించారు. మిగతా గుండమ్మ కుటుంబాన్నంతా యధాతథంగా వాడుకున్నారు. సినిమా అనుకున్ననాడే గుండమ్మ పాత్రకు సూర్యకాంతం అయితేనే సరిపోతారని భావించారు. గుండమ్మ నిజానికి తెలుగుపేరు కాదు కన్నడ పేరు. కన్నడంలోని ఈ సినిమా మాతృకలో ఓ పాత్ర పేరు గుండమ్మ. కథను తిరగరాసే క్రమంలో ఆ గుండమ్మ పాత్రను ప్రధానపాత్రగా చేసుకుని, అదే పేరు పెట్టాలని నిర్ణయించారు చక్రపాణి. , "ఇందులో ఏముంది, పెడితే అదే తెలుగు పేరు అవుతుంది" అని గుండమ్మ అన్న పేరే ఖాయం చేశారు. సినిమాలో నటించిన ఇద్దరు కథానాయకులు ఎన్టీఆర్, ఏఎన్నార్ అప్పటికే తెలుగు సినిమా పరిశ్రమలో టాప్ హీరోలు. సినిమా విడుదల సమయంలో టైటిల్స్ లో ఎవరి పేరు ముందు వేయాలి, ఎవరిది తర్వాత వేయాలి వంటి సందేహాలు వచ్చాయి. అయితే పరిష్కార





మార్గంగా అసలు తెరపై పేర్లే వేయకుండా ఫోటోలు చూపించాలని నిర్ణయించు కున్నారు. మొదట ఎన్టీ రామారావు, నాగేశ్వరరావు, సావిత్రి, జమున, ఎస్వీ రంగారావుల ఫోటోలు ఒకేసారి తెరపై వేసి, తర్వాత ఒకేసారి సూర్యకాంతం, ఛాయాదేవి, రమణారెడ్డి, హరనాథ్, ఎల్.విజయలక్ష్మిల ఫోటోలు వేశారు. సినిమాలో ముఖ్యపాత్రలు వేసిన ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి, ఎస్.వి. రంగారావు, సూర్యకాంతం తదితరులు పరిశ్రమలో చాలా బిజీ ఆర్టిస్టులు. వీళ్ళందరిపై ఒకేసారి షూటింగ్ చేయాలంటే వాళ్ళ డేట్స్ కలిసేవి కాదు. విజయా వారికి చెందిన వాహినీ స్టూడియోలో గుండమ్మ ఇంటి సెట్ వేసి ఉంచారు. రోజూ ఉదయం చక్రపాణి ఆఫీసుకు వెళ్లి, రామారావు, సావిత్రి, నాగేశ్వరరావు, ఎస్వీఆర్ మొదలైన నటులకు ఫోన్ చేసేవారు. ఫోన్లో ఆరోజు వాళ్ళ షెడ్యూల్ ఏమిటో కనుక్కునే వారు. వచ్చిన వాళ్ళలో స్క్రిప్ట్ ని బట్టి వాళ్ళ మధ్య కాంబినేషన్ సీన్లు చూసుకుని షూటింగ్ చేసేవారు. సినిమాలో "కోలో కోలోయన్న" పాట ఎన్టీఆర్ – సావిత్రి, ఏఎన్నార్ – జమున జంటలు పక్కపక్కనే ఉండి పాడుకుంటున్నట్టు చూపించారు. కానీ నలుగురు ఒకేసారి కలిసి చేయనే లేదు. ఎవరికి ఎప్పుడు ఖాళీవుంటే వారితో అప్పుడు పాటను తీసేశారు. ఎడిటింగ్ లో ఆ తేడాలు తెలియ కుండా బహు జాగ్రత్తపడ్డారు. సినిమా విడుదలకు ఇంకా పదిరోజుల సమయం ఉందనగానే, ఎల్వీ ప్రసాద్ ఇంట్లో జరిగిన పెళ్ళి వేడుకల్లో గుండమ్మ కథ సినిమాను ప్రదర్శించగా సినీ రంగ ప్రముఖులు పలువురు విమర్శనాస్త్రాలు సంధించారు. నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి, జమున, ఎస్.వి.రంగారావు, సూర్యకాంతం, ఛాయాదేవి , రమణారెడ్డి , హేమలత , హరనాథ్ , ఎల్ విజయలక్ష్మి , ముక్కామల, ఋష్యేంద్ర మణి, రాజనాల తదితర అగ్ర నేతల మేలు కలయిక కూర్పుతో, గుండమ్మకథ సినిమా జూన్ 7, 1962న రాష్ట్ర వ్యాప్తంగా విడుదలై హౌస్ ఫుల్ కలెక్షన్లతో నడిచి సదరు విమర్శలను త్రిప్పి కొట్టి, రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఎంత హాయి ఈ రేయి, ఎంత మధుర మీ హాయిబీ కోలోకోలో యన్నకోలో నాసామి కొమ్మలిద్దరు మాంచిజోడుబీ ప్రేమయాత్రలకు బృందావనము నందనవనము ఏలనోబీ మౌనముగా నీ మనసు పాడిన వేణుగానమును వింటిలేబీ లేచింది నిద్ర లేచింది మహిళాలోకం దద్దరిల్లింది పురుష ప్రపంచంబీ వేషము మార్చెనూ భాషను మార్చెను మోసము నేర్చెను అసలు తానే మారెనుబీ సన్నగవీచే చల్లగాలికి కనులు మూసినా కలలాయేబీ అలిగిన వేళనే చూడాలి గోకుల కృష్ణుని అందాలూ లాంటి పాటలు చిరస్థాయిగా నిలిచాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494

# భారత్ లో పేదలు ఏడు కోట్లేనట !

భారత్ అంటే అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఇంకా ఉంది. భారత్ కి స్వాతంత్రం వచ్చి ఇప్పటికి ఏడున్నర దశాబ్దాల కాలం అయింది. భారత్ తో పాటు గా స్వాతంత్ర్యం పొందిన దేశాలు కానీ అదే సమయంలో అభివృద్ధి కోసం ప్రయత్నం చేసిన దేశాలు కానీ చాలా ముందుకు వెళ్ళిన సంగతిని కూడా గుర్తు చేస్తూ ఉంటారు. ఇక భారత్ అభివృద్ధి ఇపుడు వేగంగా సాగుతోందని చెబుతున్న అభివృద్ధి చెందిన దేశం అన్న ట్యాగ్ ఎపుడు దక్కుతుంది అన్నది మాత్రం ఇంకా తెలియడం లేదు. ఇదిలా ఉండగా భారత దేశంలో పేదరికం చాలా ఎక్కువ అని చెబుతారు. ఈ దేశంలో 140 కోట్లకు పైగా జనాభాలో నలభై శాతం పేదలు ఉన్నాయని గతంలో అనేక గణాంకాలు వెల్లడించాయి. అంటే దాదాపుగా యాభై కోట్ల దాకా అన్న మాట. అయితే ఈ పేదరికం ఒక్కసారిగా గాయబ్ అయ్యారని అంటున్నారు. అది ఎవరో చేసిన సర్వే కాదు మరెవరో తయారు చేసిన గణాంకాల నివేదిక కానే కాదు, ప్రపంచ బ్యాంకు ఇచ్చిన ఒక నివేదిక. గడచిన దశాబ్ద కాలంలో భారత్ లో పేదరికం పెద్ద ఎత్తున తగ్గిందని ఆ నివేదిక వెల్లడించింది. ఇక చూస్తే కనుక 2011-12లో 27.1 శాతంగా ఉన్న పేదరికం నుంచి 2022-23 నాటికి 5.3 శాతానికి పేదరికం రేటు పడిపోయిందని పేర్కొంటోంది. ఇక ఈ మధ్య కాలంలో సుమారుగా 26.9 కోట్ల మందికి తీవ్ర పేదరికం నుంచి విముక్తి పొందారని ఆ నివేదిక చెబుతోంది. బహుముఖ పేదరిక సూచీ కూడా 2022-23 నాటికి 15.5 శాతానికి తగ్గుదలగా ఉందని వివరించింది. ఈ మార్పు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో చూసుకుంటే సమానంగా కనిపించడం గమనార్హమని ఈ నివేదికలో పేర్కొంటున్నారు. ఈ నివేదికను ఒక్క సారి పరిశీలిస్తే 2011 నాటికి భారత్ లో 16.2 శాతంగా తీవ్ర పేదరికంలో ఉన్న భారతీయులు అదే 2022-23 నాటికి 2.3 శాతానికి తగ్గారని వివరించింది. అంటే 2011లో 20.59 కోట్ల మంది జనాభా తీవ్ర పేదరికంలో ఉంటే 2022 నాటికి 3.36 కోట్లకు ఆ సంఖ్య తగ్గింది అని చెబుతోంది ఈ నివేదిక. ఇక పల్లెలలో చూసుకుంటే తీవ్ర పేదరికం 18.4 శాతం నుంచి 2.8 శాతానికి తగ్గింది. అదే పట్టణ ప్రాంతాలలో ఇది 10.7 శాతం నుంచి 1.1 శాతానికి పడిపోయిందని ప్రపంచ బ్యాంక్ గణాంకాలు తెలియచేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో తీవ్రమైన పేదరికం తగ్గిందని వివరించి మరీ చెబుతోంది ఈ నివేదిక. ఇలా తీవ్రమైన పేదరికం నుంచి బయటపడడానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కారణం అని అంటోంది ఈ నివేదిక తద్వారా 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికాన్ని జయించడంలో ఈ పథకాలు సహాయపడ్డాయని ఆర్థిక నిపుణులు సైతం విశ్లేషిస్తున్నారు. అయితే



ఇక్కడ ఒక విషయం ఉందని అంటున్నారు. భారత దేశంలో తీవ్రమైన పేదరికం నుంచి మాత్రమే ఈ పాతిక కోట్ల మంది బయటపడ్డారు అన్నది ఈ నివేదిక సారాంశం. అంటే సాధారణ పేదరికం అలాగే ఉందని ఈ నివేదికను బట్టి అనుకోవచ్చా అన్నది ఒక సందేహం. ఇక తీవ్రమైన పేదరికం అంటే నిర్వచనం చెప్పలేదు. కానీ కనీసం ఒక పూటకు కూడా పిడికెడు అన్నం దక్కని వారు అని భావించవచ్చు. ఇపుడు వారికి పథకాల పుణ్యమాని అది దక్కుతోంది. అంతే తప్ప వారి ముంగిటి నుంచి పేదరికం ఇంకా వీడలేదు అన్నది కూడా నిపుణులు విశ్లేషణగా ఉంది. ఈ దేశంలో అయిదు నుంచి పది శాతం సంపన్నులు ఉన్నారు. అలాగే ఎగువ మధ్యతరగతి వర్గాలు మరో పది శాతం ఉంటారు. ఈ రెండూ తీసేస్తే మిగిలిన వర్గాలు అన్నీ పేదరికంతోనే ఉన్నాయన్నది ఒక కచ్చితమైన నివేదికగా ఉంది. అంతదాకా ఎందుకు ఈ రోజుకీ ఎనభై కోట్ల మంది ప్రజలను పేదలుగా గుర్తించి ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా రేషన్ సరుకులు ఇస్తున్నాయి. అంటే భారత్ లో పేదరికం ఇంకా అలాగే ఉందని వీటిని బట్టి అర్థం అవుతోంది. ఇక ఏడున్నర దశాబ్దాలు అంటే చాలా ఎక్కువ అని అంటున్నారు. మరి తీవ్రమైన పేదరికం నుంచి సాధారణ పేదరికంలోకి రావడానికి ఇంతటి సుదీర్ఘమైన కాలం పడితే అసలు పేదరికం లేని దేశంగా భారత్ ఎపుడు ఆవిర్భవిస్తుంది అన్నదే అతి పెద్ద చర్చగా ఉంది. దీనికి జవాబు కోసం ఇంకా చాలా కాలం చాలా దూరం ప్రయాణించాల్సిందే అని అంటున్నారు మేధావులు.

చురకలు

## సంపాదకీయం

## బంగ్లాదేశ్-చైనా-పాకిస్తాన్ సాన్నిహిత్యం
# భారత్‌కు భవిష్యత్ ముప్పు?

భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా దూసుకుపోతోంది. ఇటీవలే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుంచి నాలుగో స్థానానికి చేరింది. ఇది దేశానికి గర్వకారణమే అయినప్పటికీ, పెరుగుతున్న అభివృద్ధి కొన్ని సవాళ్లను కూడా తీసుకొస్తుంది. ముఖ్యంగా చుట్టూ ఉన్న దేశాలతో సంబంధాలు, వాటి నుంచి ఎదురయ్యే సంభావ్య ముప్పులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, బంగ్లాదేశ్... చైనా ,పాకిస్తాన్‌లతో సన్నిహిత సంబంధాలు పెంచుకోవడం భారత్‌కు ఒక ప్రధాన భద్రతాపరమైన ఆందోళనగా మారుతోంది.

**పాకిస్తాన్ కుట్రలు కొనసాగుతున్నాయి...** పాకిస్తాన్ నుంచి భారత్‌కు భద్రతాపరమైన ముప్పులు ఎప్పటినుంచో ఉన్నాయి. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం, దేశంలో అంతర్గత అశాంతిని రెచ్చగొట్టడంలో పాకిస్తాన్ కీలక పాత్ర పోషిస్తోంది. కాశ్మీర్ విషయంలో పాక్ తన వైఖరిని మార్చుకోలేదు. ఇప్పుడు చైనాతో కలిసి పాకిస్తాన్ చేస్తున్న దూకుడు భారత భద్రతా వ్యవస్థకు గట్టి పరీక్షనే పెడుతోంది.

**చైనాతో బంగ్లాదేశ్ సాన్నిహిత్యం ఆందోళనకరం...** ఇటీవలి కాలంలో బంగ్లాదేశ్, చైనా మధ్య వాణిజ్య, ఆర్థిక ఒప్పందాలు గణనీయంగా పెరిగాయి. చైనా అందిస్తున్న భారీ రుణాలపై బంగ్లాదేశ్ ఆసక్తి చూపడం, బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టులో భాగంగా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసుకోవడం భవిష్యత్తులో భారత్‌కు సవాలుగా మారే అవకాశం ఉంది. చైనా-బంగ్లాదేశ్ సంబంధాలు బలపడితే, భారత్‌కు వ్యతిరేకంగా ఒక సమీకృత శత్రుశక్తిగా ఎదిగే ప్రమాదం ఉంది.

**భారత ప్రజాస్వామ్యానికి ముప్పు?...** బంగ్లాదేశ్ ఒకప్పుడు భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించింది. అయితే, ప్రస్తుతం రాజకీయంగా కొంత దూరం పాటిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బంగ్లాదేశ్ కూడా చైనా, పాకిస్తాన్‌లతో కలిసి భారత్‌పై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేస్తే, అది అంతర్గత స్థాయిలో భారత శక్తిని దెబ్బతీసే అవకాశం ఉంది.

**భవిష్యత్ దృష్టితో ముందుకు సాగాలి...** శత్రుదేశాల కలయిక భారత్‌కు ఎంత ప్రమాదకరమో చరిత్రే చెబుతోంది. అలాంటి పరిస్థితుల్లో భారత్ తన సమీప దేశాలతో సానుకూల దౌత్య సంబంధాలు కొనసాగించడమే కాకుండా, భద్రతాపరమైన చర్యల్లో ముందుండాలి. అంతర్జాతీయ స్థాయిలో మిత్రదేశాల మద్దతు కూడగట్టుకుంటూ, చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల మధ్య బలపడుతున్న సంబంధాలను సరిదిద్దే విధంగా భారత్ తన వ్యూహాలను సిద్ధం చేయాలి. భారత్ అభివృద్ధి చెందుతున్న సమయంలో చుట్టూ ఉన్న పొరుగు దేశాలు శత్రువుల ముసుగులో కలిసి పనిచేయడం దేశ భద్రతకు తీవ్ర హెచ్చరిక. ఇది పెద్ద సమస్యగా మారకముందే, భారత్ తగినంత ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# పాఠశాలల్లో "ప్రతిజ్ఞ" రచయిత పైడిమర్రి సుబ్బారావు - జూన్ 10...పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి




మనదేశంలో ఉదయం దాదాపు ప్రతి పాఠశాలలో ప్రార్థనా సమయంలో ఇంగ్లీష్ లోనో, తెలుగు లోనో, ఇతర భాషలలోనో తప్పనిసరిగా పిల్లలు చదివే "భారత దేశం నా మాతృభూమి, భారతీయులందరూ నా సహోదరులు.." అనే "ప్రతిజ్ఞ" (ప్లెడ్జ్) రాసిన గొప్ప జాతీయ భావాలు కలిగిన రచయిత మాత్రం చాలా మందికి తెలియదు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాల దిన చర్యను ప్రారంభించే ముందు వందే మాతరం, జనగణమన జాతీయ గీతాలతో పాటు 'భారతదేశము నా మాతృభూమి..' అనే ప్రతిజ్ఞను సామూహికంగా చేసే విషయం నిత్య అనుసరణీయమే. వందేమాతరం రాసింది బంకించంద్ర ఛటర్జీ, జనగణమన రాసింది రవీంద్రనాథ్ ఠాగూర్ అని, సారే జహాసే అచ్ఛా రాసింది మహమ్మద్ ఇక్బాల్ అని పిల్లలను అడిగితే సమాధానం చెప్తారు. పాఠశాల క్విజ్ పోటీలలో తప్పక వేసే ప్రశ్నలు ఇవి. కానీ ప్రతిజ్ఞ రచయిత గురించి పుస్తకాలలో లేక ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తెలియ పరచకుండా ఉంచడమే బాధాకరం. తెలంగాణ లోని నల్గొండ సమీపంలోని అన్నెపర్తిలో పుట్టడమే ఆయన చేసుకున్న పాపమో, లేక ఈ తెలంగాణ గడ్డకు కలిగిన శాపమో? నాటి పాలకుల పక్షపాత వైఖరియో తెలియదు కాని...జాతీయ భావం ప్రేరేపించే ప్రతిజ్ఞ యాభై ఏళ్లకు పైబడి పాఠ్య పుస్తకాల్లో ముద్రితమై కనిపిస్తున్నా అది రాసిన రచయిత పేరు దశాబ్దాలుగా ఎక్కడా ప్రస్తావించక పోవడం బాధాకరం. తెలుగుతో పాటు సంస్కృతం, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, గుజరాతీ, మరాఠీ.. తొమ్మిది భాషల్లోకి అనువాదమై, ఆరు దశాబ్దాల కిందటి నుంచే పాఠ్య పుస్తకాల్లో ప్రచురించిన ఈ ప్రతిజ్ఞను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే గుర్తించడం గమనార్హం. కారణం ఈ ప్రతిజ్ఞను రాసింది తెలంగాణ వాసి కావడమే. ఆయనే నల్గొండ జిల్లా, అన్నెపర్తికి చెందిన తెలుగు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు. వెంకట సుబ్బారావు (1916 జూన్ 10 - 1988 ఆగష్టు 13) 1916, జూన్ 10న పైడిమర్రి వెంకట రామయ్య, రాంబాయమ్మ దంపతులకు నల్లగొండ కేంద్రానికి సమీపంలో ఉండే అన్నెపర్తిలో జన్మించారు. విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండ లోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు. హైదరాబాద్ రాష్ట్రం లోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం 1988 ఆగష్టు 13 న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన జమిందారీ, భూస్వామ్య వెట్టిచాకిరీని నిరసిస్తూ ఎన్నో కథలు రాశారు. ఆయన తన 18వ ఏటనే కాలభైరవుడు (1936) పేరున చిన్న నవల రాశారు. దేవదత్తుడు, తులసీదాసు, త్యాగరాజు మొదలైన పద్య కావ్యాలు, బ్రహ్మచర్యము, గృహస్థ జీవితము, స్త్రీ ధర్మము, ఫిరదౌసి, తార, శ్రీమతి అనే నాటకాలు రాశారు. సింగపురీ నృకేసరీ శతకం, బాల రామాయణం మొదలైన రచనలు, అనేక అనువాద రచనలు కూడా చేశారు. గోలకొండ, సుజాత, ఆంధ్రపత్రిక, భారతి, నవజీవన్, ఆనందవాణి పత్రికలలో అయన రచనలు ప్రచురితమైనాయి. ఆయన పద్యాలు గోలకొండ కవుల సంచికలోను, కథలు ఉషస్సు కథా సంకలనం, తెలంగాణ తొలితరం కథలులో 'నౌకరి' కథ వచ్చింది. 1945లోనే ఉషస్సు కథల సంపుటిని వెలువరించారు. 1945-46 లలో నల్లగొండలో జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్తు సభలలో ప్రముఖ పాత్ర వహించారు. పదవీ విరమణ తర్వాత సర్వేలు గురుకుల పాఠశాలలో కొంతకాలం స్వచ్ఛందంగా పనిచేశారు. 1962 చైనా యుద్ధ సమయంలో ఆయన విశాఖ పట్టణంలో ట్రెజరీ అధికారిగా పనిచేస్తున్న కాలంలో, విద్యార్థులలో దేశభక్తిని పెంపొందిం చేందుకు పైడిమర్రి "ప్రతిజ్ఞ"కు రూపకల్పన చేశారు. రాసిన దానిని 1963లో విశాఖపట్నం లోని ఒక పాఠశాలలో తొలిసారిగా ప్రతిజ్ఞ చేయించారు. "ప్రతిజ్ఞ"ను ప్రముఖ రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు తెన్నేటి విశ్వనాథం దృష్టికి తీసుకెళ్లగా, సాహితీవేత్త అయిన అప్పటి విద్యాశాఖ మంత్రి, విజయ నగరం రాజాగా పేరు గాంచిన పీవీజీ రాజుకు అంద చేశారు. ఆయన నాటి ముఖ్య మంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డితో చర్చించారు. 1963లో "ప్రతిజ్ఞ" ను పాఠ్య పుస్తకాలలో చేర్చి ప్రతిరోజు ప్రార్థనా సమయంలో చదివిం చాలని ఉత్తర్వులు జారీ చేసారు. 1964లో బెంగుళూరులో ప్రముఖ న్యాయ నిపుణుడు మహ్మద్ కరీం చాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహా మండలి సమావేశం జరిపి నపుడు జాతీయ ప్రతిజ్ఞగా స్వీకరించారు. తరువాత దీన్ని అన్ని భాషల్లోకి అనువాదం చేయించారు. 1965 తర్వాత కేంద్ర ప్రభుత్వం దీనిని ఇంగ్లీష్ లో పొందుపరచి దేశవ్యాప్తంగా అమలు చేశారు. పైడిమర్రి రాసిన ప్రతిజ్ఞలో కాలాను గుణంగా కొన్ని స్వల్ప మార్పులు జరిగి, కొన్ని గ్రాంథికం పదాల స్థానంలో వాడుక భాష వాడి, ఇతర భాషల్లోకి అనువదించి 1963 నుంచి దేశ ప్రతిజ్ఞగా అమలులోకి తెచ్చారు.1965 జనవరి 26 నుంచి దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో చదువు తున్నారు. పాఠ్య పుస్తకాలలో ప్రచురిస్తున్న ప్రతిజ్ఞకు పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక 2014 నవంబరు 27న రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి, రాష్ట్ర గవర్నర్‌కు తెలంగాణ సీఎం కెసీఆర్ కు విజ్ఞప్తి చేయగా, 2015-16 విద్యా సంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అన్ని భాషల్లో అన్ని ప్రభుత్వ పాఠ్య పుస్తకాలలో జాతీయ ప్రతిజ్ఞతో పాటు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రిస్తున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# పలు ప్రత్యేకతల సమాహారం దుగ్గిరాల జీవనయానం

## సేవా నిరతికి ప్రతిరూపం దుగ్గిరాల జీవితం - జూన్ 10..ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య వర్ధంతి



తమ తాత తండ్రుల నాటినుండి నివాసముంటున్న తమ ఆవాస స్థానాలను వదిలి, కేవలం ఒక వ్యక్తి చెప్పిన మాటలను తూ.చా తప్పకుండా పాటించి ఒక నిరసన తెలియ జేయడం కోసం లక్ష్య సాధన ధ్యేయంగా గ్రామాలనే వదిలి వెళ్ళిన ఉదంతం చరిత్రలో ఎక్కడా జరిగి ఉండదు. భారత స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఒక అరుదైన స్ఫూర్తిదాయకమైన సంఘటన తెలుగు నేలపై జరిగింది. ఒకరు కాదు ఇద్దరు కాదు, పదులు కాదు వందలు కాదు, రెండు గ్రామాలకు చెందిన పదిహేడు వేల మంది ఆ సంఘటనలో స్వగ్రామాలు వదిలి సరి హద్దులు దాటి బయట సంవత్సర కాలంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ లక్ష్యం కోసం జీవితాలు గడపాలంటే అది సామాన్యమైన విషయం కాదు. అలా వేలాది మంది అభిమానాన్ని చూరగొని వారిని సంఘటితంగా ఒక్కటిగా నిలిపిన ఘనత ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు, తెలుగు వాడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య దక్కుతుంది. 1919 లో బ్రిటిష్ ప్రభుత్వం చీరాల, పేరాల రెండు గ్రామాలను కలిపి మునిసిపాలిటీగా విలీనం చేసినపుడు, అధిక పన్నులు చెల్లించడానికి వ్యతిరేకంగా జరిగిన సహాయ నిరాకరణోద్యమానికి గోపాల కృష్ణయ్య నాయకుడు. ఇది స్వాతంత్ర్య పోరాటంలో ఒక ముఖ్యమైన గాంధీజీ సందర్శించి అభినందించిన చీరాల పేరాల సమరం సుప్రసిద్ధం, ముఖ్య ఘట్టం. స్వాతంత్ర్య సమర యోధుల్లో ప్రముఖుడు దుగ్గిరాల గోపాల కృష్ణయ్య (జూన్ 2, 1889 - జూన్ 10, 1928) ఆయన గొప్ప నాయకుడు, సాహసికుడు, వక్త, కవి, గాయకుడు. ఆంధ్ర రత్న బిరుదు బిరుదాంకితుడు. కృష్ణా జిల్లా, పెనుగంచిప్రోలు గ్రామంలో 1889 జూన్ 2 న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జన్మించారు. ఆయన పుట్టిన మూడవ రోజునే తల్లి సీతమ్మ, మూడో ఏట తండ్రి కోదండ రామస్వామి మరణించారు. అప్పటినుండి పినతండ్రి, నాయనమ్మల సంరక్షణలో పెరిగారు. కూచిపూడిలోను, గుంటూరులోను ప్రాథమిక విద్య జరిగింది. హైస్కూలులో చదివే సమయంలోనే 'జాతీయ నాట్య మండలి' స్థాపించి సంగీత, నాటక కార్యక్రమాలు నిర్వహించారు. అయితే చదువుపై అంత శ్రద్ధ చూపక పోవడం చేత మెట్రిక్యులేషనులో తప్పారు. తరువాత బాపట్ల లో చదివి ఉత్తీర్ణుడయ్యారు. నడింపల్లి వెంకట లక్ష్మీ నరసింహారావు అనే ఒక మిత్రుని సాయంతో 1911లో స్కాట్లండు లోని ఎడింబరో విశ్వ విద్యాలయంలో ఎం.ఎ. చదివారు. తరువాత ఆనంద కుమార స్వామితో కలసి కొంతకాలం పని చేశారు. 1916లో తిరిగి భారతదేశం వచ్చిన దుగ్గిరాల, నాటి జాతీయ ఉద్యమానికి కేంద్రంగా వున్న బందరులోని జాతీయ కళాశాలలో ఉద్యోగంలో చేరారు. ఆ సమయంలో నందికేశ్వరుడు రచించిన 'అభినయ దర్పణం' అనే గ్రంథాన్ని "%ఙప్త్రవ వీఙతీతీశీతీ శీట +వం-ౕబతీవ%,'' అన్న పేరుతో సంస్కృతం నుండి ఆంగ్లంలోకి అనువదించారు. ఇది 1917లో 'కేంబ్రిడ్జ్ - హార్వర్డ్ యూనివర్శిటీ ప్రెస్' వారిచే ప్రచురించ బడడం విశేషం. 1920లో మహానందిలో జరిగిన ఆంధ్రమహాసభకు అధ్యక్షుడిగా ఒక అంగవస్త్రం, ఒక కండువా, మెడలో రుద్రాక్షమాలతో ప్రత్యక్షమయ్యారు. నాటి నుండి దాదాపుగా ఆయన జీవితం శ్రీరామచంద్రునికే అంకితమన్న రీతిలో సాగింది. 1921 లో గుంటూరులో ఒక సభలో "ఆంధ్ర రత్న" అన్న బిరుదుతో ఆయనను సత్కరించారు. 1921లో బెజవాడ కాంగ్రెస్ సమావేశాలను దుగ్గిరాల తయారు చేసిన వెయ్యిమంది ఎర్రని చొక్కా కుంకుమ బొట్టు ధరించిన ఆ రామదండు సేవా దళమే విజయవంతం చేశారు. రామదండు దుగ్గిరాలకు నమ్మిన బంట్లుగా మిగిలారు. ఆయనలోని ప్రతిభకు అలిండియా కాంగ్రెస్ కార్యదర్శి పదవి దక్కింది. ఆ పదవి దక్కించుకున్న అతి పిన్న వయస్కుడు, తొలి ఆంధ్రుడు ఆయనే. జాతీయ కాంగ్రెస్ ఆఫీసును విజయ వాడలో పెట్టించింది దుగ్గిరాల గోపాలకృష్ణయ్యే. కుటిల రాజకీయ నేతల మధ్య ఇమడలేక, 1923 తర్వాత రాజకీయాలు తనకు వద్దని దూరంగా జరిగారు. తాను వ్యక్తిగా కొత్త జీవితానికి శ్రీకారం చుట్టారు. తెలుగు నాట జానపద కళా రూపాల పునరుద్ధరణకు, గ్రంథాలయాల వ్యాప్తికి గోపాల కృష్ణయ్య ఇతోధికంగా కృషి చేశారు. ఆయన ప్రచారం చేసిన జానపద కళారీతులు - తోలు బొమ్మలాట, జముకుల కథ, బుర్రకథ, వీధి నాటకాలు, సాము గరిడీలు, గొల్ల కలాపం, బుట్ట బొమ్మలు, కీలు గుర్రాలు, వాలకాలు, గోసంగి, గురవయ్యలు, సరదా కథ, కిన్నెర కథ, కొమ్ము బూర, జోడు మద్దెల, పల్లె సుద్దులు, తూర్పు భాగోతం, చుట్టు కాముడు, పిచ్చికుంట్లవాళ్ళ కథ, సాధనా శూరులు, పలనాటి వీర విద్యావంతులు తదితరాలు ఉన్నాయి. 'సాధన' అనే ఇంగ్లీషు పత్రిక, 'రామదండు అనే తెలుగు పత్రికలు నడిపారు. కాంగ్రెస్ వారి అవలక్షణాలను నాడే ఎత్తి చూపిన పత్రికలు అవి. అటువంటి పత్రికలను మూతపడే వరకు ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు శ్రమించారు. వ్యక్తుల్లో ఇంత సంకుచిత భావం, ఈర్ష్యా ద్వేషాలు వుంటాయని దుగ్గిరాల భావించలేదు. అటువంటి నాయకుల మధ్య కలిసి పని చేయటం కన్నా రామభక్తుడిగా శేష జీవితం గడపటం మంచిదనుకున్నారు. తన భార్య ఆభరణాలు, వెండికంచం అమ్మిన డబ్బులతో కోదండ రామాలయం, రామలింగే శ్వర ఆలయం నిర్మాణం చేపట్టాలని భావించి పునాదుల వరకు నిర్మించారు. తన యావదాస్తి ఆ దేవాలయాలకే చెందాలని బహిరంగ వీలునామా రాసి ఆంధ్ర పత్రికలో ప్రకటించారు. గుంటూరులో చిన్న ఇంట్లో మకాం మారగా అప్పటికే ఆయనకు క్షయవ్యాధి సోకింది. సొంత ఇంటిలో కన్ను మూయాలన్న కోరికతోనే గుంటూరులో ఊరికి చివరిలో చిన్న ఇల్లు నిర్మించే యత్నం చేశారు. కిటికీలు, తలుపులు కాకుండానే అంత్య కాలం అందులో గడపాలని గృహ ప్రవేశ తంతు ముగించారు. తనకు అన్నింటికీ ఆ రాముడే దిక్కు. అన్నీ రామలీలలే అని చెప్పుకున్నారు దుగ్గిరాల. 28 మే, 1928న గృహప్రవేశం చేసి చుట్టూ వున్న పేదలకు అన్నదానం చేశారు. తన జీవితం అయి పోయిందని ఆయనకు అర్థమై, జూన్ 10న వైద్యుడు చూసి పరవాలేదని చెప్పినా దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నమ్మలేదు. ఆ రాత్రి తన మంచం పక్కన ఒక చాప పరచి వుంచమని కోరారు. రాత్రి పదిగంటల వేళ బాగా దగ్గుతూ, తనను మంచంమీద నుండి చాపమీదికి మార్చమన్నారు. అలా చాపమీద పరుండి తన ఇష్ట దైవమైన రాముని స్మరిస్తూ రాత్రి 10.45 సమయంలో ప్రాణం వదిలారు దుగ్గిరాల. ఆంధ్రరత్న బ్రతికింది కేవలం నాలుగు పదుల లోపే అయినా, విలువలతో కూడిన నిస్వార్థ సేవా నిరతికి ప్రతిరూపమైన దుగ్గిరాల జీవితం ఎందరికో ఆదర్శం. జూన్ 10, 1928 లో గోపాలకృష్ణయ్య మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# తిరుమల జ్యేష్ఠాభిషేక మహోత్సవాలు - మూడు రోజుల సాంప్రదాయక కార్యక్రమాలు



ఏడాది పొడవునా 365 రోజుల్లో 470కి పైగా ఉత్సవాలు తిరుమలలో జరుగుతాయి. వీటిలో సింహ భాగం సేవలు మలయప్ప స్వామికే. మూలవిరాట్టు ప్రతినిధిగా, ఉత్సవ మూర్తిగా ఎన్నో అభిషేకాలు, స్నపన తిరుమంజనాలు ఆయనకే. అంగాలు (నేత్రాలు, ముక్కు, చెవులు వంటివి), మహాంగాలు (శిరస్సు, కంఠం, ఉదరం, బాహువులు వంటివి), ఉపాంగాలు (కేశాలు, నఖం వంటివి), ప్రత్యాంగాలు (శంఖు చక్రాలు, మకుటం, పీఠం వంటివి) తరుగులకు గురయ్యే అవకాశం ఉంది. ఈ విధంగా జరగకుండా చూసేందుకు ఉత్సవ.మూర్తిని రక్షించే ప్రక్రియను భృగువు క్రియాధికారంలో వివరించారు. ఆ రక్షించే ప్రక్రియే జ్యేష్ఠాభిషేకం. దీన్ని సుగంధ తైల సమర్పణోత్సవం, అభిదేయక అభిషేకం అని కూడా పిలుస్తారు. నిత్యకల్యాణం పచ్చతోరణంలా విరాజిల్లే ఆనంద నిలయంలో జ్యేష్ఠాభిషేకానిది ప్రత్యేక స్థానం. ఏటా జ్యేష్ఠ మాసంలో జ్యేష్ఠా నక్షత్రానికి ముగిసేలా మూడు రోజులపాటు జరిగేదే ఈ ఉత్సవం. చంద్రుడు జ్యేష్ఠా నక్షత్రంలో కలిసి ఉన్న మాసంలో విశేషమైన సుగంధతైల సమర్పణం చేయాలని భృగువు వివరించారు. దీనివల్ల విష్ణుమూర్తి దివ్య తేజస్సుతో వెలుగొందుతారని చెప్పారు. దీని ప్రకారమే తిరుమలలో జ్యేష్ఠాభిషేకం జరుగుతోంది. జ్యేష్ఠాభిషేకం ప్రారంభం నాడు యధావిధిగా సుప్రభాతం, తోమాలసేవ, సహస్ర నామార్చన, నైవేద్యం, రెండో అర్చన, రెండో నివేదన జరిగిన అనంతరం మలయప్ప స్వామివారు ఆనంద నిలయం గర్భాలయం నుంచి నిత్య కల్యాణం జరిగే వేంకటరమణ కల్యాణ మంటపానికి చేరు కుంటారు. స్వామివారి సన్నిధిలో యాగశాలలో శాంతిహోమం చేస్తారు. శత కలశ ప్రతిష్ఠ, ఆవాహన, నవకలశ ప్రతిష్ఠ, ఆవాహన పూజలు నిర్వహిస్తారు. తర్వాత నివేదనలు, హారతులు సమర్పించి కంకణ ప్రతిష్ఠ చేస్తారు. అనంతరం స్వామి వారికి అర్ఘ్యపాద ఆచమనీయం సమర్పించి కంకణ ధారణ చేస్తారు. తర్వాత హోమాన్ని పూర్తి చేసి హోమ తిలకాన్ని స్వామివారికి దిద్దుతారు. వేద పండితులు శ్రీసూక్తం, పురుష సూక్తం, భూ సూక్తం వంటివి పఠిస్తుండగా శుద్ధ జలాలలో అభిషేకం చేస్తారు. తర్వాత పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు నీళ్లతో, శత కలశాల్లోని జలాలతో స్వామికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. చివర్లో స్వామి, అమ్మవార్లను చందనంతో అలంకరిస్తారు. తర్వాత నవ కలశాల్లోని జలాలతో అభిషేకిస్తారు. ఆ జలాలను అర్చక స్వామి శిరస్సుపై చల్లుకుని భక్తులందరిపై పురోభవ అని చిలకరిస్తారు. తర్వాత స్వామికి వస్త్రాలంకరణ, నివేదన జరుగు తాయి. ఇలా రెండో, మూడో రోజు కూడా జరుగుతుంది. జ్యేష్ఠాభిషేకం చివరిరోజు స్వామివారికి స్వర్ణ కవచం ధరింపజేస్తారు. వివిధ సేవలు, ఉత్సవాలను జరిపించుకుంటూ భక్తులకు దర్శనమిచ్చే శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారు ఎప్పుడూ కవచాన్ని ధరించి ఉంటారు. కేవలం జ్యేష్ఠాభిషేక సమయంలోనే స్వర్ణ కవచాన్ని తొలగిస్తారు. ఈ ఒక్క సందర్భంలోనే మలయప్ప నిజరూపంలో దర్శనమిస్తారు. ఏడాది పొడవునా కేవలం శుద్ధజలంతో మాత్రమే మలయప్ప స్వామికి శిరస్సు పై నుంచి అభిషేకం జరుగుతుంది. ఈ జ్యేష్ఠాభిషేకంలో మాత్రమే స్వామిని అన్ని ద్రవ్యాలతో అభిషేకిస్తారు.దీనిని 'అభిధేయక అభిషేకం' అని కూడా అంటారు. ఈ ఏడు తిరుమల శ్రీవారి ఆలయంలో జూన్ 9 నుండి 11వ తేదీ వరకు మూడు రోజుల పాటు జ్యేష్ఠాభిషేకం జరుగనుంది. మొదటిరోజు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామికి హోమాలు, అభిషేకాలు, పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. తర్వాత స్వామి, అమ్మవార్లకు వజ్రకవచం అలంకరించి పురవీధుల్లో ఊరేగిస్తారు. రెండో రోజు ముత్యాల కవచ సమర్పణ చేసి ఊరేగిస్తారు. మూడో రోజు కూడా తిరుమంజనాదులు పూర్తిచేసి బంగారు కవచాన్ని సమర్పించి ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ బంగారు కవచాన్ని మళ్లీ జ్యేష్ఠాభిషేకంలోనే తీస్తారు. అంతవరకు సంవత్సరం పొడవునా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు బంగారు కవచంతోనే ఉంటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# కలుషిత ఆహారం.. సలహాలు ఉచితం

భగత్‌నగర్: నగరంలోని భగత్‌నగర్‌కు చెందిన భాస్కర్, శ్రీను అల్పాహారం తినడానికి బస్టాండ్ సమీపంలోని ఓ ప్రముఖ హోటల్‌కు వెళ్లారు. వెయిటర్ పూరీ తెచ్చి టేబుల్‌పై పెట్టగానే తినేందుకు సిద్ధమయ్యారు. కూరలో ఈగ కనబడటంతో సిబ్బందికి చెప్పారు. వారి నుంచి స్పందన లేకపోవడంతో నగరంలోని ఆహారభద్రత బృందం అధికారిణి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆమె 'పత్రికల్లో వార్త వస్తే చర్య తీసుకుంటామటూ ఉచిత సలహా ఇచ్చారు. కంగుతిన్న బాధితులు నగరపాలిక కార్యాలయానికి వెళ్లగా ఉదయం 11.30 గంటలకూ అధికారులు, సిబ్బంది కనపడకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు.

**తనిఖీలు రెండు నెలల ముచ్చటే!**

కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాలతో దాదాపు మూడు నెలల కిందట నగరంలో ఆహారభద్రత బృందం ఏర్పాటైంది. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, తూనికలు కొలతల శాఖ అధికారి, మెప్మా పీడీ, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు నగరపాలక సంస్థ పారిశుద్ధ్య పర్యవేక్షకుడు ఇందులో సభ్యులు. ఈ బృందం రెండు నెలల పాటు వారంలో మూడు రోజులు ఆహార తయారీ కేంద్రాలు, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, హోటళ్లు, రెస్టారెంట్లతో పాటు తూనికల యంత్రాలు



విక్రయించే దుకాణాలను తనిఖీ చేసింది. ఆహార భద్రత, పరిసరాల పరిశుభ్రతపై నిర్వాహకులకు అవగాహన కల్పించింది. నెల రోజులుగా తనిఖీలు నిలిచిపోయాయి. మరోవైపు 'ఆహారంలో ఈగ వచ్చింద'ని బృందం సభ్యులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం గమనార్హం. పైగా ఉచిత సలహా ఇస్తుండటం తనిఖీలు నిజంగా చేశారా? లేక ఆటవిడుపుగా నిర్వహించారా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి.

**అడ్డగోలు వసూళ్లు**

అల్పాహారం తినడానికి వెళ్లిన వినియోగదారుల నుంచి హోటల్ యాజమాన్యం పన్నుల పేరిట అధికంగా వసూలు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెండు ప్లేట్ల పూరీకి రూ.90 చొప్పున, ప్లేట్ ఉప్మాకు రూ.70 వసూలు చేశారు. దీనికితోడు సీజీఎస్టీ 2.5 శాతం కింద రూ.6.25, ఎస్‌జీఎస్టీ కింద 2.5 శాతం కింద రూ.6.25 కలిపి మొత్తంగా రూ.12.50 తీసుకున్నారు. సీజీఎస్టీ, ఎస్‌జీఎస్టీల పేరిట భారం మోపడంతో పాటు రౌండ్ ఆఫ్ పేరిట అదనంగా అర్ధ రూపాయి తీసుకోవడం కొసమెరుపు.

# హరితం.. నగరానికదే హితం



హైదరాబాద్ : కాంక్రీట్ కీకారణ్యంగా మారిన నగరంలో 'హీట్ ఐలాండ్స్' పుట్టుకొస్తున్నాయి. ఎత్తైన కాంక్రీట్ భవనాలు, బీటీ రోడ్లు, విపరీతంగా ఏసీ, రిఫ్రిజిరేటర్ల వాడకంతో ఆయా ప్రాంతాల్లో భూ ఉపరితలంపై 2–3 మీటర్ల ఎత్తులో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 'హైదరాబాద్ అర్బన్ ల్యాబ్స్' స్వచ్ఛంద సంస్థ చేసిన పరిశోధనలో పటాన్‌చెరు, బండ్లగూడ, గచ్చిబౌలి, మైలార్‌దేవ్ పల్లి, బీఎన్‌రెడ్డినగర్, మన్సురాబాద్, హయత్‌నగర్ ప్రాంతాలు హీట్ ఐలాండ్లుగా మారినట్లు గుర్తించింది. మున్ముందు ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి పరిస్థితులే ఉత్పన్నమవుతాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే అంతటా మొక్కలు నాటడంతో పాటు వాటి పర్యవేక్షణ బాధ్యతను చేపట్టాలని సూచిస్తున్నారు.

**పచ్చదనం 28 శాతమే..** నిబంధనల ప్రకారం నగరంలో 33శాతం పచ్చదనం ఉండాలి. 28 శాతమే ఉందని ట్రీ ప్రొటెక్షన్ కమిటీ ప్రతినిధి ఫరీదా వెల్లడించారు. మొక్కల పెంపకంపై పౌరులకు అవగాహన లేకపోవడం, చుట్టుపక్కల చెట్లను నరికేస్తున్నా అడ్డుకోకపోవడం, మొక్కలు నాటినా పట్టించుకోకపోవడం, పార్కుల్లో నీటి వసతి లేకపోవడం ఇందుకు కారణాలని వెల్లడించారు. అనుమతి లేకుండా చెట్లు నరికివేస్తుంటే 1800-425-5364 నంబరులో ఫిర్యాదు చేయాలన్నారు.

**చెట్లతో బహుళ ప్రయోజనాలు..**

ఆక్సిజన్ ఉత్పత్తికి ప్రాథమిక వనరులు చెట్లు. కార్బన్‌డయాక్సైడ్, ఇతర కాలుష్య కారకాలను గ్రహించి వాయు నాణ్యత మెరుగుపరుస్తాయి. నేల కోతకు గురికాకుండా ఉండేందుకు, వరదల నివారణకు ఉపయోగపడతాయి.

పక్షులకు ఆవాసం కల్పించి జీవ వైవిధ్యాన్ని పెంపొందిస్తాయి. నీడనిచ్చి ఉష్ణోగ్రతను తగ్గించడంలో సహాయపడతాయి.

పెద్ద పార్కులు, పట్టణ అడవులు వేసవిలో ఉష్ణోగ్రతలను 10 డిగ్రీల వరకు తగ్గించగలవు.

గ్రేటర్‌లో పచ్చదనం లెక్కలిలా..

2011లో 33.15 చ.కి.మీ

2021లో 81.81 చ.కి.మీ (పదేళ్లలో 147 శాతం వృద్ధి)

2023లో.. 80.20 చ.కి.మీ (రెండేళ్లలో 1.61 శాతం తగ్గుదల)

నర్సరీలు – 600

కాలనీ పార్కులు – 1032

పచ్చదనం కలిగిన కూడళ్లు, విభాగినిలు – 226

కేటాయింపులేనా.. గ్రేటర్ బడ్జెట్‌లో ఏటా రూ.350 కోట్ల మేర హరిత పద్దుకు కేటాయిస్తున్నారు. చివర్లోచూస్తే.. ఖర్చులు రూ.90 కోట్లకు మించట్లేదు.

**గ్రీన్ వారియర్స్ వీరు!**

మెట్రో.. ప్రయాణికులదీ ఘనత

నగరంలో రోజురోజుకు కాలుష్యం పెరుగుతోంది.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజా రవాణా వినియోగం.. అందులోనూ కాలుష్య రహిత ప్రయాణాలతో కాలుష్యానికి అడ్డుకట్ట వేయవచ్చు. ఈ నేపథ్యంలోనే.. పూర్తిగా విద్యుత్తుతో నడిచే హైదరాబాద్ మెట్రోలో నిత్యం సగటున 4.40 లక్షల మంది ప్రయాణిస్తూ తమ వంతుగా పర్యావరణ హితానికి పాల్పడుతున్నారు. గ్రీన్ వారియర్స్‌గా నిలుస్తున్నారు. మెట్రో వ్యవస్థ సైతం బ్రేకుల ద్వారా విద్యుత్తు పునరుత్పత్తి, స్టేషన్లపై సౌర విద్యుత్తు, వాననీటి సంరక్షణ వంటి చర్యలతో గ్రీన్ మెట్రోగా నిలుస్తోంది.

హైదరాబాద్ మెట్రోరైలు మూడు కారిడార్లలో 69.2 కిలోమీటర్ల మేర అందుబాటులో ఉంది. 57 మెట్రోరైలు స్టేషన్లు ఉన్నాయి. తక్కువ విద్యుత్తు వినియోగించుకునేలా స్టేషన్లను డిజైన్ చేయడంతో వీటిని పరిశీలించి ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) సర్టిఫైడ్ చేసింది.

**32 స్టేషన్లపై సౌర పలకలు**

మెట్రోస్టేషన్లకు అవసరమయ్యే విద్యుత్తును సమకూర్చుకునేందుకు 32 స్టేషన్లపై సౌరపలకలు ఏర్పాటుచేశారు. మియాపూర్, ఉప్పల్ డిపోల్లో సోలార్ ప్లాంట్లతో 9.35 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారు. మెట్రో విద్యుత్తు వినియోగంలో సౌర విద్యుత్తు వాటా 12 శాతం. ఇప్పటివరకు 56,935 మెగావాట్ల సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసినట్లు ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో తెలిపింది.

**మిలియన్ లీటర్ల ఇంధనం ఆదా**

పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాల వినియోగంతో కాలుష్యం విపరీతంగా పెరుగుతోంది. విద్యుత్తుతో నడిచే మెట్రో రాకతో ఇప్పటివరకు 184 మిలియన్ లీటర్ల ఇంధనాన్ని ఆదా చేసి తద్వారా పర్యావరణానికి జరిగే నష్టానికి అడ్డుకట్ట వేసింది. 424 మిలియన్ కిలోల కార్బన్ డై యాక్సైడ్ ఉద్గారాలను నిలువరించగలిగింది.

వాననీటి సంరక్షణతో..

మెట్రో స్టేషన్లు, పరిసరాలు, డిపోల్లో కలిపి 150వరకు వాననీటి గుంతలను ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు 3.75 కిలోలీటర్ల నీటిని భూమిలోకి ఇంకేలా చేశారు. తద్వారా సుస్థిర నీటి నిర్వహణకు మద్దతుగా నిలిచారు.

# సర్వేలతో సరి.. పరిహారమేదీ!

గంగాధర: కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే మార్గానికి సర్వే పూర్తయి ఏళ్లు గడిచినా పనులు ముందుకు సాగడం లేదు. భూసేకరణ ప్రక్రియ చేపట్టినా భూములు, ఇళ్లకు పరిహారం అందడం లేదు. 13 ఏళ్ల కిందట రైల్వే లైన్ నిర్మాణ ప్రక్రియ ప్రారంభం కాగా అప్పట్లో పరిహారం ధర నిర్ణయించారు. ప్రస్తుతం ఇల్లు నిర్మించుకోవాలన్నా, మరో చోట వ్యవసాయ భూమి కొనాలన్నా పెరిగిన ధరలతో కొనలేకపోతామని బాధితులు ఆవేదన చెందుతున్నారు. గంగాధర మండలం గర్శకుర్తి, రంగారావుపల్లి, తాడిజెర్రి, కాసారం గ్రామాల రైతులు రెండేళ్ల కిందట పరిహారం కోసం రిలే నిరహార దీక్షలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన కరవైంది.

**తొమ్మిది నెలల కిందట మరోసారి..**

2020లో బహిరంగ ప్రకటన చేసి రైల్వే లైన్‌లో కోల్పోతున్న వ్యవసాయ భూములు, పైపులైన్లు, ఇళ్లు, బావుల వివరాలను అధికారులు ప్రకటించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక పరిహారం కోసం తిరిగి 2024 సెప్టెంబరులో భూ సేకరణ కోసం ప్రకటన విడుదల చేశారు. ఆర్డీవో మహేశ్వర్ భూ సేకరణ, రైల్వే అధికారులతో కలిసి పలుమార్లు గ్రామసభలు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించారు. కొండన్నపల్లి, బోయినపల్లి, ఇతర ప్రాంతాల వారికి పరిహారం రాగా



రంగారావుపల్లి, తాడిజెర్రి, కాసారం గ్రామాల ప్రజలకు ఎదురుచూపులే మిగిలాయి. ఇటు పరిహారం అందక, అటు ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం భూములు అమ్మే వీలు లేక పలువురు రైతులు అప్పుల పాలవుతున్నారు.

**13 ఏళ్ల కిందటే భూ సేకరణ**

రైల్వే లైన్ నిర్మాణానికి 2012లో భూసేకరణ ప్రక్రియ చేపట్టారు. నాలుగేళ్ల కిందట వ్యవసాయ భూములు, బావులు, పైపులైన్లు, ఇళ్లపై సర్వే చేసిన అధికారులు ఏడాది కిందట అవార్డు పూర్తి చేశారు. అప్పట్లోనే నిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లో పరిహారం సొమ్ము జమ కావాల్సి ఉండగా ఇప్పటికీ కాలేదు. రైల్వే మార్గం 70–80 మీటర్ల వెడల్పు ఉండగా స్టేషన్ ఉన్న చోట 150–180 మీటర్ల వరకు ఉంటుంది. గంగాధర మండలం కురిక్యాల, కొండన్నపల్లి, ఉప్పరమల్యాల, రంగారావుపల్లి, తాడిజెర్రి, కాసారం, గర్శకుర్తి, రామడుగు మండలం వెదిర, దేశరాజ్‌పల్లి, కొత్తపల్లి శివార్లలోని 219.06 ఎకరాలతో పాటు బోయినపల్లి మండలం బూర్గుపల్లి, కోరెం, బోయినపల్లి, తడగొండ, స్తంభంపల్లి గ్రామాల్లో వ్యవసాయ భూములు సేకరించారు. రంగారావుపల్లిలో 36 నివాసాలు, ప్రభుత్వ పాఠశాల, రక్షిత తాగునీటి బావి కోల్పోతుండగా పరిహారం చెల్లింపుతో పాటు రైల్వేలైన్ పనులు చేపట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికే మనోహరాబాద్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లా, కరీంనగర్ జిల్లాల్లోని పలు గ్రామాల్లో నిర్వాసితులకు పరిహారం చెల్లించిన ప్రభుత్వం తమకు మాత్రం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నిరుద్యోగ యువత ఉన్నతికి శ్రీకారం

చొప్పదండి: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురుకుల కళాశాలల్లో చదువుకొని నిరుద్యోగులుగా ఉన్న పూర్వ విద్యార్థులను ఇందుకోసం ఎంచుకొని ప్రత్యేక కార్యాచరణ మొదలుపెట్టింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ గురుకుల కళాశాలల్లో విద్యనభ్యసించిన వారికి ఉపాధి కల్పించేలా ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణను ప్రత్యేకంగా అందించేలా ఏర్పాట్లు చేస్తోంది. నిరుద్యోగ యువత వారి జీవితాలను తీర్చిదిద్దుకొని స్థిరపడడానికి ఇదో సదవకాశం.

**శరవేగంగా కార్యక్రమానికి ఏర్పాట్లు**

జూన్ రెండో వారం చివర్లో శిక్షణ ప్రారంభించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పూర్వ విద్యార్థుల నుంచి దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. అయినా ఇప్పటికీ ఆసక్తి గలవారు దరఖాస్తులు చేసుకునేలా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పూర్తి స్థాయిలో దరఖాస్తులు వచ్చిన తర్వాత శిక్షణకు సంబంధించిన పూర్తి కార్యాచరణను ప్రకటించనున్నారు.

**ఉచిత భోజన, వసతి సౌకర్యాలు**

ఉమ్మడి జిల్లాలోని ఒక డిగ్రీ, 25 గురుకుల ఇంటర్ కళాశాలల్లో చదివి 18 నుంచి 25 ఏళ్లలోపు ఉన్నవారికి ఈ శిక్షణ అందించనున్నారు. దీని కోసం ఆయా గురుకుల కళాశాలల పూర్వ విద్యార్థుల వివరాల సేకరణ ప్రారంభమైంది. వీరు ప్రస్తుతం



ఎక్కడున్నారు.. ఏం చేస్తున్నారు.. తదితర సమాచారం సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. సుమారు 10 వేల మందికి పైగా నిరుద్యోగులు ఉన్నట్లు గుర్తించి జాబితాను సిద్ధం చేశారు. శాస్త్ర, సాంకేతిక, డిజిటల్, మేనేజ్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ అందించనున్నారు. ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు కల్పించే బాధ్యత ఉన్నతి ఫౌండేషన్ తీసుకుంటుంది.

**సద్వినియోగం చేసుకోవాలి**

నిరుద్యోగులుగా ఉన్న గురుకుల కళాశాలల పూర్వ విద్యార్థులను వివిధ రంగాల్లో నిపుణులుగా తీర్చిదిద్ది ఉద్యోగాలు కల్పించడంతోపాటు ఆర్థికంగా స్థిరపరచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆసక్తి కలిగిన పూర్వ విద్యార్థులు వారు చదువుకున్న కళాశాలలను సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలి. ఉన్నతి ఫౌండేషన్ సౌజన్యంతో ప్రభుత్వం అందిస్తున్న ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

శ్రీకాళహస్తి, ప్రధానాచార్యులు రుక్మాపూర్ గురుకుల కళాశాల

# విత్తనంపై.. మోసగాళ్ల పెత్తనం



వికారాబాద్ : జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. కొన్ని చోట్ల విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. నకిలీ విత్తన విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో జిల్లా వ్యవసాయ, పోలీసు శాఖలు సమన్వయంతో అప్రమత్తమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మండలాల్లో ఎరువుల, విత్తన దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైతు వేదికల ద్వారా వీటి కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అన్నదాతలను అప్రమత్తం చేస్తున్నారు.

**రంగంలోకి టాస్క్‌ఫోర్స్ బృందాలు**

నకిలీ విత్తనాలు మార్కెట్లోకి రాకుండా ఉండేందుకు టాస్క్‌ఫోర్సు బృందాలు రంగంలోకి దిగాయి. అన్ని మండలాల్లోనూ పోలీసుల సహకారంతో తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇదే క్రమంలో సాగు పరిస్థితులకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలు ఉన్నాయా లేదా కృత్రిమ కొరతకు ఏదైనా అవకాశం ఉందా అన్న కోణంలోనూ నిశిత పరిశీలన చేపడుతున్నారు. ఎక్కువగా కర్ణాటక నుంచి కొడంగల్ మీదుగా జిల్లాలో విక్రయాలు జరుగుతున్నాయని అధికారులు గుర్తించి నిఘా ఉంచారు. కొడంగల్, పెద్దేముల్, యాలాల, తాండూరు ప్రాంతాల్లో కేసులు నమోదు చేశారు.

**పత్తిపైనే దృష్టి:** నల్లరేగడి నేలలు అధికంగా ఉండడంతో పత్తి సాగు విస్తీర్ణం పెరగనుంది. 2,58,563 ఎకరాల్లో సాగులోకి రానుంది. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు గ్రామాల్లో పర్యటించి అధిక దిగుబడి వస్తుందని చెబుతూ, ఆయా విత్తన కంపెనీల పేరు చెప్పి, రైతులను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్యాకెట్లు కాకుండా విడిగా అమ్మితే కొనుగోలు చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. విత్తనాల కొరత లేదని భరోసా ఇస్తున్నారు.

**సరిహద్దు ప్రాంతాలపై నిఘా: నారాయణరెడ్డి, ఎస్పీ**

కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ, చింతామణి నుంచి నకిలీ పత్తి విత్తనాలు వస్తున్నట్లు సమాచారం ఉంది. దీంతో నిఘా మరింత ముమ్మరం చేశాం. ఇప్పటి వరకు నాలుగు కేసులు నమోదు చేసి ఆరుగురిని అరెస్టు చేశాం. జిల్లా వ్యాప్తంగా ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి కట్టడి చేస్తున్నాం.

**కొరత లేదు: మోహన్‌రెడ్డి, డీఏవో**

పత్తి విత్తనాల కొరత లేదు. రైతులకు అందుబాటులో ఉంచాం. తక్కువ ధరలకు ఇస్తామంటూ నకిలీ విత్తనాలను అంటగట్టే ప్రమాదం ఉంది. ఇ మోసపూరిత ప్రకటనలను నమ్మొద్దు. అనుమానం వస్తే ఫిర్యాదు చేయాలి.

మండలాలు: 20

సాగు భూమి: 8,81,730 ఎకరాలు

రైతు వేదికలు: 99

రైతుల సంఖ్య: 3,23,650

వానాకాలం సాధారణ సాగు: 5,51,105 ఎకరాలు

సాగు అంచనా: 5,61,719 ఎకరాలు ప్రధాన పంటలు: 5

# విద్యార్థులు లేక మూతబడి

పెద్దపల్లి : పెద్దపల్లి మండలం గొల్లపల్లి ప్రాథమిక పాఠశాల ఆరేళ్లుగా తెరచుకోవడంలేదు. దీంతో స్థానిక విద్యార్థులు 2 కి.మీల దూరంలోని తుర్కలమద్దికుంటకు వెళుతున్నారు.

మంథని మండలం లక్కేపూర్ ప్రాథమిక పాఠశాలలో 22 మంది పిల్లలుండగా ఏటికేడు తగ్గడంతో ఏడేళ్ల క్రితం మూసేశారు. ఇద్దరు ఉపాధ్యాయులుండగా ఒకరు బదిలీ కాగా మరొకరిని సర్దుబాటు చేశారు. పాలకుర్తి మండలం బామ్లానాయక్‌తండా ప్రాథమిక పాఠశాలది ఇదే పరిస్థితి. 5 కి.మీ దూరంలోని కన్నాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్నారు. ఈ భవనాన్ని గ్రామ పంచాయతీగా వినియోగిస్తున్నారు. ఇదివరకు పిల్లలతో కళకళలాడిన పాఠశాలలు నేడు మూతపడిపోయాయి. వీటిని తెరిపించడంలో విద్యాశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో విద్యా సంవత్సరం ఆరంభం కానుంది. ప్రజల సహకారంతో బడులను తెరిపించాల్సిన అవసర ముంది.



**పర్యవేక్షణ లోపం**

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. నిపుణులైన ఉపాధ్యాయులు, ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అమలు చేసినప్పటికి తల్లిదండ్రులను ఆకర్షించడంలేదు. ఒకరిని చూసి మరొకరు ప్రైవేటుకు పంపించడంతో ఏటికేడు పాఠశాలలు మూతపడుతున్నాయి. సకల వసతులు ఉన్నప్పటికి చాలాచోట్ల ఉపాధ్యాయులు భారంగా భావిస్తున్నారే తప్ప బాధ్యత మరచిపోతున్నారనే విమర్శలున్నాయి.

**జిల్లాలో ఇదీ పరిస్థితి**

కాల్వశ్రీరాంపూర్ మండలం లక్ష్మీపూర్ పంచాయతీ పరిధిలో రాయపేట ప్రాథమిక పాఠశాల ఐదేళ్ల నుంచి తెరచుకోవడంలేదు. ఇక్కడి నుంచి కిలోమీటరున్నర దూరంలోని పందిళ్లకు వెళుతున్నారు.

ఓదెల మండలం కేశవపూర్ ప్రాథమిక పాఠశాల పదేళ్ల కిందట మూతపడింది. తల్లిదండ్రులు తమ పిల్లలను సుల్తానాబాద్‌లోని ప్రైవేటు పాఠశాలకు పంపిస్తున్నారు.

కమాన్‌పూర్ మండలం రేపల్లివాడ ప్రాథమిక పాఠశాలలో మూడేళ్ల క్రితం ఉపాధ్యాయుడు బదిలీ కావడంతో మరెవరిని నియమించలేదు. దీంతో పాఠశాలను మూసేశారు.

సుల్తానాబాద్‌లోని పది పాఠశాలలు.. రామగిరి మండలం గోకుల్‌నగర్, లంబాడితండా, పెద్దంపేటలోనూ ఇదే పరిస్థితి.

ఇలా చేస్తే పూర్వవైభవంజిల్లాలో ఇప్పటివరకు మొత్తం 29 పాఠశాలలు మూతపడ్డాయి. తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వ విద్యపై నమ్మకం కలిగించాలి. ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా పర్యవేక్షించాలి. ఏకోపాధ్యాయులు ఉన్నచోట ప్రత్యామ్నాయంగా మరో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయాలి.

**తెరిచేలా చూస్తున్నాం**బడిబాటలో మూతపడిన వాటిని తెరిచేలా ఉపాధ్యాయులు ప్రచారం చేస్తున్నారు. తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులను కలిసి పాఠశాలకు పంపించేలా నమ్మకం కలిగిస్తున్నారు. తల్లిదండ్రులు సైతం ఆలోచించాలి. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని వారికి వివరిస్తున్నాం.మాధవి, జిల్లా విద్యాధికారి

# ముస్తాబు చేసి.. మూసి ఉంచి..



తాండూరు : పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో ఆరోగ్య ఉపకేంద్ర భవనాలు నిర్మించేందుకు ఖరారు చేశారు. నిర్మాణాలు పూర్తై ఏళ్లు గడిచినా అందుబాటులోకి తీసుకురావడం లేదు. కొన్నింటిని ముస్తాబు చేసి తాళం వేయగా, మరికొన్నింటిని అసంపూర్తి పనులతో వదిలేశారు. రూ.1.50 కోట్లకుపైగా వెచ్చించినా ఉపయోగం లేకుండాపోయింది. తాండూరు మండలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూర్బన్ పథకాన్ని అమలు చేశాయి. పథకం నిధులతో తొమ్మిది గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్ర భవనాలు నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించాయి. అల్లాపూర్, అంతారం, ఎల్మకన్నెలో భవనాలు నిర్మించారు. ఎల్మకన్నెలో నూతన భవనాన్ని ప్రారంభించి తాళం వేశారు. రెండేళ్లు గడుస్తున్నా వినియోగంలోకి తీసుకురాలేదు. అల్లాపూర్, అంతారంలో మూడేళ్లుగా ప్రారంభోత్సవం చేయకుండా రంగులువేసి తాళం వేసి ఉంచారు. బెల్కటూరు, కరణ్‌కోట, జిన్‌గుర్తిలో భవనాలకు గచ్చు నిర్మాణం, తలుపులు, రంగులు వేయించాల్సి ఉండగా అసంపూర్తిగా మిగిల్చారు. రెండేళ్లుగా వాటి ఊసెత్తడం లేదు.**వినియోగంలోకి రాకపోవడంతో..:**

తొమ్మిది గ్రామాల్లో నిర్మాణాలకు రూ.93.60 లక్షలు కేటాయించారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.10.40 లక్షలు చొప్పున ఖర్చు చేశారు. భవనాలు నిర్మించినా అందుబాటులోకి తేనందున ఫలితం లేకుండాపోయింది. అసౌకర్యాల మధ్య వైద్యం అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సొంత భవనం వినియోగంలోకి రాకపోవడంతో ఎల్మకన్నె, అల్లాపూర్, అంతారంలో పంచాయతీ కార్యాలయంలోని ఇరుకు గదిలో వైద్య సేవలు అందిస్తూ, ఇబ్బందులు పడుతున్నారు. బెల్కటూరు, సంగెంకలాన్, కరణ్‌కోటలో అద్దె గదుల్లో ఆరోగ్య ఉపకేంద్రాలను నెట్టుకొస్తున్నారు. వందలాది మంది అసౌకర్యానికి గురవుతున్నారు.**కొత్తగా నిర్మాణాలు:** రూర్బన్ పథకం కింద నిర్మించిన భవనాలు వినియోగంలోకి తీసుకురాకుండా వైద్య ఆరోగ్య శాఖ నిధులతో కొత్త భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రెండేళ్లుగా తాళం వేసి ఉంచిన భవనాల చెంతనే కొత్తవి నిర్మిస్తున్నారు. బెల్కటూరులోనూ భవనం పక్కనే మరోటి నిర్మించారు. రంగులు వేసి ప్రారంభించాల్సి ఉంది. అంతారంలో స్లాబ్ పనులు పూర్తయ్యాయి. పాత వినియోగించకుండానే కొత్తవి నిర్మించడం విమర్శలకు తావిస్తోంది. నిధులు వ్యయం చేసినా, వైద్య సేవలకు సొంత భవనాలు సమకూర్చడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## ఆహ్లాదం.. ఆమడ దూరం

వికారాబాద్ : వికారాబాద్ పురపాలికలోని 21,22,23,24 ,25 వార్డుల్లో ఉద్యానాలు లేక స్థానికులు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. పట్టణంలోని 36 పార్క్‌ల్లో కొన్నిచోట్ల పరికరాలు లేవు. మరికొన్ని చోట్ల ప్రహరీ నిర్మించి వదిలేశారు. గాంధీ పార్కు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆలంపల్లి గ్రామం మధ్యలో మురుగు కాల్వ ఉండడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాలు కురిస్తే వేంకటేశ్వర కాలనీలో వరద చేరుతోంది. అఫ్సర్‌జంగ్ బాగ్‌కాలనీలో పార్క్ ప్రకటనలకే పరిమితం అయింది. సుభాష్‌నగర్ కాలనీలో రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. వికారాబాద్–రామయ్యగూడ మధ్యలో రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

**పార్కుల్లో సౌకర్యాలు కల్పిస్తాం: జాకీర్ అహ్మద్, కమిషనర్**

పట్టణంలో వార్డుకు ఒకటి చొప్పున పార్కులున్నాయి. చాలా చోట్ల



క్రీడా పరికరాలున్నాయి. లేనిప్రాంతాల్లో సమకూరుస్తాం. పురపాలక పరిధిలో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాం. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటున్నాం

వార్డు21: రామయ్యగూడ ఎంఐజీ, ఇందిరమ్మ, బస్వలింగం కాలనీ : నిధుల ఖర్చు: రూ.50 లక్షలు

వార్డు22: ఆలంపల్లి గ్రామం: నిధుల ఖర్చు: రూ.45 లక్షలు

వార్డు23: వేంకటేశ్వర కాలనీ, ఎంఐజీ ఫేజ్ 2: నిధుల ఖర్చు: రూ.45 లక్షలు వార్డు 24: అఫ్సర్‌జంగ్ బాగ్, ఇందిరాబాయి కాలనీ, శివాజీనగర్, ఎంఐజీ ఫేజ్–2, బసంత్ ఫంక్షన్ హాల్, కూరగాయల మార్కెట్ : నిధుల ఖర్చు: రూ.55 లక్షలు వార్డు 25: సుభాష్‌నగర్ కాలనీ, న్యూ గాంధీగంజ్, సరస్వతీ డిగ్రీ కళాశాల ప్రాంతం, రైల్వే ఫంక్షన్ హాల్ ప్రాంతం నిధుల ఖర్చు: రూ.60 లక్షలు

## తిప్పలు పడుతున్నా.. తీరు మారలే!

ధారూర్: జిల్లాలో ఏళ్లు గడుస్తున్నా కొన్ని గ్రామాలకు వెళ్లే దారుల్లో వంతెనల నిర్మాణాలు పూర్తికాలేదు. వర్షాకాలంలో వాగులు పొంగితే రాకపోకలు నిలిచిపోతున్నాయి. అయినా అధికారులు దృష్టి సారించడంలేదు.

**ఏళ్లు గడుస్తున్నా..:** ధారూర్ మండల కేంద్రానికి దగ్గరగా ఉన్న చింతకుంట, మైలారం, కొత్త తండా గ్రామాలకు వెళ్లే దారిలో వాగుపై వంతెన నిర్మాణానికి 2009లో రూ.50 లక్షలు మంజూరు కావడంతో పనులకు శంకుస్థాపన చేశారు. గుత్తేదారు పిల్లర్ల వరకు పనులు పూర్తిచేసి వదిలేశారు. గతంలో వాగు దాటే క్రమంలో కొంత మంది ప్రాణాలు కోల్పోయారు. ఎండాకాలంలో వాగులో నీరు లేకపోవడంతో అక్కడి నుంచే వివిధ గ్రామాలకు వెళుతుంటారు.

**కొట్టుకుపోయినా:**

కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు ఉద్ధృతంగా ప్రవహించడంతో 2016లో నాగసమందర్ వెళ్లే రహదారిలో రోడ్డు కొట్టుకుపోయింది. అప్పట్లో నెలరోజుల రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం రూ.50 లక్షలు మంజూరు చేసి పనులు చేపట్టారు. వర్షాకాలంలో రోడ్డుపై నీరు ప్రవహించి గంటల తరబడి రాకపోకలు నిలిచిపోతాయి. తాత్కాలికంగా



నిర్మించిన కల్వర్టు కూడా వరదకు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. భారీ వంతెన నిర్మించాల్సి ఉన్నా, అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు.

**త్వర పడితేనే ప్రయోజనం..** భారీ వర్షాలకు ధారూర్ స్టేషన్ దోర్నాల్ గ్రామ సమీపంలో 2016లో వంతెన కొట్టుకుపోయింది. దీంతో దోర్నాల్, అంపల్లి, గురుదోట్ల, నాగారం, మోమిన్‌కలాన్, రాస్నం, పగిడియాల్ తదితర 30 గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. 2018లో వంతెన నిర్మాణానికి రూ.4.70 కోట్లు మంజూరు చేశారు. పనులు చేపట్టినా, చివరి దశలో వదిలి పెట్టారు. వీటిని పూర్తి చేయిస్తేనే ప్రయోజనం ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

## రైతుల నెత్తిపై ఎత్తిపోతలు!

ధర్మపురి: రాయపట్నం గోదావరినది ఎత్తిపోతల పథకం కింద 2 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. మోటార్ల మరమ్మతులు, ఇతర నిర్వహణల వల్ల ఎత్తిపోతల పథకానికి రూ.3 లక్షల వరకు వ్యయం అవుతోంది. ఏటా రైతులే పోగు చేసుకుని భరిస్తున్నారు. జిల్లాలో 10 గోదావరినది ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వీటి నిర్వహణ బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందని గత ఏడాది ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి ఉత్తర్వులు వెలువడకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో పక్షం రోజుల్లో ఎత్తిపోతల సీజన్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు, మరమ్మతులు ఎదురైనా అన్నదాతలపై ఆర్థికభారం పడనుంది. ఎత్తిపోతల పథకాలు నిర్మించినప్పటి నుంచి అయిదేళ్ల పాటు ప్రధాన మోటార్లు, యంత్రాల నిర్వహణ గుత్తేదార్లు నిర్వహించగా.. మరమ్మతులు మాత్రం రైతులు తలా కొంత వేసుకొని చేసుకున్నారు. గుత్తేదార్ల గడువు కూడా మార్చి 2025తో పూర్తయింది. ప్రస్తుతం రైతు కమిటీలే నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించాలని రైతులు కోరుతున్నారు.

**పంటకు రూ.3 లక్షల ఖర్చు** వెల్గటూర్ మండలం ముత్తునూర్, ధర్మపురి మండలం రాయపట్నం, తిమ్మాపూర్, దమ్మన్నపేట, రాజారం, జైన, దొంతాపూర్, ఆరెపల్లి, బీర్‌పూర్ మండలం కొల్వాయి, కమ్మునూర్‌లలో గోదావరి వద్ద రూ.98 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల నిర్మాణాలు ప్రభుత్వం గతంలో చేపట్టింది. కాలువ చివరి భూములున్న ఈ ప్రాంతాల్లోని రైతులు ఎత్తిపోతల పథకాలపై ఆధారపడి సాగు చేస్తున్నారు. సుమారుగా పదివేల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. ఒక్కొక్క ఎత్తిపోతల పథకానికి 240 హెచ్‌పీ సామర్థ్యం గల మోటార్, విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యత రైతు కమిటీలు తీసుకున్న దశలో ప్రతి రైతుపై భారం పడుతోంది. ప్రతి పంటకు సుమారుగా మొత్తం రూ.3 లక్షల వరకు రైతులు జేబుల్లోంచి పెట్టుకుంటున్నారు. మోటార్ల మోరాయింపుల ఖర్చులు అదనం. ప్రభుత్వం ప్రధాన మోటార్లు, పైపుల ద్వారా నీటిసరఫరా, తదితర నిర్వహణ బాధ్యతలు ప్రభుత్వం తీసుకుంటే వారికి భారం తగ్గనుంది.

# నోటరీ స్థలాలకు అనుమతులివ్వం



హైదరాబాద్: నోటరీ పత్రాలతో కొనుగోలు చేసే స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు ఎదురవుతోన్న సమస్యలపై బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన పాలకమండలి సమావేశంలో వాడి వేడిగా చర్చ జరిగింది. బోరబండ కార్పొరేటర్ బాబాఫసీయుద్దీన్ ఫిర్యాదుతో టౌన్‌ప్లానింగ్ అధికారులు భారాస కార్యకర్త ఇంటిని ఏకపక్షంగా సీజ్ చేశారని, దాంతో సర్దార్‌సింగ్ ఆత్మహత్య చేసుకున్నారని భారాస కార్పొరేటర్లు సభలో చర్చ ప్రారంభించారు. ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేశారని, బాబాఫసీయుద్దీన్ పాత్ర ఉందా, లేదా అనే విషయం విచారణలో వెలుగు చూస్తుందన్నారు. బస్తీవాసులు ఇళ్ల నిర్మాణానికి పడుతోన్న ఇబ్బందులు నా డివిజన్‌లో కూడా ఉన్నాయని, వారికి అనుమతులు ఎందుకు ఇవ్వకూడదని ఆమె నగర ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరారు. జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం.. రిజిస్టర్డ్ సేల్ డీడ్ ఉన్న స్థలాలకు నిర్మాణ అనుమతిని మంజూరు చేయగలమని, నోటరీ స్థలాలకు ఇవ్వలేమని ఆయన స్పష్టం చేశారు. దాంతో మేయర్ విజయలక్ష్మితోపాటు పలువురు కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతిచ్చే అధికారం లేనప్పుడు పేదల ఇళ్లను కూల్చే అధికారం కూడా మీకు లేదని మేయర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఎమ్మెల్సీగా నియామకమైన సినీనటి విజయశాంతి మొదటిసారి ఎక్స్‌అఫీషియో సభ్యురాలి హోదాలో హాజరయ్యారు. మేయర్ విజయలక్ష్మి ఆహ్వానం మేరకు జపాన్‌లోని కితక్యూషూ నగర మేయర్ కుటుంబ సభ్యులు గ్యాలరీలో కూర్చుని పాలకమండలి సమావేశాన్ని వీక్షించారు. సమస్యలపై చర్చలు ఇలా.. క్రీడా ప్రాంగణాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణపై కార్పొరేటర్ సోహెల్ ఖాద్రి, 2023లో ప్రారంభోత్సవం జరిగినా కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తేకపోవడంపై కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. ఃమూసీ నది పునరుజ్జీవానికి మద్దతు ఇవ్వాలని కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి కోరగా మూసీకి తాము వ్యతిరేకం కాదని, అడ్డదారిలో పేదల ఇళ్లను కూల్చే చర్యలను మాత్రమే అడ్డుకున్నామని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

రైల్వే స్థలాలను రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి కేటాయించేందుకు చొరవ తీసుకోవాలని ఉపమేయర్ శ్రీలత, కార్పొరేటర్ సునీత కోరగా ఆ శాఖతో మాట్లాడుదామని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు.

ఉప్పల్‌లో ఏడున్నర ఎకరాల ప్రభుత్వ భూమిలో ఓ స్థిరాస్తి సంస్థ అక్రమంగా అపార్ట్‌మెంట్లు నిర్మించినా చర్యల్లేవని కొప్పుల నర్సింహారెడ్డి విమర్శించారు. ఐఎస్‌సదన్ డివిజన్‌లో రోడ్డు వేయకుండా బిల్లులు పొందిన ఘటనలో ఇంజినీర్లపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు శ్వేత, భాగ్యలక్ష్మి డిమాండ్ చేయగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కమిషనర్ కర్ణన్ జవాబిచ్చారు. పూడికతీత జరగకపోవడం వల్లే ముంపు సమస్య తలెత్తుతోందని, నాలాల నిర్మాణం ఇంకా మొదలుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సమస్యలపై వినూత్న నిరసన**

నాలాల్లో పూడికతీత, దోమల సమస్య, విధి దీపాలు ఇతరత్రా ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల వైఫల్యాన్ని నిరసిస్తూ భాజపా కార్పొరేటర్లు వినూత్న నిరసన తెలిపారు. దీపాలు చేతబట్టి, కార్మికుల వస్త్రధారణలో కార్పొరేటర్లు మహేందర్, శ్రవణ్, పవన్‌కుమార్, శ్రీవాణి, సరళ నిరసన వ్యక్తం చేశారు.

# మానసిక యాతన!



హైదరాబాద్ : వారంతా విధి వంచితులు.. మానసిక వ్యాధిగ్రస్థులు. కళ్ల ముందు ఏం జరిగినా,ప్రశ్నించలేరు. వారికి నయమవుతుందని కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో వదిలి వెళ్తుంటారు. కానీ అక్కడి పరిస్థితి చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో ఆహార కల్తీ కారణంగా ఒక రోగి మృతిచెందడమే కాకుండా, 95 మంది అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటన ఆసుపత్రిలోని దుర్భర స్థితిని కళ్లకు కడుతోంది. ప్రశాంత వాతావరణం అక్కడ కరవైంది.

**ఇదీ పరిస్థితి..**ః ఆహార కల్తీకి కారణమైన డైట్ కాంట్రాక్టర్ ఆరేళ్లగా చక్రం తిప్పుతున్నారు. కొత్తగా టెండర్లు పిలిచినా, మళ్లీ మళ్లీ అతనే దక్కించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. రోగులకు వడ్డించే ముందు ఆహారాన్ని తనిఖీ చేయాలి. అవేవీ పకడ్బందీగా సాగడం లేదు. ః అక్కడి వైద్యులకు బయట క్లినిక్‌లు ఉన్నాయి. దీంతో వారు పూర్తిస్థాయిలో దృష్టి సారించకలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ః

ఆసుపత్రి ఆవరణలో ఓపెన్, క్లోజ్డ్ వార్డుల పరిధిలో రహదారి మొత్తం కంకర తేలి నడిచేందుకు వీలుగా లేదు. వార్డుల సమీపంలో మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పారుతోంది. ః

రోగులు కోలుకున్న తర్వాత కుటుంబ సభ్యులకు సమాచారమిస్తారు. కుటుంబసభ్యులు లేకపోయినా, తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోయినా.. డిశ్చార్జి వార్డులో ఉంచుతారు. ఇలా ఏడాదిగా ఉంటున్న కరణ్ తాజాగా కలుషిత ఆహారంతో మృతి చెందారు. ః

ఆసుపత్రి చుట్టూ రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో ఓపెన్ వార్డుల్లో రోగులు పారిపోతున్న ఘటనలూ ఉన్నాయి. ః

ఆవరణలో చెత్తాచెదారం, ఆసుపత్రి వ్యర్థాలు పేరుకుపోయాయి. పాములు సంచరిస్తున్నాయి. పొదలు పెరగడంతో మందు బాబులు, గంజాయి పీల్చేవారు తిష్ఠ వేస్తున్నారు. ః సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. వెనక ప్రహరీని కూల్చి దారి ఏర్పాటు చేసుకున్నారు. గతంలో ఆసుపత్రిని సందర్శించిన ఉన్నత స్థాయి కమిటీలు.. రక్షణ ఏర్పాట్లకు ఆదేశించినా.. పట్టించుకునే వారే కరవయ్యారు.

ఆసుపత్రిలో పడకలు: 600

ఇన్ పేషెంట్లు 300–350

నిత్యం వచ్చే రోగుల సంఖ్య 400–450

# ఏటీఎస్ అనేదెప్పుడో?



హైదరాబాద్: వాహనం రోడ్డు ఎక్కాలంటే సామర్థ్య ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. ఇప్పటివరకు ఆయా పరీక్షలు మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ)ల ద్వారా జరుగుతున్నాయి. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్(ఏటీఎస్)ల ద్వారా ఆ పరీక్షలు చేయాలని కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్ణయించింది. ఇతర రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ కేంద్రాలను ఏర్పాటుచేసి, మానవ ప్రమేయం లేకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలో మాత్రం ఇంతవరకు ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సామర్థ్య పరీక్షలను సమర్థంగా నిర్వహించి, రోడ్డు భద్రతను మెరుగుపరచడానికి ఈ ఏటీఎస్‌లు ఉపయోగపడనున్నాయి. ఇందుకు అనుగుణంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నాలుగు స్టేషన్లతో సహా రాష్ట్ర వ్యాప్తంగా 37 ఏటీఎస్‌లు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్ అండ్ బీ శాఖ ద్వారా మొత్తం రూ.296 కోట్లతో పనులు చేపట్టేందుకు 2024లో పరిపాలన అనుమతులు కూడా మంజూరుచేసింది. అనుమతులు వచ్చిన వెంటనే మొదటి దశలో 15 (పాత జిల్లా కేంద్రాల్లో ఒకటి చొప్పున, హైదరాబాద్‌లో 4) కేంద్రాలను చేయడానికి పనులు మొదలుపెట్టినట్లు అధికారులు చెబుతున్నారు. ఎక్కడా అవి కార్యరూపం దాల్చలేదు.

**యంత్రాల ద్వారా తనిఖీలు**

ప్రయాణానికి ప్రతి వాహనం అనువుగా ఉందా? సామర్థ్యం ఎలా ఉంది? అనే విషయాలను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేస్తున్నారు. కొందరు అధికారులు, సిబ్బంది లంచాలు దండుకోవడంతో సామర్థ్యం లేని వాహనాలు రోడ్లపై చక్కర్లు కొడుతున్నాయి. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీన్ని నివారించేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకొచ్చింది. పూర్తిగా యంత్రాలను ఉపయోగించి వాహనాల సామర్థ్యాలను పరీక్షిస్తారు. ఒక్కో వాహనానికి బ్రేకింగ్ విధానాలు, టైర్లు, హెడ్ లైట్లు, స్పీడో మీటర్లు వంటి సుమారు 40 రకాల పరీక్షలను నిర్వహిస్తారు. **త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి** ఏటీఎస్‌ల ఏర్పాటు ప్రక్రియను ఆర్ అండ్ బీ శాఖకు ప్రభుత్వం అప్పగించింది. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు సుమారు ఎకరా స్థలం అవసరం. ప్రస్తుతం స్థలాల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. అనువైన జాగా దొరకని కారణంగా జాప్యమవుతోంది. త్వరలోనే టెండర్ల ప్రక్రియను పూర్తిచేస్తాం.నిర్వహణను ఇతర రాష్ట్రాల్లో ప్రైవేటు వారికి అప్పగించడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. అలాకాకుండా రాష్ట్రంలో సమర్థంగా నిర్వహిస్తాం.సి.రమేశ్, సంయుక్త కమిషనర్, రవాణా శాఖ

## చదువుల కోవెల.. చక్కదిద్దితేనే కళ

బషీరాబాద్: వేసవి సెలవులు ముగియనున్నాయి. చిన్నారులు ఇక బడిబాట పట్టనున్నారు. అక్కడ వారికి ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా తగిన చర్యలు తీసుకుంటేనే ప్రయోజనం ఉంటుంది. జిల్లాలో చాలా చోట్ల బడి ఆవరణలు అస్తవ్యస్తంగా మారాయి. ఇటువంటి వాటిపై వెంటనే అధికారులు దృష్టి సారించి బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పరిశీలనలో జిల్లాలోని కొన్ని పాఠశాలలపై చిత్ర కథనం.

**శుభ్రం చేస్తే మేలు** మోమిన్‌పేట బాలుర ఉన్నత పాఠశాల ఆవరణ అధ్వానంగా మారింది. వంట గది వద్ద చెత్త పేరుకుపోయింది. బడి వెనుకాల పొదలు పెరిగాయి. చుట్టూ ప్రహరీ ఉన్నా, గేటు లేకపోవడం వల్ల ఆకతాయిలకు అడ్డాగా మారింది.

**తలుపులు లేక** వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేదు. భవనం శిథిలావస్థకు చేరింది. వర్షాకాలం వస్తే చాలు పైకప్పు నుంచి నీరు గదుల్లోకి చేరుతోంది. తరగతి గదుల కిటికీలకు తలుపులు లేవు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం మాట్లాడుతూ పాఠశాల పునః ప్రారంభం నాటికి రంగుల వేస్తామన్నారు.

**పచ్చిక పెరిగి** మండల పరిధి దోమ బాలికల ఉన్నత పాఠశాల ఎదుట పచ్చిక పెరిగింది. పాలేపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. ఐనాపూర్, దిర్సంపల్లి పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

**నీరు నిలిచి..** బండవెల్కిచర్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి.వరండాలో వర్షం నీరు



నిలిచింది. చెత్త చేరడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. బడి ఆవరణలో చెట్ల ఆకులు చేరడంతో పరిసరాలు అస్తవ్యస్తంగా మారాయి.

**ప్రహరీలు లేక..** బషీరాబాద్ మండలంలో 62 పాఠశాలలున్నాయి, సగం పాఠశాలలకు ప్రహరీలు లేవు. కాశింపూరు బడి ఆవరణ అపరిశుభ్రంగా మారింది. పాఠశాలల ప్రారంభానికి ముందే గదులను శుభ్రం చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**అప్రమత్తంగా ఉండాల్సిందే** మండల పరిధిలోని మైతాబ్‌ఖాన్‌గూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనం శిథిలమై పెచ్చులూడుతోంది. ఇక్కడ తరగతులు నిర్వహించే పరిస్థితి లేక పాతభవనంలో కొనసాగిస్తున్నారు. **గది సమకూరాలి** పట్టణ పరిధిలోని గుండ్లకుంట గ్రామంలో రెండు గదులు ఉన్నా, ఒకటి శిథిలావస్థలో వినియోగించడంలేదు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆరుబయట కూర్చోవాల్సి వస్తోంది.

## అవగాహన మంత్రం.. ఆరోగ్య జీవనం

గోదావరిఖని: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడొద్దు. 120 మైక్రాన్‌ల కంటే మందం తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లు వినియోగించకూడదు. అని ప్రభుత్వ శాఖలు ఎప్పటి నుంచో ప్రచారం చేస్తుండగా వాస్తవంగా జరుగుతుంది మాత్రం వేరు. కాదేదీ ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళ్లడానికి అనర్హం.. అంటూ కూరగాయలు, పండ్లు, మాంసం, అల్పాహారం చివరికి వేడి వేడి చాయ్ కూడా ప్లాస్టిక్ కవర్లలోనే తీసుకెళ్తున్నారు. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం నినాదం 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం'. అందుకే ప్రభుత్వం కూడా ప్లాస్టిక్‌ను పూర్తిగా నియంత్రించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందుకే ప్లాస్టిక్‌కు బదులు గుడ్డ, నార సంచులను వినియోగించాలని, స్టీల్ డబ్బాలు, గాజు పాత్రల్లో ఇంటికి సంబంధించిన వస్తువులను తీసుకెళ్లాలని ప్రచారం చేస్తోంది. **రోజు 250 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు**

ఉమ్మడి జిల్లాలో రోజుకు 250 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు వెలువడుతున్నాయి. 13 పురపాలక, రెండు నగరపాలక సంస్థల్లో రోజుకు 526 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను సేకరిస్తున్నారు. పురపాలక, నగరపాలక సంస్థలతోపాటు 1214 గ్రామ పంచాయతీల్లో కలిపి రోజుకు 250 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను చెత్తకుప్పల్లో వేస్తున్నారు. దీని వల్ల ప్లాస్టిక్ భూమిలో కరిగిపోకుండా భూసారం దెబ్బతినడంతోపాటు భూగర్భ జలాలపై ప్రభావం పడుతోంది. ఇళ్ల నుంచి సంచులు తీసుకోవడం భారంగా భావిస్తూ ఏ చిన్న వస్తువు తీసుకున్నా ప్లాస్టిక్ సంచులే వినియోగిస్తున్నారు.

**అధికారుల తనిఖీతోనే..** ప్లాస్టిక్ సంచుల వినియోగంపై అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలి. దుకాణాల్లో తనిఖీలు చేయడం ద్వారా ప్లాస్టిక్ సంచుల్లో వస్తువులు ప్యాక్ చేసే ఇచ్చే విధానం తగ్గిపోతుంది. నగర, పురపాలక సంఘాలు అడపాదడపా తనిఖీలు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నా కొద్ది రోజులకే పరిస్థితి మొదటికి వస్తోంది.

**ఇవీ దుష్పరిణామాలు** ప్లాస్టిక్ రసాయనాలు శరీరంలోకి చేరి హార్మోన్ల అసమతుల్యతకు కారణమవుతుంది.క్యాన్సర్‌కు ప్లాస్టిక్ విచ్చలవిడి వినియోగమే కారణమన్న అభిప్రాయం ఉంది.

వ్యర్థాల్లో కలిసి ఉండే ప్లాస్టిక్‌ను పశువులు తినడం వల్ల జీర్ణం కాక మృతి చెందుతున్నాయి

భూమిలో ప్లాస్టిక్ కరిగిపోకపోవడం వల్ల భూసారం దెబ్బతింటుంది

భూమిలోకి నీరు ఇంకిపోకుండా అడ్డుకుంటుంది

మురుగు కాలువల్లో పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు పైపులకు అడ్డుగా పడి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటాయి. దీని వల్ల మురుగు నీరు రహదారులపై పారుతుంది

నదులు, చెరువుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పడేయడం వల్ల జలకాలుష్యం పెరిగిపోతుంది

ప్రతి ఒక్కరూ ఇలా చేస్తేనే..

ప్రతి ఒక్కరికీ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే ప్రభావంపై అవగాహన అవసరం. దాని వల్ల కలిగే దుష్ఫలితాలను గుర్తించాలి. ఆరోగ్య సమస్యలు రాకుండా ఉండాలంటే ప్లాస్టిక్‌కు దూరం కావాలి. అప్పుడే ప్లాస్టిక్‌ను ఆశించిన స్థాయిలో నివారించేందుకు ఆస్కారం ఉంటుంది.

సరకులను తెచ్చుకోవడానికి గుడ్డ సంచులు తీసుకెళ్లాలి

మాంసం, అల్పాహారం తీసుకు రావడానికి స్టీల్ డబ్బాలు ఉపయోగించొచ్చు.ద్రవ పదార్థాలు గాజు పాత్రల్లో తీసుకెళ్లాలి

20 ఏళ్లుగా ప్రచారంప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని కరీంనగర్‌కు చెందిన మానేరు పర్యావరణ సమితి ప్రచారం చేస్తోంది. 20 ఏళ్ల క్రితం పర్యావరణ పరిరక్షణకు సంస్థను ఏర్పాటు చేసిన కరీంనగర్‌కు చెందిన తోట లక్ష్మణ్‌రావు ప్లాస్టిక్ బదులు గుడ్డ, నార సంచులు వినియోగించాలని ప్రచారం చేస్తున్నారు.

# ఉత్తీర్ణత లక్ష్యం.. సన్నద్ధత

కరీంనగర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలను పెంచడంతోపాటు విద్యార్థుల ఉత్తీర్ణతను పెంచి వారిని ఉన్నత చదువుల వైపు ప్రోత్సహించేందుకు అధికారులు ప్రణాళికతో వ్యవహరిస్తున్నారు. ఇంటర్ ఫలితాలు వెల్లడైన అనంతరం అవి కొంత నిరాశజనకంగా మారాయి. ఈ పరిస్థితిని అధిగమించి ఇంటర్‌లో అనుత్తీర్ణులైన విద్యార్థులు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా వారిని సన్నద్ధం చేసే కార్యక్రమానికి అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతూ అనుత్తీర్ణులైన విద్యార్థులకు వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. వారు సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దుతున్నారు.

**11 జూనియర్ కళాశాలల్లో..**

జిల్లాలో 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 3736 మంది ఇంటర్ పరీక్షలు రాశారు. వారిలో 1663 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 40.40, ద్వితీయ సంవత్సరంలో 47.60 ఉత్తీర్ణత శాతంగా నిల్చింది. పేద, మధ్యతరగతి కుటుంబాల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులే ఈ కళాశాలల్లో ఎక్కువగా చదువుతున్నారు. గైర్హాజరయ్యే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు నిత్యం కళాశాలలకు వచ్చేలా అధ్యాపకులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రత్యేక తరగతులు, పరీక్షలు నిర్వహించారు. అయినా మెజారిటీ కళాశాలల్లో ఆశించిన ఫలితాలు



రాలేదు.

**ప్రత్యేక తరగతులు..**

ఇంటర్ ఫలితాల్లో పలు సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. గత నెల 24 నుంచి జరుగుతున్న ఈ తరగతులు ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ నెల 22 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా వారికి బోధనతోపాటు వారి సందేహాలను తీర్చడం, ముఖ్యమైన అంశాలను అర్థం చేయించడం, పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా అధ్యాపకులు వారిని తీర్చిదిద్దుతున్నారు. పాఠ్యాంశాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను అధ్యాపకులు వారి చరవాణి వాట్సప్‌లకు పంపిస్తున్నారు. అనుత్తీర్ణులైన ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థులందరూ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని జిల్లా ఇంటర్ విద్యాధికారి గంగాధర్ తెలిపారు.

# హెచ్‌ఎండీఏలా భావినగర అభివృద్ధి సంస్థ

హైదరాబాద్: భావినగరం అభివృద్ధికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ విధులు.. కార్యకలాపాలు హెచ్‌ఎండీఏ తరహాలో ఉండనున్నాయి. రంగారెడ్డి జిల్లాలోని ఏడు మండలాల పరిధిలోని 56 గ్రామాల్లో 765.28 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో భావినగరాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే భావినగర అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. హైదరాబాద్ మహానగర మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) తరహాలో ఫ్యూచర్‌సిటీని మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయనున్నారని అధికారులు, ప్రజలు భావించారు. ఇందుకు భిన్నంగా భావినగర అభివృద్ధి సంస్థను అభివృద్ధి కార్యకలాపాలకు పరిమితం చేసింది. 56 గ్రామాల్లో భవిష్యత్తులో రానున్న ఇళ్లు, పరిశ్రమలు, ఐటీ సంస్థలు, బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలకు సంబంధించిన లేఅవుట్లు, నిర్మాణాలకు అనుమతులు జారీచేయనుంది. ఫ్యూచర్‌సిటీలో ఉన్న గ్రామాల్లో పరిపాలన యథాతథంగా



కొనసాగనుంది.

**అధికారులు.. సిబ్బంది నియామకాలు**

భావినగర అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశాక కమిషనర్ సహా వివిధ హోదాల్లో 36మంది అధికారులు, సిబ్బంది నియామకాలకు సర్కారు అనుమతి ఇచ్చింది. సంస్థ కమిషనర్‌గా కొద్దిరోజుల క్రితం ఐఏఎస్ అధికారి కె.శశాంక బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతానికి అదనపు కమిషనర్‌తో సహా అధికారులు, సిబ్బందిని సాధారణ పరిపాలన, పురపాలక శాఖల నుంచి డిప్యూటేషన్ పద్ధతిలో తీసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

**ఉపాధికి అనర్హులవుతారని**

ఫ్యూచర్ సిటీలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కందుకూరు, కడ్తాల్, ఆమన్‌గల్ మండలాల ప్రజలు వర్షాధారంపై పంటలు పండిస్తుంటారు. వీరికి ఉపాధి హామీ పథకం అమలవుతోంది. భావి నగరాన్ని కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తే ఈ పథకానికి అనర్హులవుతారన్న భావనతో అధికారులు మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు వద్దని ప్రభుత్వానికి విన్నవించగా సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించారు. ఇటీవలే ఉన్నతాధికారులతో చర్చించి ఫ్యూచర్‌సిటీ విధివిధానాలు ఖరారు చేశారు.

# దివ్యంగా జీవించేలా..

హైదరాబాద్: దివ్యాంగుల ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు యూత్ ఫర్ జాబ్స్ అనే సంస్థతో కలిసి ప్రత్యేక జాబ్ పోర్టల్ ఏర్పాటు చేసింది. వివిధ వైకల్యాలతో బాధపడుతున్న వారు.. ప్రైవేటు పరిశ్రమల్లో సరైన ఉద్యోగ అవకాశాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటివారికి.. వారి వారి అర్హతలను బట్టి ఉద్యోగం ఇప్పించి, స్వశక్తితో జీవించేలా చూసేందుకు ఈ పోర్టల్ దోహద పడుతోంది. పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకుంటే, విద్యార్హతలు, సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకొని సరిపడే ఉద్యోగాన్ని కల్పిస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క 8 నెలల కిందట ఈ పోర్టల్‌ను ప్రారంభించారు. ప్రైవేటు ఉద్యోగాల కోసం దివ్యాంగులు ఆయా సంస్థల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అంతర్జాలం సాయంతో నేరుగా దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. %https://pwdjobportal.telangana.gov.in% లో విద్యార్హతలు, ఇతర నైపుణ్యాలను నమోదు చేయాలి. నేరుగా దరఖాస్తు చేసుకోవాలనుకుంటే మలక్‌పేట నల్గొండ చౌరస్తాలోని దివ్యాంగులు శాఖ సంచాలకుడి కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు.

# 'కాసు'క్కూర్చున్నారు



హైదరాబాద్ : దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థలో లంచం ఇవ్వనిదే పని కావట్లేదనే ఆరోపణలు ఉన్నాయి. కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు చేయిచాస్తుంటారనే మాటలు వినిపిస్తున్నాయి. ఇటీవల అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కుతుండటమే ఇందుకు నిదర్శనం. కొందరు అధికారులు రూ.లక్షల్లో జీతాలు తీసుకుంటూనే లంచాల కోసం కాసుక్కూర్చుంటున్నారు.

**ఫోన్ నంబరు ఉన్నా**

అడిగితే ఫిర్యాదు చేసేందుకు 040-23454884/7680901912 నంబర్లు కేటాయించారు. ప్రారంభంలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేసి ముగ్గురిపై చర్యలు తీసుకున్నారు. ఏమైందో ఏమో ఆ తరువాత అవినీతికి పాల్పడుతున్న వారిపై పెద్దగా చర్యలు లేకపోవడంతో వినియోగదారుల్లోనూ విశ్వాసం కొరవడింది. చివరికి అనిశాను ఆశ్రయించి అవినీతి అధికారులను పట్టిస్తున్నారు.

**నిబంధనల మేరకు ఉన్నా సరే..**

కొత్త కనెక్షన్, మీటర్ జారీ, లైన్ల మార్పిడి, ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు, అదనపులోడు కేటాయింపు, తగ్గింపు వరకు విద్యుత్తు సంస్థలో ఏ పని కావాలన్నా పైకం సమర్పించుకోవాల్సిందే. ఫైల్‌ను బట్టి రూ.30వేల నుంచి రూ.3 లక్షలు వసూలు చేస్తున్నారు. గచ్చిబౌలి, జీడిమెట్ల, కూకట్‌పల్లి, ఇబ్రహీంబాగ్, పటాన్‌చెరు తదితర డివిజన్లలో 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కింది నుంచి కార్పొరేట్ కార్యాలయం వరకు కొందరు వాటాలు పంచుకుంటున్నారు. అవినీతిని అరికట్టేందుకు ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చినా వినియోగదారులు కలిసే వరకు దస్త్రం కదలదు. అన్నీ సరిగా ఉన్నా ఏదో పేరుతో కొర్రీలు వేస్తుంటారు.

**ఇటీవల ఘటనల్లో..**

కొత్త భవనానికి ట్రాన్స్‌ఫార్మర్, మీటర్ కనెక్షన్ల మంజూరుకి రూ.50వేలు డిమాండ్ చేసి రూ.10వేలు తీసుకుంటుండగా ప్రగతినగర్ ఏఈ జ్ఞానేశ్వర్ అనిశాకు దొరికారు.

అంబర్‌పేటలో కనెక్షన్ కోసం అసిస్టెంట్ లైన్‌మెన్ శివ మల్లేష్ రూ.50వేలు అడిగారు. అతడి సహాయకుడు డబ్బులు తీసుకుంటుండగా చిక్కాడు. గత నెలలో మంగళ్‌హాట్‌లో ఆర్టిజన్ రూ.20వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.

ఫిబ్రవరిలో రూ.75 వేల లంచం తీసుకుంటూ గచ్చిబౌలి సబ్ డివిజన్ ఏడీఈ సతీష్ ఏసీబీకి చిక్కారు. ఆ తర్వాత ఆయన ఇంటిలో చేసిన సోదాల్లో రూ.కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టినట్లు వెల్లడైంది.

**సేవల్లో పారదర్శకత కొరవడి..**

కొత్త కనెక్షన్‌కు ఎంత డిపాజిట్ చెల్లించాలి వంటి మినహా మిగతా పనులకు సంబంధించి ఎంత ఖర్చు అవుతుంది? అనే వివరాలు ఎక్కడా ఉండవు. ఎవరైనా వినియోగదారుడు వెళ్లి సమాచారం అడిగినా చెప్పేవారు ఉండరు. చేసేది లేక మధ్యవర్తులను ఆశ్రయించి వినియోగదారులు జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారు.

# పూడిక పెరిగి.. సామర్థ్యం తగ్గి



జగిత్యాల : వృథాగా 140 టీఎంసీలు

ప్రాజెక్టు: శ్రీరామసాగర్ ప్రాజెక్టు

నిర్మాణ సమయంలో గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం: 112 టీఎంసీలు

ప్రస్తుతం నిల్వచేస్తున్న నీరు: 80.501 టీఎంసీలు

ఉమ్మడి జిల్లాకు ప్రధాన నీటివనరైన శ్రీరామసాగర్ జలాశయంలో పూడిక పేరుకుపోయి గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం ఏటికేడు తగ్గుతోంది. వానాకాలంలో ఎస్సారెస్పీలోకి 287 టీఎంసీల వరదనీరు రాగా నిల్వసామర్థ్యం లేనందున దాదాపు 140 టీఎంసీలకుపైగా నీటిని మిగులు జలాలుగా గోదావరిలోకి వదలాల్సివచ్చింది. ఈ నేపథ్యంలో రూ.1,570 కోట్ల నిధులతో శ్రీరామసాగర్‌లో పూడికతీతను చేపట్టాలి. ప్రస్తుతం ప్రాజెక్టు వరదగేట్లను తెరుస్తున్నా గేట్లకిందుగా పూడికను తొలగించే స్లూయిస్‌గేట్లను తెరిచేలా చర్యలు చేపడితే దీర్ఘకాలిక ప్రయోజనాలుంటాయి. రూ.వెయ్యి కోట్లతో ప్రాజెక్టు పరిధిలో కాలువల లైనింగ్, తూములు, షట్టర్లు, డ్రాపుల మరమ్మతు చేపట్టాలి.

రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాజెక్టులలో పేరుకున్న పూడికను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాకు ప్రధానంగా సాగునీరందించే ప్రాజెక్టుల్లోనూ పూడికను తొలగించి వాననీటిని నిల్వచేస్తేనే సాగుకు సుస్థిరత సిద్ధిస్తుంది. మన ప్రాంత తలసరి నీటి లభ్యత 1400 క్యూబిక్ మీటర్లుగా ఉంటే వాడకం 801 క్యూబిక్ మీటర్లు మాత్రమే కాబట్టి అన్ని ప్రాజెక్టుల్లోనూ పూడికతీత, మరమ్మతు చేపట్టి వాననీటి నిల్వ, వినియోగ సామర్థ్యాన్ని పెంచటం అవశ్యంగా మారింది.

ఎత్తిపోతలకు ప్రధానం..

శ్రీపాద ఎల్లంపల్లి

23 టీఎంసీలు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల నుంచి లక్ష్మీ, సరస్వతీ, పార్వతీ పంపుహౌస్‌ల ద్వారా ఎత్తిపోసిన నీటినిల్వతో పాటు ఎగువ నుంచి వచ్చే వరదనీటి నిల్వకు ఎల్లంపల్లి ప్రాజెక్టు ప్రధాన ఆదరువుగా ఉంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులకు మరమ్మతు ఆవశ్యకత ఉండటంతో ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టులోనే నీటిని నిల్వచేసి నంది, గాయత్రీ పంపుహౌస్‌లద్వారా శ్రీరామసాగర్, మధ్యమానేరు, దిగువమానేరు, అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లలోకి తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో నూతన ప్రాజెక్టు కాబట్టి పూడిక అంతగా లేకుండా ప్రాజెక్టు నిర్వహణ తదితరాలకు రూ.50 కోట్లవరకు నిధులు కేటాయించాల్సి ఉంది.

రూ.100 కోట్లు అవసరం

మధ్యమానేరు

30 టీఎంసీలు

28 టీఎంసీలు

మధ్యమానేరు జలాశయం నూతనంగా నిర్మించిన ప్రాజెక్టు కాబట్టి పూడిక తక్కువగానే ఉంది. శ్రీరామసాగర్ వరదకాలువ, మానేరు వాగు ద్వారా వచ్చే నీటినిల్వకు, అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ తదితర ప్రాజెక్టులకు నీటిని తరలించే ప్రధాన జలాశయం కాబట్టి మధ్యమానేరులో పూడికతీత అత్యంత అవశ్యంగా మారింది. దాదాపు రూ.100 కోట్ల నిధులతో పూడికతీతతో పాటు ప్రాజెక్టు పరిధిలో మరమ్మతు చేపట్టాల్సి ఉంది.

అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టు

దిగువమానేరు

26 టీఎంసీలు

24 టీఎంసీలు దిగువ మానేరులో ప్రస్తుతం నీటినిల్వ 24 టీఎంసీలుగా పేర్కొంటున్నా 22 టీఎంసీలకు తగ్గినట్లు నిపుణులు పేర్కొంటున్నారు. శ్రీరామసాగర్ నుంచి ఎల్‌ఎండీ ఎగువ వరకు ఒక నీటి విడుదల షెడ్యూల్ ఉండగా ఎల్‌ఎండీ దిగువన కరీంనగర్, పూర్వపు వరంగల్, నల్గొండ జిల్లాలకు మరో షెడ్యూల్ ఉంటుంది. కాబట్టి అత్యంత ముఖ్యమైన ఎల్‌ఎండీలో రూ.350 కోట్లతో పూడికతీతతో పాటు ప్రాజెక్టు పరిధిలో కాలువల లైనింగ్, ఇతర మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

# సాగర్ ఆయకట్టుకు సాగునీరు బంద్



ఖమ్మం : జిల్లాలో సాగర్ కాలువకు సాగునీటి సరఫరా గురువారం అర్ధరాత్రి నుంచి బంద్ చేశారు. రబీ సీజన్‌లో పంటల సాగుకు ఏప్రిల్ 24 వరకు అందిస్తుంటారు. ఈ ఏడాది అలాగే ఇస్తామని మొదట నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. సాగర్ జలాశయంలో నీటిమట్టం తగ్గుతున్నందున వేసవిలో హైదరాబాద్ నగరం సహా వివిధ జిల్లాలకు తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలనే ఉద్దేశంతో 14 రోజుల ముందుగానే సాగునీటి సరఫరా ఆపేశారు. సాగర్ జలాశయం వద్ద ఎడమ కాలువకు నీటి విడుదల ఆపేయగా, అర్ధరాత్రి పాలేరు రిజర్వాయర్ అవుట్ ఫాల్ నుంచి దిగువకు నీటి విడుదల నిలిపేశారు. పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం 23 అడుగులకు చేరగా.. వైరా రిజర్వాయర్ పూర్తిగా నిండింది. సాగర్ కాలువల పరిధిలో సుమారు 300కు పైగా చెరువులకు వారం రోజులుగా నీటిని అందించగా.. నీటిమట్టం పెరిగింది. పాలేరు పాత కాలువ కింద ఆయకట్టుకు కొన్ని రోజులు నీటిని విడుదల చేయనున్నారు. 21 ఎంబీసీ, 16, 17 (నందిగామ), బోనకల్లు, మధిర బ్రాంచి కాలువలు సహా అన్ని మేజర్, మైనర్ కాలువలకు నీటి సరఫరా నిలిచిపోయింది. వైరా మండలం రెబ్బవరం గ్రామంలో సుమారు 100 ఎకరాల్లో వరి పంట పొట్ట దశలో ఉందని, స్థానిక వనరులతో పంట కాపాడుకోవాలని అక్కడి రైతులకు అధికారులు సూచించారు. జిల్లావ్యాప్తంగా సాగర్ ఆయకట్టులో మొక్కజొన్న, వరి పంటలు కోతకొచ్చాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో సాగర్ ఆయకట్టుకు విజయవంతంగా సాగునీరు సరఫరా చేశామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి విడుదల బంద్ చేసినట్లు జలవనరులశాఖ ఎస్ఈ మంగళపుడి వెంకటేశ్వర్లు తెలిపారు.

# ప్రీపెయిడ్ మీటర్లకు మంగళం..!

నల్గొండ : అధునాతన ఎలక్ట్రానిక్ ఎనర్జీ (ప్రీపెయిడ్) మీటర్ల వ్యవస్థ నల్గొండ జిల్లాలో అటకెక్కింది. విద్యుత్తు సంస్కరణలో భాగంగా పంపిణీలో నష్టాలు, బకాయిలు పెరిగిపోకుండా వంద శాతం బిల్లులు వసూలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటుకు 2020లో శ్రీకారం చుట్టింది. ముందుగానే డబ్బు చెల్లించి విద్యుత్తు వినియోగించే మీటర్లను ప్రయోగాత్మకంగా ముందుగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు బిగించాలని నిర్ణయించింది. విజయవంతం అయితే ఇంటింటికీ 2025 నాటికి స్మార్ట్ ఎనర్జీ మీటర్లు అమర్చాలని ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగా నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వాల కార్యాలయాలకు ఏర్పాటు చేయడంతో పాటు 15 శాతం విద్యుత్తు నష్టం జరుగుతున్న ప్రాంతాల్లో 850 ప్రీపెయిడ్ విద్యుత్తు మీటర్లు ఏర్పాటు చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో ఈ మీటర్ల వ్యవస్థ మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలిపోయింది. ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోంది.

**నిర్వహణలో అధికారులు విఫలం**

ప్రీపెయిడ్ మీటర్ల నిర్వహణలో విద్యుత్తు సంస్థ అధికారులు విఫలం అయ్యారు. మీటర్ల వినియోగంపై సంబంధిత సిబ్బందికి శిక్షణ ఇవ్వకపోవడంతో పాటు తరచూ మీటర్లు మొరాయిస్తున్నాయి. సరిచేసే నాథుడే లేక పాత పద్ధతిలో బిల్లులు వసూళ్లు చేస్తున్నారు. మరో పక్క ముందుగా బిల్లులు చెల్లించే పరిస్థితుల్లో ప్రభుత్వ కార్యాలయాలు లేకపోవడంతో ప్రీపెయిడ్ మీటర్ల వ్యవస్థకు మంగళం పాడారనే విమర్శలు వస్తున్నాయి. పాత పద్ధతిలో విద్యుత్తు బిల్లులు వసూలు చేయడంతో ఒక నల్గొండ జిల్లాలోనే ప్రభుత్వ కార్యాలయాలు సుమారు రూ.129 కోట్లు విద్యుత్తు సంస్థకు చెల్లించాల్సి ఉంది. ప్రీపెయిడ్ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తే విద్యుత్తు బిల్లులు రూపంలో సంస్థకు బకాయిలు లేకుండా ఆదాయం సమకూరే అవకాశం ఉన్నా.. సంస్థ అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదు. దీనిపై సంస్థ ఎస్ఈ వెంకటేశ్వర్లను చరవాణి ద్వారా 'న్యూస్‌టుడే' సంప్రదిస్తే అందుబాటులోకి రాలేదు.

# రోడ్ల వెంబడి యథేచ్ఛగా పారబోత

హైదరాబాద్-విజయవాడ 65వ జాతీయ రహదారితో పాటు సూర్యాపేట ఖమ్మం 365వ జాతీయ రహదారి పొడవునా ఎక్కడపడితే అక్కడ ఇలా పారిశ్రామిక వ్యర్థాలను పడేస్తున్నారు. చివ్వెంల మండలం వల్లభాపురం, ఖాసీంపేట, జగన్‌నాయక్‌తండా, అక్కలదేవి గూడెం, చందుపట్ల గ్రామాల సమీపంలో వ్యర్థాలను పారబోస్తుండగా స్థానికులు వారిని పట్టుకొని పోలీసులకు ఫిర్యాదులు చేసిన ఘటనలు ఉన్నాయి.

**నేల, నీరు కలుషితం..**

వ్యర్థాలను పారబోసిన ప్రాంతం గ్రామాలకు సమీపంలో ఉండడంతో వాటి నుంచి వచ్చే దుర్గంధాన్ని పరిసర వాసులు భరించలేకపోతున్నారు. దీంతో శ్వాసకోస సంబంధిత వ్యాధులు వస్తాయనే ఆందోళనలో ఉన్నారు. అవశేషాల ప్రభావానికి ఆయా ప్రాంతాల్లో చెట్లు చనిపోవడమే కాకుండా అక్కడ మరో చెట్టు పుట్టి పెరిగే పరిస్థితి లేకుండా పోతోంది. అవి భూమిలోకి ఇంకి బోరుబావుల నీళ్లు సైతం కలుషితమయ్యే పరిస్థితి వస్తుందంటున్నారు.

దుర్వాసన భరించలేకపోతున్నాం:

బైరు రవీందర్, జగన్‌నాయక్‌తండా

వల్లభాపురం, ఖాసీంపేట, జగన్‌నాయక్‌తండా పరిసర ప్రాంతాల్లో రహదారుల వెంట ఇష్టానుసారంగా పారబోస్తున్నారు. ఎన్నోసార్లు వారిని పట్టుకొని అధికారులకు అప్పగించాం. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో షరామామూలైంది. వాటి నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నాం.

ఫిర్యాదు చేసినా పట్టింపు లేదు

బాసిపంగు సునీల్, చందుపట్ల

గత ఐదేళ్ల నుంచి రోడ్ల వెంట గుర్తుతెలియని వ్యక్తులు వ్యర్థాలను పారబోస్తున్నారు. దీంతో స్థానికులు, ప్రయాణికులు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోంది. పర్యావరణానికి హాని, శ్వాసకోస సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. నమూనాలు సేకరించాం:

పురుషోత్తంరెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి అధికారి

ఇటీవల అక్కలదేవిగూడెం వద్ద పారబోసిన వ్యర్థాలలో నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించాం. అవి హానికరమైనవా లేదా అనేది తేలాల్సి ఉంది. తుది నివేదిక రాగానే తగు చర్యలు తీసుకుంటాం. పోలీసులు సైతం దీనిపై దృష్టిపెట్టి కేసులు నమోదు చేయాలి.

# ఎక్కడిదో వ్యర్థం.. దారెంట దుర్గంధం



చివ్వెంల : పరిశ్రమలు ఎక్కడివో.. నిషేధిత రసాయన వ్యర్థాలను మాత్రం ఇక్కడ పడేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు వాహనాలలో తీసుకొచ్చి రోడ్ల వెంట బహిరంగంగా పారబోస్తుండడంతో పరిసర గ్రామాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దుర్వాసన భరించలేక, శ్వాసకోస సంబంధిత వ్యాధులొస్తాయని ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు అధికారులు సంబంధిత వ్యక్తులను, వాహనాలను అదుపులోకి తీసుకొని కేసులు సైతం నమోదు చేసినా వికృత చేష్టలు ఆగడంలేదు. ఇప్పటికైనా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చొరవ తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

**శుభ్రపరిచే చర్యలు చేపట్టకనే..** పలు రసాయన పరిశ్రమలలో హానికర అవశేషాలు బయటకు రావడం సహజం. వాటిని అదే పరిశ్రమలో శుభ్రపరిచి (ట్రీట్మెంట్మెంట్) చేసి అదే పరిశ్రమలో ఉంచుకోవాలి. లేదంటే వాటిని నిర్వహించే ప్రత్యేక ప్రదేశాలకు పంపించాలి. ఇందుకు ఖర్చు ఎక్కువగా వస్తున్నందున యాజమాన్యాలు ఇలా రోడ్ల వెంట పడేసి సులువుగా చేతులు దులుపుకొంటున్నారు.

చురకలు



# నోరెండుతోంది.. నీరందలేదు!

విశాఖపట్నం: వేసవిలోనే కాదు.. జోరున వానలు కురిసే సమయంలో తాగునీరు లేక ఇబ్బందిపడే గ్రామాలు.. ఉదయం నిద్ర లేస్తూనే నెత్తిన బిందె పెట్టుకుని నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితులు ఈనాటికీ ఉన్నాయి. ఈ ఇబ్బందులు తీర్చేలా ఇంటింటికీ రక్షిత తాగునీరందించే లక్ష్యంతో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులు పడుతూ.. లేస్తూ సాగుతున్నాయి. జల్‌జీవన్ నిధులతో పనులు పూర్తి చేయకుండానే.. చేసినట్లు నివేదికలిచ్చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల కింద జల్‌జీవన్ మిషన్‌కు భారీగా నిధులు మంజూరు చేసింది. ఈ పథకం ద్వారా జిల్లాలో 24 మండలాల పరిధిలో సమృద్ధిగా తాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా రెండు విడతల్లో రూ. 567 కోట్లతో 1658 పనులు చేపట్టారు. వైకాపా పాలనలో ఈ పనులు నత్తను తలపించాయి. చాలాచోట్ల అసంపూర్తిగా ఉండిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన ఈ పనులకు ప్రాధాన్యమిచ్చి త్వరిగతిన చేపట్టాలని ఆదేశాలిచ్చింది. పనులు వేగవంతం చేసి కొన్ని గ్రామాల్లో ఈ పథకం ద్వారా పూర్తిస్థాయిలో నీరిచ్చేస్తున్నామంటూ గ్రామీణ నీటిసరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు నివేదికల్లో చూపిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి.

నక్కపల్లి మండలం వేంపాడులో 1050 నివాసాలు ఉండగా, సుమారు 200 ఇళ్లకు కుళాయిలు వేయాలి. ఇక్కడికి నెల్లిపూడి నుంచి నీరు వస్తుంది. ఇది తాగేందుకు అంతగా బాగోదు. మెగా ప్రాజెక్టు నీరు రావడానికి ఇంకా సమయం పట్టనుంది. ఇటీవలే పైపులైను నిర్మాణం చేపట్టారు. ఉద్దండపురంలోనూ పనులు పూర్తికాలేదు. ప్రస్తుతం చేయాల్సిన పనులకు నిధులు రావాల్సి ఉంది. ఇదే విషయాన్ని ఇక్కడి సర్పంచితో పాటు, కూటమి నాయకుడు మంత్రి అనిత దృష్టికి



తీసుకెళ్లారు. ఇందులో సుమారు వెయ్యిచోట్ల పనులు పూర్తి చేసినట్లు నివేదికలు పేర్కొంటున్నా, కొన్ని చోట్ల పైపులు పూర్తిస్థాయిలో వేయలేదు. కుళాయిలు ఏర్పాటు కాలేదు. అన్నీ చేసినా నీరందడంలేదు. అయినా నివేదిల్లో మాత్రం శతశాతం చేసినట్లు చూపించారు. తాగునీటి ఇక్కట్లు తీర్చాలంటూ జిల్లా, మండల కేంద్రాల్లో అధికారులకు అందుతున్న వినతుల్లో జల్‌జీవన్ పనులు శతశాతం పూర్తయినట్లు పేర్కొంటున్న గ్రామాలు సైతం ఉండటం గమనార్హం. కోటవురట్ల మండలం కొడవటిపూడిలో పనులు పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నా, నీటి సరఫరా జరగడంలేదు. రామచంద్రపాలెంలో పనులు పూర్తికాకున్నా, పూర్తయినట్లు పేర్కొన్నారు.

జిల్లా సమాచారం

మండలాలు: 24

జనాభా: 15.33 లక్షలు

మంజూరైన పనులు: 1658

శతశాతం పూర్తయినవి: 989

జరుగుతున్నవి: 669 **ఆగస్టులోగా పూర్తి:** సుమారు వెయ్యి పనుల వరకు శతశాతం పూర్తి చేశారు. అక్కడక్కడ కొద్దిపాటి పనులు మిగిలున్నా వాటిని పూర్తి చేసే ఉద్దేశంతో శతశాతం నివేదికలు ఇస్తుంటారు. మిగిలిన పనులకు నిధులు వస్తే ఆగస్టులోగా పూర్తవుతాయి. మూడో విడతకు మరో 500 పనులకు ప్రతిపాదనలు తయారు చేశాం. వీటికి అనుమతులు రావాలి. ఏఎస్‌ఏ రామస్వామి, ఎస్‌ఈ, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం

# రెవెన్యూలో అవినీతి లీలలు



గుత్తి : గుత్తి రెవెన్యూ కార్యాలయంలో దళారులతోనే కొన్ని ముఖ్యమైన పనులు కార్యాలయంలో సాగుతున్నాయి. పట్టాదారు పాసుపుస్తకాలు, వాల్టా ధ్రువీకరణపత్రం, నాన్‌రీమ్యారేజీ, నిరుద్యోగం ధ్రువీకరణ పత్రాలతోపాటు ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణపత్రాల మంజూరుకు దళారులు మధ్యవర్తిత్వం వహిస్తూ ప్రజల సొమ్మును దండుకుంటున్నారు. దళారులు కార్యాలయానికి వస్తే సకల మర్యాదలు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఇదంతా పనివేళలు ముగిశాక తాపీగా పనులు చేయించుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో రాత్రి 9 గంట వరకు కార్యాలయంలోనే ఉంటూ పనులు చేయిస్తున్నారు. ప్రధానంగా స్థిరాస్తి వ్యాపారులు భూమార్పిడులకు ఎక్కువగా వస్తుంటారని సమాచారం.

**కొన్ని ఉదాహరణలివిగో?**

గుత్తి ఆర్.ఎస్.కు చెందిన రైతు పట్టాదారు పాసుపుస్తకం కోసం ఓ వీఆర్వోను ఆశ్రయించగా రూ.30 వేలు ఖర్చు అవుతుందని చెప్పారు. సదరు రైతు ఈనెల 4న గుత్తిలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సంయుక్త కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.

కొత్తపేటలో ఓ మహిళకు ఆమె తాత సుమారు 5ఎకరాల భూమి ఇచ్చారు. ఆ భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు చేయించుకోలేదు. దీంతో రెవెన్యూ అధికారులు మిగులు భూమికింద దస్త్రాలో నమోదు చేశారు. ఆ భూమికి ఇప్పుడు పట్టాదారు పాసుపుస్తకం పొందాలని కార్యాలయానికి వెళ్లగా ఓ ఉద్యోగి రూ.18 వేలు అధికారుల పేరు చెప్పి తీసుకోవడం గమనార్హం. తనకు సొమ్ము ముట్టలేదని ఓ అధికారి మిగులు భూమి నుంచి విడదీసేందుకు దస్త్రంపై సంతకం చేసేందుకు ఇబ్బంది పెట్టాడు. ఊబిచర్లలో ఓ వ్యక్తికి నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని ఇచ్చేందుకు దళారీ ద్వారా రూ.3 లక్షలు తీసుకున్నారు. ఎలాంటి దస్త్రాలు లేకుండానే వన్–బీ, అడంగల్ వచ్చేలా చేశారు. గుత్తికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు తమ వాటా భూములకు పాసు పుస్తకాల కోసం వెళ్లగా ఓ చిరుద్యోగి రూ.3లక్షలు అడిగాడు. దళారీ రూ.70వేలకు నిర్ణయించాడు. రైతులు తమ పొలాల్లో బోర్లు తవ్వించుకుని వాల్టా ధ్రువీరకరణ పత్రాన్ని రెవెన్యూ అధికారులతో సర్టిఫికెట్ తీసుకుని విద్యుత్తు కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ధ్రువీకరణ పత్రానికి కూడా ముడుపులు తీసుకుంటున్నారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

దళారీల వ్యవహారంపై విచారిస్తాం. తమ కార్యాలయంలో ఎవరూ ప్రజల నుంచి ముడుపులు తీసుకోవడం లేదు. ఎవరైనా సొమ్ము అడిగితే మా దృష్టికి తేవాలి. దళారీలు తమ కార్యాలయంలో లేరు. తమపేర్లు చెప్పి ఎవరైనా సొమ్ము అడిగితే ఎవరూ ఇవ్వకూడదు. ఓబిలేసు, తహసీల్దారు, గుత్తి

# ‘ఆవ’ను చూస్తే.. అవని పులకించే!!

విశాఖపట్నం: ‘కొండకర్ల ఆవ’... ఈ పేరు వింటే చాలు ప్రకృతి ప్రేమికుల మనసు వెంటనే అక్కడికి వెళ్లిపోతుంది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం–మునగపాక మండలాల నడుమ ఉన్న ఈ మంచినీటి వనరు ఉమ్మడి విశాఖ జిల్లాలోని పర్యాటకులకు సుపరిచితమే. కార్తిక మాసం, వారాంతాల్లో ఇక్కడ సందడిగా ఉంటుంది. పలు సినిమాలు కూడా చిత్రీకరించారు. తాజాగా...పర్యావరణ ‘రక్షిత ప్రదేశం’గా ప్రభుత్వం గుర్తించడంతో ఈ ప్రాంత పరిరక్షణపై నమ్మకం పెరిగింది. సమీప ప్రాంతాల పర్యావరణ పరిరక్షణలో, నీటి అవసరాలు తీర్చడంలో కీలకంగా మారిన ఈ ఆవ దాదాపు రెండు వేల ఎకరాల్లో విస్తరించింది. ఎన్నో రకాల జీవ జాతులను, పక్షులను ఇక్కడ చూడొచ్చు. అనకాపల్లి రైల్వేస్టేషన్ నుంచి 14 కిలోమీటర్ల దూరంలో, విశాఖ విమానాశ్రయానికి దాదాపు 40 కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడ నీటిపై తేలియాడే వంతెన, ఫైబర్ బోట్లు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. పచ్చని కొండలను తిలకిస్తూ... తామర పువ్వుల సోయగాలను



వీక్షిస్తూ... ‘ఆవ’ జలాల్లో చేసే విహారం మరపురానిదే. ఏటా పర్యావరణ పరిరక్షణ దినోత్సవాలు నిర్వహించే సందర్భాల్లో ఆవ లాంటి జల వనరుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

# అంతటా ప్లాస్టిక్ భూతం హవా



విశాఖ : విశాఖలో పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ ఆధ్వర్యంలో కొన్ని కార్యక్రమాలు అమలు చేస్తున్నా... పూర్తిస్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదు. వాయు, నీటి కాలుష్యంతో నేటికీ నగర ప్రజలు సతమతమవుతున్నారు. ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోవడం, మొక్కల పెంపకం తగ్గిపోవడం విఘాతంగా మారింది. దీనికితోడు పర్యావరణం పేరిట జీవీఎంసీలో కొందరు అధికారులు చేపడుతున్న చర్యలతో ఎలాంటి ఉపయోగం లేకపోగా, ఏటా రూ.లక్షల్లో ప్రజాధనం వృథా అవుతోంది.

**పేరుకే నిషేధం..!:** నగరంలో రోజూ 1100 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. అందులో 200 మెట్రిక్ టన్నుల మేర ప్లాస్టిక్, థర్మాకోల్ వ్యర్థాలు ఉంటున్నాయి. జీవీఎంసీ కార్మికులు నిత్యం 180 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్నా, 20 టన్నుల వరకు కాలువలు, గెడ్డల్లోనే ఉండిపోతుంది. నగరంలో సింగిల్ యూజ్డ్ (ఒకసారి మాత్రమే వినియోంచే) ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉన్నా.. క్షేత్రస్థాయి పరిస్థితి అందుకు భిన్నంగా దర్శనమి స్తుండడం గమనార్హం. స్వచ్ఛ సర్వేక్షణ్ సందర్భంగా అధికారులు నాలుగైదు రోజులు హడావుడి చేసి, ఆ తర్వాత చూసీచూడనట్టు వదిలేస్తుండడంతో ప్లాస్టిక్ వినియోగం తగ్గడం లేదు.

**నిబంధనలు.. నామమాత్రం**

‘జీవీఎంసీ ఘన వ్యర్థాల నిర్వహణ–2016’ నిబంధనలు నామమాత్రంగానే అమలు చేస్తున్నారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. కాని చాలా మంది నివాసితులు ఇళ్లల్లో పోగయ్యే వ్యర్థాలను నేరుగా రహదారులపై, కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తున్నా... వారిపై ఎలాంటి చర్యలు ఉండడం లేదు.

నగరంలో యూజీడీ (భూగర్భ మురుగునీటి వ్యవస్థ) ద్వారా మురుగునీరు ఎస్టీపీకి(మురుగునీటి శుద్ధి కేంద్రాలు) చేరుతుంటుంది. కానీ, చాలాచోట్ల సరైన నిర్వహణ లేకపోవడంతో యూజీడీ వ్యవస్థ దారుణంగా తయారై... మురుగంతా రోడ్డెక్కి ఆయా పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. బీ విశాఖ నగరం వాటర్ ప్లస్ ప్లస్ (బహిరంగ విసర్జన రహిత) నగరంగా గుర్తింపు పొందింది. అయితే జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు, ఇంజినీరింగ్ అధికారుల అలసత్వంతో కొన్నిచోట్ల బహిరంగ మల,మూత్ర విసర్జన కొనసాగుతూనే ఉంది.

**కాలుష్యం కమ్మేస్తోంది..**

పరిశ్రమలతో పాటు, లెక్కకు మించి వాహనాలు రోడ్డెక్కడంతో కాలుష్య తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. కాని ఆ స్థాయిలో ఎక్కడా పచ్చదనం పెంపు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నౌకాదళం, పోర్టుతో పాటు, ఇతర సంస్థల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో కొండలపై విత్తన బంతులు విసురుతున్నా... ఎక్కువ సంఖ్యలో మొక్కలు బతకడం లేదని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. ఏటా నగరంలో కనీసం లక్ష మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు, ఉద్యానవనాలను, మడ అడవుల్ని సంరక్షించే కార్యక్రమాలు అమలు చేస్తేనే... విశాఖ పర్యావరణ నగరిగా మారుతోందని నిపుణులు చెబుతున్నారు.

# అవునన్నారా.. కాదన్నారా..?

చిత్తూరు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు టన్ను తోతాపురికి రూ.12 వేలు చెల్లించాలని ప్రకటించారు. గుజ్జు పరిశ్రమల యజమానులు, ర్యాంపుల నిర్వాహకులు, మండీ వ్యాపారులతో సుదీర్ఘంగా సమీక్షించి ఈ నిర్ణయం తీసుకున్నారు. రోజురోజుకు మామిడి ధరలు పతనమవుతున్న తరుణంలో ఇది రైతులకు మేలు చేసే నిర్ణయమైనప్పటికీ.. అమలుకు గుజ్జు పరిశ్రమల యజమానులు జాప్యం చేస్తున్నారు. అసలు కలెక్టర్ల ప్రకటించిన ధరకు వారు అవునన్నారా..? కాదన్నారో తెలియడం లేదు. ఆ మేరకు ఎప్పటి నుంచి కొనుగోలు చేస్తారో స్పష్టత కరవైంది.



కొందరేమో ఈ నెల 10 నుంచి కొనుగోలు చేస్తారని.. మరికొందరు స్పష్టత లేదంటున్నారని రైతులు పేర్కొంటున్నారు. యంత్రాంగం మరింతగా ప్రత్యేక దృష్టి సారిస్తేనే తమకు న్యాయం జరుగుతుందని మామిడి రైతులు అంటున్నారు.

**జోరందుకున్న బేనీషా వ్యాపారం**

చిత్తూరు మార్కెట్ యార్డులో మామిడి సీజన్ జోరందుకుంది. రోజుకు 200–25 టన్నుల కాయలు ఇక్కడి యార్డుకు వస్తున్నాయి. సీజన్ మొదట్లో బేనీషా తదితర టేబుల్ రకాల ధరలు ఆశాజనకంగా ఉండగా.. వారం తర్వాత తగ్గించేశారు. ప్రస్తుతం టేబుల్ రకాల ధరలు నిలకడగా ఉన్నాయని మండీ యజమానులు పేర్కొన్నారు. పెద్దమొత్తంలో బేనీషా కాయలు యార్డుకు వస్తున్నాయి. వీటిని రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాలకు ఎగుమతిదారులు కొనుగోలు చేస్తున్నారు. పక్వానికి వచ్చిన కాయలు యార్డుకు తెస్తే మంచి ధర లభిస్తుందని మండీల యజమానులు పేర్కొంటున్నారు.

# కుంకీల గస్తీకి మరింత సమయం

పలమనేరు : అటవీ ఏనుగులు విధ్వంసం సృష్టిస్తున్నాయి.. పంటలపై దాడులు చేస్తూ అపార నష్టాన్ని కలిగిస్తాయి. కొన్ని సార్లు రైతులు సైతం ప్రాణాలు కోల్పోతున్నారు. వీటి నివారణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ చూపారు. కర్ణాటకలో విజయవంతమైన కుంకీ ఏనుగులతో జిల్లాలో విచ్చలవిడిగా తిరుగుతున్న అటవీ ఏనుగులను నియంత్రించాలని తలచారు. అక్కడి పాలకులతో మాట్లాడి నాలుగు కుంకీలను రప్పించారు. అవి పూర్తిస్థాయిలో రంగంలోకి దిగకముందే ఏనుగుల దాడిలో మరో రైతు ప్రాణం వదిలారు. ఈ నేపథ్యంలో కుంకీలు ఎప్పుడు పనిలోకి వస్తాయనే అంశంపై చర్చ నడుస్తోంది.

కుంకీలకు పలమనేరు సమీపంలోని ముసలిమడుగు శిబిరంలో వసతి కల్పించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అటవీ, నైసర్గిక స్వరూపం, స్థానిక పరిస్థితులు అలవాటయ్యేలా వాటికి 30 రోజుల శిక్షణ అందిస్తున్నారు. దీని కోసం రామకుప్పం మండలం ననియాలలోని రెండు కుంకీలను ఇక్కడకు తెచ్చారు. ఈ నెల 20 వరకు శిక్షణ కొనసాగుతుందని డీఎఫ్‌వో భరణి తెలిపారు. కొత్తగా వచ్చిన వాటిల్లో మూడు కుంకీలు శిక్షణ పూర్తి చేసుకున్నాయని, మరొక దానికి కార్యక్రమం నడుస్తుందన్నారు.

**జీపీఎస్‌తో..**

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఏనుగులు వేర్వేరు గుంపులుగా సంచరిస్తూ దాడులకు పాల్పడుతున్నాయి. అవి ఎన్ని ఉన్నాయి? ఎక్కడి నుంచి వస్తున్నాయి? మకాం ఎక్కడ? అనే వివరాలు తెలుసుకునేందుకు జీపీఎస్ వినియోగించనున్నారు. డ్రోన్ల తో గుర్తించి వాటిని అటవీ నుంచి బయటకు రాకుండా కుంకీల కాపలా ఉంచేలా ప్రణాళికలు రచిస్తున్నారు.

ఆ తర్వాత ఒంటరి ఏనుగుల కదలికలు తెలుసుకుని వాటి నియంత్రణపై దృష్టి సారిస్తారు. కొత్తగా వచ్చిన నాలుగు కుంకీలకు శిక్షణ పూర్తి చేసిన తర్వాత ననియాల నుంచి వచ్చిన వాటిని అక్కడికే తరలిస్తారు.

**దాడులు జరిగే ప్రాంతాల గుర్తింపు**

ఏనుగులు నిత్యం మకాం మారుస్తూ అటవీ సమీపంలోని గ్రామాలు, పొలాలపై దాడులకు పాల్పడతాయి. ఓ చోట జరిగిన వెంటనే అక్కడికి కుంకీలను పంపలేరు. ఇవి అక్కడికి వెళ్లే లోపే అటవీ ఏనుగులు వాటి మకాం మరోచోటకు మార్చేస్తాయి. అందువల్ల ఓ నిర్దిష్టమైన విధానం రూపొందించనున్నారు. ఏడాది కాలంలో అధికంగా దాడులు జరిగిన ప్రాంతాలు, నష్టం విలువ, ప్రాణనష్టం తదితరాలు పరిశీలించి హాట్‌స్పాట్లు గుర్తిస్తారు. అనంతరం ఆయా ప్రాంతాలకు కుంకీలను అలవాటు చేస్తారు. ఇందు కోసం అటవీ అధికారులు, శిక్షకులతో ప్రత్యేక బృందాలను సైతం ఏర్పాటు చేయనున్నారు.

# కాసుల వేటలో ప్రజారోగ్యమే బలి!!




విశాఖపట్నం : మాంసం దుకాణాల వద్ద మిగిలిన వ్యర్థాల తరలింపున కు తీవ్ర పోటీ నెలకొంది. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులున్నా.. రాజకీయ జోక్యంతో కొందరు అనధికారికంగా వాహనాలు పెట్టి వ్యర్థాలను సేకరిస్తున్నారు. వీటిని కొన్ని జిల్లాల్లోని చేపల చెరువులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజారోగ్యంతో చెలగాటం అని తెలిసినా కాసులవేట ఆపడం లేదు. మరో వైపు.. జీవీఎంసీ నిర్దేశించిన డంపింగ్ యార్డుకు కోళ్ల మాంసపు వ్యర్థాలను తరలించడంలో విఫలమయ్యారంటూ ఇటీవల బాధ్యతలిచ్చిన గుత్తేదారుల గుత్తకాలం రద్దు చేస్తూ తాజాగా నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశమైంది. ‘బాణం’ ఎక్కుపెట్టింది వైకాపానే: కోళ్ల మాంస వ్యర్థాలను కొన్ని రకాల చేపలు పెంచే చెరువులకు నగరం నుంచి అనధికారికంగా తరలించడం వైకాపా హయాంలో మొదలైంది. ఓ కీలక వైకాపా నాయకుడు కనుసన్నల్లో నలుగురు ఈ మాంసం వ్యర్థాల తరలింపు చేసేవారు. పాలకవర్గం ఏర్పడిన తరువాత కోళ్ల వ్యర్థాలలో వస్తున్న లాభాలను చూసిన కొందరు కార్పొరేటర్లు బినామీలను రంగంలోకి దింపారు. వైకాపా హయాంలో కార్పొరేటర్ల కనుసన్నల్లో నడిచిన వ్యవహారం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యుల స్థాయికి వెళ్లింది. నియోజకవర్గ స్థాయి నేతలను ప్రసన్నం చేసుకోవడానికి టెండర్ల సమయంలో రూ.లక్షలు సమర్పించిన వారికే గుత్తలు అప్పటి కమిషనర్ ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. 8 జోన్ల పరిధిలో సుమారు ఆరుగురు గుత్తేదారులకు ప్రతి రోజూ దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించే బాధ్యతలిచ్చారు. వాహనాలకు జీపీఎస్ పెట్టాలని సూచించినా పట్టించుకోవడం లేదు. దీంతో డంపింగ్ యార్డుకు తక్కువ తరలించి, ఎక్కువ వాహనాలను రాత్రి వేళల్లో ఇతర జిల్లాలకు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఇప్పటికీ అదే సాగుతోంది.

**ఎందుకంత పోటీ అంటే..:** వ్యర్థాల తరలింపునకు టన్నుకు రూ.690 ఒక్కో దుకాణ నిర్వాహకుడి నుంచి వసూలు చేస్తారు. అందులో జీవీఎంసీకి రూ.400 చెల్లించి, మరో రూ.290 గుత్తేదారు తీసుకోవాలి. అయితే బహిరంగ మార్కెటలో కోళ్ల వ్యర్థాలకు చేపల చెరువుల నుంచి గిరాకీ ఉంది. నగరంలో సుమారు 3వేల దుకాణాల నుంచి 10వేల కిలోలపైగా వ్యర్థాలు వస్తాయి. వీటిని కిలో రూ.20కిపైగా చేపల చెరువులకు అమ్ముతూ ఏటా రూ.కోట్లల్లో ఆదాయం పొందుతున్నారు. ఎవరూ అడ్డు పడకుండా సొమ్ములు పంచేస్తున్నారు. **కుమ్ములాట:** ప్రస్తుత గుత్తేదారుల కంటే ఎక్కువ నిధులిస్తామంటూ కొంత మంది నాయకులను కలిసి టెండర్లు రద్దు చేయాలని పట్టుబట్టారు. కొందరు నేతల అనుచరగణమే ప్రత్యేకంగా వాహనాలు పెట్టుకుని కోళ్ల మాంసం వ్యర్థాలను కొన్ని వార్డుల్లో సేకరించి చేపల చెరువులకు తరలిస్తున్నారు. సేకరించిన వ్యర్థాల నిల్వలు కొన్ని రహస్య ప్రదేశాల్లో పెట్టి రాత్రి వేళల్లో దర్జాగా రవాణా చేస్తున్నారు. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులకు, అనధికారికంగా రెండు జోన్ల పరిధిలో తరలిస్తున్న కొందరికి మధ్య ఇటీవల గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో తమవారే కోళ్ల వ్యర్థాలు తరలిస్తారంటూ పోలీసు స్టేషన్‌కు ఓ జిల్లా నాయకుడు వెళ్లి అక్కడ హడావుడి చేయడం చర్చనీయాంశమైంది.

# రుయా.. గుండె భద్రం

తిరుపతి : రుయా ఆస్పత్రి పునరుజ్జీవం దిశగా అడుగులు పడుతున్నాయి. గతంలో సూపరింటెండెంట్ గుండెపోటుకు గురికాగా క్యాథ్‌ల్యాబ్ అందుబాటులో లేక హుటాహుటిన నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి ఆయన్ను తరలించాల్సి వచ్చింది. ఆపాటి భరోసా ఓ శ్రీవారి భక్తుడి గుండెపోటు మరణంతో పురుడుపోసుకున్న రుయా ఇవ్వలేకపోయింది. రోజూ వెయ్యిమంది వరకు రోగులు వచ్చే రుయాకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. యంత్రాలు, పరికరాలకు నిధులు మంజూరు చేసింది. రూ.70 కోట్లతో నిర్మాణంలో ఉన్న అత్యవసర విభాగంలో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటుచేసే అవకాశం ఉంది. అంతకంటే ముందు ఏర్పాటు చేయాల్సివస్తే అత్యవసర విభాగం లేదా ఏపీఎంఎస్ఐడీసీ నిర్మించిన నూతన భవనంలో ఏర్పాటు చేసే వీలుంది. క్యాథ్‌ల్యాబ్ అందుబాటులోకి వస్తే పేదరోగులకు ఉచితంగా



యాంజియోగ్రామ్, స్టంట్ల అమరిక వీలవుతుంది.

**ప్రస్తుత సేవలు ఇలా..** స్విమ్స్ నెలకొల్పాక ఇక్కడి వైద్యులు అక్కడికి వెళ్లిపోవడం.. ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడంతో గుండె విభాగం మూతపడింది. రోగులకు మెడిసిన్ విభాగమే దిక్కవుతోంది. ఇటీవల స్విమ్స్‌తో ఒప్పందం చేసుకుని అక్కడి క్యాథ్‌ల్యాబ్‌లో అతికొద్దిమందికి సేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రుయాకు క్యాథ్‌ల్యాబ్ మంజూరు చేసింది.

**ఒక్కరే వైద్యుడు..** రుయా గుండెవైద్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వారంలో మూడురోజుల ఓపీలు, నాలుగు జిల్లాల స్టెమీ ప్రోగ్రామ్ నిర్వహణకే ఆయన సమయం సరిపోతోంది. క్యాథ్‌ల్యాబ్ అందుబాటులోకి వస్తే విభాగాధిపతి, ఐదారుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్లు అవసరం. టెక్నీషియన్లు, సిబ్బంది నియామకంతోపాటు ఐసీయూ విభాగం.. ఎకో, ఈసీజీ పరికరాలు మరిన్ని సమకూర్చాల్సి ఉంటుంది.

# కళ్లెదుటే భవంతులు.. లేరట అనర్హులు!

శ్రీకాళహస్తి : పట్టణం రాజీవ్‌నగర్‌లో వైకాపా హయాంలో భారీగా అనర్హులకు ఇళ్ల పట్టాలు కట్టబెట్టారు. కొందరు ఎటువంటి దస్త్రాలు లేకుండానే గృహాలు నిర్మించుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎమ్మెల్యే ఈ అంశాన్ని అసెంబ్లీలోనూ ప్రస్తావించారు. ఎలాంటి అర్హత లేకుండానే వెయ్యి మందికిపైగా పట్టాలు పొందారు. అధికారుల సర్వేలో పదో వంతు కూడా అక్రమాలు తేలలేదు.

చిత్తూరు నగరంలోని తేనెబండ, మురకంబట్టులో పట్టాకు రూ.50వేలు- రూ.లక్ష తీసుకుని సుమారు 600 స్థలాలను వైకాపా కార్యకర్తలు అమ్మేసుకున్నారు. కొందరు వైకాపా నేతలు అందులో భవంతులు కూడా నిర్మించుకున్నారు. రెవెన్యూ యంత్రాంగం సర్వేలో నగరంలో 63 మంది అనర్హులకే పట్టాలు ఇచ్చారని నిర్ధారించారు. ప్రభుత్వం నుంచి ఉచితంగా ఇంటి పట్టా పొందడానికి పేదరికమే ప్రామాణికం. అంతకుముందు ఎప్పుడూ స్థలం తీసుకోకూడదన్నది మరో నిబంధన. వైకాపా హయాంలో వీటికి పాతరేశారు. అనర్హులకూ భారీగానే పట్టాలు పంపిణీ చేశారు. డబ్బులు తీసుకుని కొన్నిచోట్ల ఇవ్వగా వైకాపా మద్దతుదారులన్న ఏకైక కారణంతో మరికొందరికి స్థలాలు ఇచ్చారు. దాంతో అర్హులైన పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు పట్టా ఇవ్వాలంటూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అక్రమాలను నిగ్గు తేల్చడానికి సర్వే చేసినా తూతూమంత్రంగా ముగించడం విమర్శలకు తావిస్తోంది. వైకాపా హయాంలో 2020 డిసెంబరులో మహిళల పేరిట ఇంటి పట్టాలిచ్చారు. ఆ తర్వాత కూడా కొందరికి స్థలాలు పంపిణీ చేశారు. 2024 ఎన్నికలకు ముందు వరకు ఈ క్రతువు కొనసాగింది. చిత్తూరు జిల్లాలో గ్రామాలు, పట్టణాల్లో కలిపి 1.54 లక్షలు, తిరుపతి జిల్లాలో 1.70 లక్షల మందికి పట్టాలు ఇచ్చారు. తిరుపతి జిల్లాలో ప్రధానంగా శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాల్లో చిత్తూరు జిల్లాలో పలమనేరు, చిత్తూరు, నగరి నియోజకవర్గాల్లో



పట్టాలు పంపిణీలో అవకతవకలు జరిగాయి.

**నిబంధనలు అనుసరించకుండా 20 శాతం మందికి..**

రెండు జిల్లాల్లో ఇచ్చిన పట్టాల్లో దాదాపు 20 శాతం మంది అనర్హులపరమైనట్లు వైకాపా హయాంలోనే ఆరోపణలు వచ్చాయి. కార్యకర్తలు కొందరు రెండు- మూడు పట్టాలు కూడా తీసుకున్నారు. మరికొందరు పేదల నుంచి కారుచౌకగా కొని భవంతులు కట్టుకున్నారు. ఇలాంటి అక్రమాలను వెలికి తీయాలనే ఉద్దేశంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం సర్వేకు శ్రీకారం చుట్టింది. 15 రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసింది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), సర్వేయర్, వీఆర్వోలతో బృందాలు ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు వివరాలను యాప్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు.

**చిత్తూరులో 446.. తిరుపతిలో 960..**

ప్రస్తుతం ఈ సర్వే తుది దశకు చేరింది. చిత్తూరు జిల్లాలో 446, తిరుపతి జిల్లాలో 960 మంది మాత్రమే అనర్హులున్నట్లు రెవెన్యూ యంత్రాంగం తేల్చింది. లే ఔట్లలో కళ్ల ముందే భవంతులు కనిపిస్తున్నా.. అతి తక్కువ మందే అర్హత లేని వ్యక్తులున్నారని నిర్ధారించడం అనుమానాలకు తావిస్తోంది. తూతూమంత్రంగా క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేశారని స్పష్టంగా అర్థమవుతోంది.


# విశ్వంతో ప్రయాణం.. ప్రకృతికి ప్రణామం

శ్రీకాళహస్తి : అందమైన పర్యావరణాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది భావితరాలకు పదిలంగా అందించేందుకు శ్రీకారం చుట్టారా యువత. రోజురోజుకు జనాభా పెరుగుతుండటంతో అంతరించి పోతున్న చెట్లు, జీవరాశులను కాపాడేందుకు నిత్యం పరితపిస్తున్నారు. కొందరు యువకులు స్వచ్ఛందగా మొక్కలు పెంచేం దుకు శ్రమిస్తుండగా మనతో పాటు జీవరాశులు మనగడ సాగించేలా నిపుణులు పరిశోధనలతో వెలుగులోకి తీసుకొస్తుండటం గమనార్హం.

**ఊరూరా ఉద్యానంలా మార్చాలని**

కేశవులు, సేవ్ ఆక్సిజన్ సంస్థ వ్యవస్థాపకులు

వేగంగా జనాభా పెరుగుతుండటంతో నివాసాలు, రోడ్లు వంటి అభివృద్ధి పేరిట చెట్లు, అటవీ ప్రాంతాలు అంతరించి పోతున్నాయి. దీన్ని దృష్ట్యా



యువకులంతా కలిసి 2021లో సేవ్ ఆక్సిజన్ పేరుతో స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశాం. నాలుగేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో 10వేలు మొక్కలు పంపిణీ చేయడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా నాటి పెంచేంత వరకు బాధ్యతలు చేపడుతున్నాం. నూతనంగా ఊరూరా వాలంటీర్లను ఏర్పాటు చేసుకుని మొక్కల పెంపకం నిరంత ప్రక్రియగా కొనసాగించేలా చర్యలు చేపట్టాం.

**పక్షుల పరిరక్షణకు పరిశోధనలు**

ఏఎస్.హరీషా, ఐసర్ పక్షుల పరిశోధన విభాగం, సిటిజన్ సైన్స్ సమన్వయకర్తకాలుష్యం అధికమై గతంలో భూమిపై సందడి చేసే పక్షులు అంతరించే స్థితికి చేరాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని తిరుపతి ఐసర్‌లోని పక్షుల పరిశోధన విభాగం ఆధ్వర్యంలో పక్షులను రక్షించేందుకు చర్యలు చేపట్టా. ఇప్పటి వరకు 250 రకాల పక్షులు, వాటి జీవన విధానం, సంతతి పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరిశోధనలు జరుపుతున్నాం. గతంలో నేలపై సంచరించి ప్రస్తుతం కనుమరుగైన పక్షుల ఆనవాళ్లు కోసం అన్వేషిస్తున్నాం.

**పాములను కాపాడేందుకు పరిశోధన**

ప్రొఫెసర్ డా.నందిని, ఐసర్ వాతావరణంలో మార్పులు, జనాభా పెరుగుదల వంటి కారణాలతో పాములు అంతరించి పోతున్నాయి. వాటిని కాపాడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరిశోధనలు జరుపుతున్నాం. ఈ నేపథ్యంలో తిరుపతి ఐసర్ పరిసర ప్రాంతాల్లో ఇప్పటి వరకు 35 రకాల పాములు గుర్తించాం. వాటి జీవన విధానం, కాపాడుకునేందుకు జాగ్రత్తలపై భావితరాలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాం.

# పర్యావరణ హితులు.. భవితకు వారధులు



అనంతపురం : ప్రకృతిని విధ్వంసం చేస్తే.. మానవాళిపై కన్నెర్ర చేస్తుంది. ఎప్పటికైనా మనుగడకు ముప్పే.. ఎంత సంరక్షించుకుంటామో.. అంత మేలు చేస్తుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా భవితకు భరోసా ఇస్తుంది. అక్రమార్కులు జలవనరులను దోచుకుంటూ కనుమరుగు చేస్తున్నారు. మరోవైపు స్వార్థపరులు పచ్చదనంపై గొడ్డలి వేటు వేస్తూ పర్యావరణానికి హాని కలిగిస్తున్నారు. ఈనేపథ్యంలో కొందరు ప్రకృతి ప్రేమికులు పచ్చదనం పెంపునకు, పర్యావరణ పరిరక్షణకు శ్రమిస్తున్నారు. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్ఫూర్తిదాయక కథనాలు కొన్ని ఇలా..

**ప్రతి నెలా రూ.25 వేలు వ్యయం**

గుంతకల్లుకు చెందిన నగర ఉత్సవ సమితి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తోంది. ఇందుకోసం ప్రతి నెలా రూ.25 వేలు వ్యయం చేస్తోంది. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో 2015లో వివేకానందస్వామి పేరుతో ఉద్యానం ఏర్పాటు చేశారు. అందులో 70 రకాల మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి పెరిగి ఆహ్లాద వాతావరణం పంచుతున్నాయి. వ్యాయమంలో భాగంగా ఉదయం, సాయంత్రం స్థానికులు ఇక్కడ నడవడానికి వస్తున్నారు మరికొందరు హాయిగా సేదదీరుతున్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం బాధ్యతగా భావించామని నగర ఉత్సవ సమితి నాయకుడు ఇల్లూరు లక్ష్మీనారాయణ చెబుతున్నారు. ఇప్పటి వరకు ఉద్యానానికి రూ.60 లక్షలకుపైగా ఖర్చు చేసినట్లు చెప్పారు.

**పురపాలికకు పచ్చని తోరణం**

తాడిపత్రి పురపాలికలో పర్యావరణాన్ని కాపాడాలని పదేళ్ల కిందట అప్పటి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రతి ఇల్లు, దుకాణం ముందు మొక్క నాటి పెంచాలని నిబంధన పెట్టారు. ఈమేరకు పెద్దఎత్తున మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. సీబీరోడ్డు, యల్లనూరు రోడ్డు, పుట్లూరు రోడ్డులో పచ్చదనం హాయినిస్తుంది. ఆయా కాలనీల్లోనూ ఆహ్లాదం పంచుతున్నాయి.

**పరిరక్షణకు 'నిస్వార్థ' సేవ..**

ఉరవకొండకు చెందిన నిస్వార్థ ఫౌండేషన్ పర్యావరణ పరిరక్షణ నినాదంతో ముందుకు సాగుతోంది. గ్రామాల్లో ఇప్పటి వరకు 10వేల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. వివిధ ప్రవేశ పరీక్షలకు ఏటా ఉచిత శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు కచ్చితంగా మొక్కలు నాటి సంరక్షించాలన్న నిబంధన పెట్టారు. మొక్కను ఏడాది పాటు సంరక్షిస్తే రూ.500, ప్రశంసా పత్రం, రెండో ఏడాది సంరక్షిస్తే రూ.1000తో పాటు ప్రశంసా పత్రం, మూడో ఏడాది సంరక్షిస్తే రూ.1,500తో పాటు కలెక్టరుతో విద్యార్థులకు పర్యావరణ మిత్ర అవార్డులు ఇప్పిస్తున్నారు. ప్రజలను చైతన్యపరిచి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేయడమే ప్రధాన ఉద్దేశమని నిస్వార్థ ఫౌండేషన్ సమన్వయకర్త వెంకట పేర్కొన్నారు.

**ఇంటింటా చెట్టు.. ఊరంతా వనం**

హిందూపురం వాసి భాస్కర్‌రెడ్డి ఇంటింటా చెట్టు.. ఊరంతా వనం నినాదంతో ముందుకెళుతున్నారు. సొంత డబ్బు వెచ్చించి నియోజకవర్గవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రైవేట్రు స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. తన ఇంటిని నందనవనంగా మార్చారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

**వేలాది ఎకరాల్లో సంరక్షణ**

చెన్నేకొత్తపల్లి, రొద్దం, రామగిరి మండలాల్లోని కొండల్లో పచ్చదనం పెంపునకు టింబక్టు కలెక్టివ్ సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. అడవుల సంరక్షణతోపాటు కొండలు, బంజరు భూముల్లో మొక్కల పెంపకానికి వన సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేసింది. తర్వాత కమిటీలను కల్పవల్లి అటవీ సంరక్షణ సొసైటీలుగా మార్పు చేశారు. వేసవి సెలవుల్లో విద్యార్థులతో విత్తన బంతులు తయారు చేయించి... వర్షాలు ప్రారంభంకాగానే కొండవాలు ప్రాంతాలలో వేస్తుంటారు. మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. వేలాది ఎకరాల్లో పచ్చదనం పెంపొందడమేగాక ఎన్నో రకాల పక్షులు, జీవాలు ఆవాసం ఉంటున్నాయి.

**అధికారి.. హరిత నేస్తం**

కదిరి పట్టణం కుటాగుళ్లకు చెందిన రాయసం హరిప్రసాద్ అటవీశాఖలో బీట్ అధికారిగా పని చేస్తున్నారు. హరితనేస్తం పేరుతో పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టారు. కుమార్తె మేఘన పుట్టినరోజున చెట్లు, ట్రీగార్డులు ఉచితంగా అందించటాన్ని ప్రారంభించారు. అదే రోజు జన్మదినం జరుపుకొనే వారెవరైనా పేర్లు నమోదు చేసుకుంటే కోరిన మొక్కలు అందిస్తున్నారు. పాఠశాలలు, వీధుల్లో మొక్కలు పెంచేలా పోత్సహిస్తున్నారు. పచ్చదనం పెంపునకు కృషి చేస్తున్న వారికి హరితనేస్తం జ్ఞాపికలతో సత్కరించి ప్రోత్సహిస్తున్నారు.

**హరిత ఉద్యమంలో 'సమాజ క్రాంతి'**

కుందుర్పి మండలంలో సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు విలువల బడులు ప్రారంభించి విద్యార్థులతో హరిత ఉద్యమానికి నాంది పలికింది. ట్రస్టు అధ్యక్షుడు, గాయకుడు లెనిన్‌బాబు కుందుర్పిని హరిత మండలంగా మార్చే లక్ష్యంతో 'సదాస్మరామి- మొక్కల పండుగ' నిర్వహిస్తూ ఏడాదికి 10 వేల మొక్కలను నాటించి, సంరక్షిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 30వేల మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. మూడు లక్షల విత్తన బంతులు తయారుచేసి వర్షాకాలంలో అటవీ ప్రాంతాలు, కొండలు, గుట్టలు, రోడ్ల పక్కన వెదజల్లుతున్నారు. మొలకెత్తి మొక్కలుగా ఎదుగుతున్నాయి.

# హెచ్చెల్సీ మరమ్మతులపై నీలినీడలు



అనంతపురం : తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ(టీబీ హెచ్చెల్సీ) ఆధునికీకరణ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రస్తుత సంవత్సర నీటి సీజన్ మొదలైంది. రానున్న రెండు మాసాల్లో నీరు విడుదలయ్యే అవకాశం ఉంది. ఈలోపు నిర్దేశిత మరమ్మతు, ఆధునికీకరణ పనులు పూర్తి కావడం అసాధ్యంగా మారింది. ఇంజినీర్లు పనులను వేగంగా చేపట్టడానికి తంటాలు పడుతున్నా ఆశించిన మేర ముందుకు సాగడం లేదు. కనీసం 20 శాతం ప్రగతి కూడా లేదు. శిథిలావస్థలో ఉన్న ప్రధాన కాలువ మరమ్మతు, నిర్వహణకు గత వైకాపా ప్రభుత్వం పైసా ఇవ్వలేదు. దీంతో కాలువలో నీటి ప్రవాహం దినదినగండంలా కొనసాగింది. కూటమి ప్రభుత్వ ఏర్పడిన నెల రోజుల్లోనే హెచ్చెల్సీని పటిష్ఠం చేసేందుకు నిధులు మంజూరు చేసింది. టెండర్ల ఖరారు విషయంలోనూ వేగంగా నిర్ణయం తీసుకుంది. కాకపోతే.. గుత్తేదారులు పనులను ప్రారంభించడంలో జాప్యం చేశారు. ఈ ప్రభావం పనుల పురోగతిపై పడింది. జులై ఆఖరు నాటికి తుంగభద్ర జలాలను విడుదల చేసే అవకాశం ఉంది. ఈలోపు కనీసం 50 శాతం పనులైనా పూర్తి అవుతాయో లేదో అనుమానమే.

**11 పనులు.. రూ.33.89 కోట్లు**


ప్రధాన కాలువపై సత్వరమే చేయాల్సిన పదకొండు పనులను గుర్తించారు. అంచనాలు తయారు చేసి కూటమి ప్రభుత్వానికి నివేదించారు. ఆగమేఘాలపై రూ.33.89 కోట్లను విడుదల చేస్తూ ఈ ఏడాది మార్చి 18న ఉత్తర్వు వెలువడింది. ఈలోపు టెండర్లను ఆహ్వానించి ఇద్దరు గుత్తేదారులకు అప్పగించారు. కణేకల్లు చెరువు అవుట్ పాల్ రెగ్యులేటరీ, లైనింగ్ పనులు, అండర్ టన్నెల్ (యూటీ), పీఏబీఆర్, ఎమ్పీఆర్ ఓటీ రెగ్యులేటర్లు, ఐదు డబుల్ లైన్ రోడ్డు బ్రిడ్జి (డీఎల్ఆర్‌బీ) ఉన్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో పనులన్నీ మొదలయ్యాయి. పనుల్లో వేగం పెరిగినా ఆశించిన మేర పురోగతి లేదు.

**రెండింటిపై దృష్టి సారిస్తే..**

ప్రధాన కాలువపై 137.702 కి.మీ. వద్ద పాత యూటీ స్థానంలో కొత్తది నిర్మిస్తున్నారు. జులై మూడో వారం తర్వాత నీటి విడుదల చేసే నాటికి యూటీని పూర్తి చేయాలి. కనీసం కాలువ లోపల పూర్తి చేసేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు. ఇదే క్రమంలో కణేకల్లు చెరువు ఆఫ్‌టెక్ స్లూయిస్‌ను సిద్ధం చేయాల్సి ఉంది. ప్రధాన కాలువ నుంచి నీరు ఈ చెరవులోకి వెళ్లి... మళ్లీ కాలువకు ప్రవాహం కొనసాగుతుంది. ఈ రెండు పనులు పూర్తి చేస్తే ప్రవాహానికి ఆటంకం ఉండదు. వంతెనలకు సంబంధించి ఫిల్లర్లు వరకు నిర్మిస్తే.. పైకప్పు, ఇతరత్రా పనులు నీటి ప్రవాహం కొనసాగే సమయంలోనూ పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుంది. మరోవైపు.. కీలకమైన ఎస్ఈ, ఈఈల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేస్తే పనుల పురోగతిపై దృష్టి సారించేందుకు వీలుంటుంది.

# అప్పన్న ఆలయంలో.. వరుస ఉత్సవాలు

సింహాచలం : శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో వరుస ఉత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు స్వామివారి దర్శన వేళలు, ఆర్జిత సేవల్లో మార్పులు చేసినట్లు ఈవో వేంద్ర త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వివరాలిలా.. ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నమ్మాళ్వార్ తిరు నక్షత్రం పూజలు జరగనున్న నేపథ్యంలో రాత్రి 7గంటల తర్వాత భక్తులకు దర్శనాలు లభించవు. రాత్రి ఆరాధన టికెట్లు కూడా రద్దు చేశారు. 10వ తేదీన నృసింహ జయంతి సందర్భంగా ఉదయం 8గంటల నుంచి విశేష పూజలు, నృసింహ హెూమం జరుగుతాయి. సాయంత్రం 4గంటల నుంచి కృష్ణాపురం గోశాలలో నృసింహ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేపడతారు. ఈ కారణంగా ఆరోజు సాయంత్రం 5గంటల తర్వాత భక్తులకు స్వామివారి దర్శనం లభించదు. 11వ తేదీన జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా సింహాద్రినాథుడికి మూడో విడత చందన సమర్పణ జరుగుతుంది. ఈ సందర్భంగా విశేష పూజలు, ఆరాధనలు నిర్వహించాల్సి ఉన్నందున ఆ రోజు ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు ఈవో తెలియజేశారు.



# పరీక్షల పేరిట పైసాచికత్వం

కర్నూలు : ఆదోనికి చెందిన ఓ మహిళ నగరంలోని క్యాన్సర్ ఆసుపత్రిలో చేశారు. పరీక్షల పేరిట రూ.10 వేలు తీసుకున్నారని ఆరోగ్యశ్రీ ట్రస్టుకు ఫిర్యాదు చేశారు. ఆడిటింగ్‌లో ఈ విషయం వెలుగులోకి రావడంతో డబ్బులు వెనక్కి ఇచ్చారు. కిడ్నీలో రాళ్లు ఉన్నాయని బి.తాండ్రపాడుకు చెందిన ఓ వ్యక్తి నగరంలో పేరున్న ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేరారు. వైద్య ఖర్చుల పేరిట అదనంగా రూ.18 వేలు తీసుకున్నారని ఆయన ఆరోగ్యశ్రీ ట్రస్టుకు ఫిర్యాదు చేశారు. కల్లూరులోని నెట్‌వర్క్ ఆసుపత్రిలో విశ్రాంత ఉద్యోగి మోకాలికి శస్త్రచికిత్స చేయించుకొంటే అదనంగా రూ.40 వేలు తీసుకున్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల ధనదాహానికి పేదలు సమిధలు అవుతున్నారు. పరీక్షల పేరిట పీక్కుతింటున్నారు. బాధితులెవరైనా ఆందోళన చేస్తే ప్రాణాలకు ఖరీదు కడుతున్నారు. నెట్‌వర్క్ హాస్పిటళ్ల తీరుపై ఆరోగ్యశ్రీ ట్రస్టుకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కఠిన చర్యలు తీసుకోవాలని కర్నూలు కలెక్టర్ సమీక్షలో ఆదేశాలు జారీ చేశారు.

ఆరోగ్యశ్రీ సేవలు అందించే ఆసుపత్రులు కర్నూలు జిల్లాలో 58, నంద్యాలలో 38 వరకు ఉన్నాయి. ఆయా ఆసుపత్రుల్లో ఏటా 1.20 లక్షల మంది వైద్యసేవలు పొందుతున్నారు. బిల్లుల రూపంలో ప్రభుత్వం రూ.137 కోట్ల వరకు వెచ్చిస్తోంది. ఉచితంగా సేవలు అందుతాయన్న ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోగులు ఆయా ఆసుపత్రుల్లో చేరుతున్నారు. బాధితులు ఆసుపత్రికొచ్చిన వెంటనే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని చెబుతున్నారు. ఒక్కో బాధితుడి నుంచి రూ.10 వేల నుంచి రూ. 20 వేల వరకు ఖర్చు పెట్టిస్తున్నారు.

అత్యవసరం పేరిట భయపెట్టి..స్టంట్ అయితే రూ.50 వేల నుంచి రూ.లక్ష, కాళ్లు, చేతులు విరిగితే నాణ్యమైన కంపెనీ రాడ్ల పేరిట రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు తీసుకుంటున్నారు. తర్వాత ఆరోగ్యశ్రీ నుంచి నిధులు లాగేస్తున్నారు.

**వీటిని అడగొద్దు**

ఏ రోగానికి ఎంత బిల్లు వేస్తున్నారో తెలియడం లేదు. నిబంధనల ప్రకారం వైద్య పరీక్షల ధరలు బోర్డులపై రాసి ప్రదర్శించాలి. ఎక్కడా కనిపించడం లేదు.

రోగి డిశ్చార్జి అయినప్పుడు వారికి ఛార్జీలు, ఫాలోప్ మందులు ఇవ్వాలి. కొందరికి వారు చేయించుకునే వైద్యాన్ని బట్టి మూడు, ఆరు నెలల పాటు ఫాలోప్ మందులు ఇవ్వాలి. ఆసుపత్రిలో చేరిన వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెట్టాలి. కానీ ఇవేవీ సక్రమంగా జరగడం లేదు.

**పేరుకే వైద్యమిత్రలు**

వైద్యమిత్రలు ఉదయం 9 గంటలకు ఆసుపత్రికి రావాలి. 11 గంటలు దాటినా హాజరుకావడం లేదు. సాయంత్రం ఐదు గంటలకే వెళున్నారు. రాత్రివేళ అందుబాటులో ఉండటం లేదు. ఫోన్ చేస్తే సరిగ్గా స్పందించడం లేదు.వైద్యమిత్రలు కచ్చితంగా ప్రతి వార్డు తిరగాలి. డిశ్చార్జి అయినపుడు కచ్చితంగా అడగాలి. ఏదైనా బిల్లులు అదనంగా తీసుకుంటే వారి దృష్టికి తీసుకెళ్తే రోగులకు ఆ అదనపు మొత్తాలను ఇప్పించాలి.

అక్కడ వైద్య సేవలు అందుబాటులో లేకుంటే రోగులకు మంత్రణం చేసి రికార్డు చేయాలి. సర్వజన వైద్యశాలకు పంపించాలి.

**ఫిర్యాదు చేస్తే చర్యలు**

నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవలకు సంబంధించి సహాయకేంద్రం (హెల్ప్‌డెస్క్) ఉంటుంది. అదనంగా ఎవరైనా డబ్బులు ఇవ్వాలని డిమాండు చేస్తే అక్కడే ఉన్న వైద్యమిత్రకు ఫిర్యాదు చేయాలి. లేదంటే జిల్లా సమన్వయకర్త దృష్టికి తీసుకెళ్లొచ్చు. లేదంటే 104 నంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయొచ్చు. కలెక్టర్ ఆదేశాల మేరకు పలు ఆసుపత్రులపై విచారించి నివేదికను డీఎంహెచ్‌వోకు అందిస్తాం. డాక్టర్ భాస్కర్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త.

# మొక్కోటి ప్రతిన.. పుడమికి ఆలన

కర్నూలు : పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కల పాత్ర కీలకం..ఒక వృక్షం తన 50 ఏళ్ల జీవిత కాలంలో రూ.15.70 లక్షల విలువైన ప్రయోజనాలు చేకూరుస్తుంది.. రూ.5 లక్షల విలువైన వ్యర్థాలు గ్రహిస్తుంది.. రూ.20 వేల విలువైన ప్రొటీన్లను ఇస్తుంది. గాలిలో తేమ, మట్టి సంరక్షణలో రూ.3 లక్షల విలువైన పని చేస్తుంది.

**అటవీ శాఖ అధికారుల అంచనా.!!**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. అటవీ, సామాజిక వన విభాగం ఆధ్వర్యంలో నర్సరీల్లో మొక్కలు పెంచాలని నిర్ణయించారు. ఉపాధి హామీకి అనుసంధానం చేశారు. ఒక్కో నర్సరీలో 65 వేల మొక్కలు పెంచుతున్నారు. ఒక్కో మొక్కను పెంచేందుకు రూ.14-19 వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. తరువులు తగ్గాయి.. కరవులు దరి చేరాయి. ఏ ప్రాంతమైనా సుభిక్షంగా ఉండాలంటే ఆ ప్రాంతం మొత్తం భూ భాగంలో 33 శాతం అడవులు ఉండాలి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 19.9 శాతమే ఉన్నాయి.. 18 మండలాల్లో వనం ఆనవాళ్లే లేవు. అటవీ విస్తీర్ణ శాతం 2009లో 12.07 శాతం ఉండగా 2011 నాటికి 11.94 శాతానికి తగ్గింది. 2011-13 మధ్య స్థిరంగా ఉంది. 2015లో 11.67 శాతానికి చేరగా 0.27 శాతం తగ్గింది. 2015-17 మధ్య రాష్ట్రంలో చేపట్టిన అడవులు, మొక్కల పెంపక కార్యక్రమాలు సత్ఫలితాలు ఇవ్వడంతో కొంత వృద్ధి చెందింది. పచ్చదనం పెంపొందించాలి లేదంటే కర్నూలు జిల్లా ఎడారి కావడం ఖాయమని ఐదేళ్ల కిందట ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా హెచ్చరికలు జారీ చేసింది. గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా ఇవేవీ పట్టించుకోలేదు. **ఐదేళ్లలో రూ.26.68 కోట్లు మెక్కేశారు**

గత ఐదేళ్లలో రహదారులకు ఇరువైపులా కానుగ, వేప, నీలగిరి తదితర మొక్కలు నాటినట్లు దస్త్రాల్లో చూపారు. ఏటా ప్రతి రహదారి పక్కన 2 కి.మీ. పొడవునా మొక్కలు నాటుతున్నట్లు కుడివైపు 100, ఎడమ వైపు 100 చొప్పున కి.మీ.కు 200 మొక్కలు నాటుతున్నట్లు లెక్కలు రాసుకొన్నారు. వాటికి ఉపాధి హామీ కూలీలతో నీళ్లు పోయించి సంరక్షణ చర్యలు తీసుకున్నట్లు డ్వామా అధికారులు పేర్కొంటున్నారు. ఇందుకు గత ఐదేళ్లలో రూ.26.68 కోట్లు వెచ్చించారు. ఆ మొక్కలన్నీ పెరిగి పెద్దవై ఉంటే ఉమ్మడి జిల్లాలో పచ్చదనం వెల్లివిరిసేది.

**18 మండలాల్లో అడవే లేదు** నంద్యాల జిల్లాలో 29 మండలాల పరిధిలో 9,68,057 హెక్టార్ల విస్తీర్ణం ఉండగా.. అందులో 3,08,607 హెక్టార్లలో (32 శాతం) అడవులు ఉన్నాయి. 10 మండలాల్లో అటవీ విస్తీర్ణం సున్నాగా ఉంది. నంద్యాల, ఉయ్యాలవాడ, గోస్పాడు, శిరివెళ్ల, దొర్నిపాడు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్లలో అడవులు కానరావడం లేదు. కర్నూలు జిల్లా విస్తీర్ణం 7,97,740 హెక్టార్లు ఉండగా 25 మండలాల పరిధిలో కేవలం 32,032 హెక్టార్లలో (4 శాతం) అడవులు ఉండటం గమనార్హం. సి.బెళగల్, గూడూరు, కోడుమూరు, నందవరం, గోనెగండ్ల, మంత్రాలయం, చిప్పగిరి, మద్దికెర మండలాల్లో అటవీ విస్తీర్ణమే లేకపోవడం గమనార్హం.

# సెస్సు మిన్న రైతు బంధు సున్నా

ఆళ్లగడ్డ : 15 వ్యవసాయ మార్కెట్లు.. ఏటా రూ.60 కోట్ల ఆదాయం.. సెస్సు రూపంలో కోట్లు సమకూరుతున్నా అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలవడం లేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు రైతులకు ఎన్నో ప్రయోజనాలు అందాలి. వైకాపా ఆపేసిన 'రైతుబంధు' పథకాన్ని పునరుద్ధరించాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు. 2014లో తెదేపా ప్రభుత్వం రైతు బంధును అమలు చేసింది.. ప్రభుత్వ గోదాముల్లో ధాన్యాన్ని దాచుకున్న రైతుకు రూ.2 లక్షల వరకు మార్కెట్ కమిటీనే మొదటి ఆరు నెలలు ఆర్థిక సాయం అందించేది. ఆరునెలల పాటు ఎలాంటి వడ్డీ ఉండదు. తర్వాత 6 నుంచి 9 నెలల వరకు 12 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు క్వింటాకు నెలకు 60 పైసలు తీసుకునే వారు. 2019లో గత వైకాపా దీన్ని అటకెక్కించింది. రైతుబంధు నిలిచిపోవడంతో ప్రభుత్వ గోదాముల్లో రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు ముందుకు రాకపోవడంతో ఇవన్నీ ఖాళీగా మారాయి. ఇప్పటికీ ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాములు దాదాపుగా రైతులకు ఉపయోగపడని పరిస్థితి నెలకొంది.



ఆళ్లగడ్డ మార్కెట్ యార్డులో రూ.2.34 కోట్లు ఖర్చు చేసి 5 వేల మెట్రిక్ టన్నుల ప్రభుత్వ గోదామును ప్రైవేటు వ్యక్తులకు లీజుకిచ్చారు. వ్యవసాయమే ప్రధాన వనరుగా ఉన్న ఆళ్లగడ్డలో రైతుల కోసం 18 ఎకరాల విస్తీర్ణంలో కొత్త మార్కెట్ యార్డును నిర్మించారు. రైతుబంధు పథకం లేకపోవడంతో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేటు గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారు. దీన్ని రైతులు ఉపయోగించు కోవడం లేదు.

**ప్రైవేటు గోదాములతో భారం**

వ్యవసాయ మార్కెట్ గోదాముల్లో వంద బస్తాల నిల్వకు కేవలం రూ.200 చెల్లించాలి. ఏడాది పొడవునా నిల్వ ఉంచినా కేవలం రూ.2400 అవుతుంది. ఎన్ని నెలలు నిల్వ ఉంచితే అంతే అద్దె చెల్లించొచ్చు. అదే ప్రైవేటు గోదాములో 100 సంచులకు రూ.500 వసూలు చేస్తారు. ఏడాదికి రూ.6000 అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ప్రైవేటు గోదాముల్లో ధాన్యం నిల్వ ఉంచుకునే రైతుపై రెట్టింపు కంటే ఎక్కువ భారం పడుతోంది.

పి.నాగిరెడ్డిపల్లెకు చెందిన నరసింహులు రబీలో 12 ఎకరాల్లో వరి సాగు చేశారు. 400 సంచుల వడ్లను ప్రైవేటు గోదాములో నిల్వ ఉంచారు. ఇందుకు సంచికి రూ.5 చొప్పున నెలకు రూ.2వేలు అద్దె చెల్లిస్తున్నారు. బీమా కింద ఏడాదికి రూ.2400 చెల్లించారు. అదే ప్రభుత్వ గోదాములో కేవలం నెలకు రూ.800 మాత్రమే చెల్లిస్తే సరిపోయేది. ప్రభుత్వ గోదాములు అందుబాటులో లేకపోవడంతో ఆయనకు నెలకు రూ.1200 భారం పడింది.

ఆదాయంలో కేటాయింపులు ఇలా (శాతాల్లో)

పింఛన్లకు : 20

సెంట్రల్ మార్కెట్ ఫండ్‌కు: 25

ఉద్యోగుల జీతాలకు: 25


ప్రభుత్వ ఖాతాలోకి : 30 ఎవైతకు: 0

# మురుగుశుద్ధి.. లేదు చిత్తశుద్ధి

బొబ్బిలి : పట్టణాల్లో మురుగు సమస్యకు పరిష్కారంగా కేంద్రం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రత్యేక నిధులతో మురుగు శుద్ధి ప్లాంట్ల నిర్మాణాన్ని తలపెట్టింది. గత ప్రభుత్వ హయాంలో 2022లో నిధులు మంజూరు కాగా.. పనులు మాత్రం ముందుకు కదల్లేదు. బొబ్బిలిలో రూ.8 కోట్లతో ఆరు ప్లాంట్లు రాగా.. ఒక్కటీ పూర్తి కాలేదు. వీటిని పూర్తి చేసి, నిర్వహణలోకి తీసుకొస్తే మురుగు రహిత పట్టణంగా మారుతుంది.

**అయిదు మినీ.. ఒక భారీ ప్లాంటు**

బొబ్బిలిలో అయిదు చోట్ల మినీ, మరోచోట భారీ మురుగు శుద్ధి ప్లాంటు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. ఒక్కో మినీ ప్లాంటు ద్వారా 30 వేల లీటర్ల మురుగు శుద్ధి చేసే విధంగా టెండర్లు పిలిచారు. ఐటీఐ కాలనీ, పాతబొబ్బిలి, మల్లంపేట, తారకరామకాలనీ, గొల్లపల్లిలో వీటిని నిర్మించేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు రాగా.. టెండర్లు పిలిచి గుత్తేదారుకు అప్పగించారు. ఐటీఐ కాలనీ, పాతబొబ్బిలిలో పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన చోట్ల కానరావడం లేదు. కొన్నిచోట్ల స్థల



సమస్య ఉంది. దీనికితోడు బిల్లులు ఇవ్వకపోవడంతో గుత్తేదారులు పనులు నిలిపేసినట్లు తెలుస్తోంది.

**ఎక్కడికక్కడ నిల్వతో నరకం..** పట్టణంలో పక్కా కాలువ వ్యవస్థ లేదు. శివారు ప్రాంతాల్లో కచ్చాలే దిక్కు ఆ మురుగంతా ఎక్కడికక్కడే నిల్వ ఉంటోంది. ప్రధాన కాలువల నుంచి వచ్చే నీరు బయటకు పోవడం లేదు. వర్షం పడితే రహదారులపైకి రావడంతో ప్రజలు నరకం చూస్తున్నారు. ఇలాంటి చోట్ల శుద్ధి ప్లాంట్లు నిర్మించాలని భావించి, రోజుకు 3 లక్షల లీటర్ల మురుగు పారుతుందని అంచనా వేసి అప్పట్లో ప్రతిపాదించారు.

**ప్రత్యామ్నాయం చూడరే..**

పాకీవీధిలో సుమారు 3 లక్షల లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసే భారీ ప్లాంటును తలపెట్టారు. పురపాలక స్థలంలో పనులు ప్రారంభించారు. ఆ స్థలాన్ని ఇళ్ల పట్టాలకు కేటాయించాలని పారిశుద్ధ్య కార్మికులు పనులు అడ్డుకోవడంతో నిర్మాణం నిలిచిపోయింది. ప్రత్యామ్నాయంగా సుమారు ఎకరం స్థలాన్ని చూడాల్సి ఉన్నా.. అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

**ఇదీ పరిస్థితి**పట్టణంలో కాలువల పొడవు: 121.6 కి.మీ

ప్రధాన డ్రైన్లు: 11.03 కి.మీ బి మధ్య, చిన్న తరహా: 47 కి.మీ, 61 కి.మీ కచ్చా కాలువలు: 2.2 కి.మీ

పూర్తికి చర్యలుప్లాంట్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. రెండు చోట్ల పనులు ప్రారంభించాం. మిగిలినవి త్వరలోనే మొదలు పెడతాం. స్థలం సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

ఎల్.రామలక్ష్మి, పురపాలక కమిషనర్

# అధికారులకు ఇం'ధనం'




హిందూపురం : మున్సిపాలిటీలో పారిశుద్ధ్య, నీటి సరఫరా విభాగాల్లో పలు పనుల కోసం ఉపయోగించే వాహనాలకు అవసరమైన ఇంధనం కోసం ప్రతి నెలా రూ.లక్షలు ఖర్చు అవుతోంది. అయితే వాహనాలకు డీజిల్ పోయించే అధికారం పలువురు అధికారుల చేతిలో ఉండటంతో ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు డీజిల్ పోయిస్తూ అదనపు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. పారిశుద్ధ్య విభాగంలో ఇద్దరు, ఇంజినీరింగ్ విభాగంలో ఇద్దరు ఇలా అనేకమంది వాహనాల నిర్వహణ బాధ్యతను చూస్తున్నారు. సాధారణంగా వాహనానికి రోజుకు అవసరమైన ఇంధనాన్ని ఉదయం పూట పెట్రోల్ బంకు వద్ద అధికారుల పర్యవేక్షణలో ఒక్కసారి వేయిస్తారు. అయితే పారిశుద్ధ్య విభాగంలో కొన్ని ట్రాక్టర్లకు రోజుకు రెండుసార్లు డీజిల్ పోయిస్తున్నట్లు, వాహన డ్రైవర్ లేక నిలిచిపోయిన వాహనానికి సైతం ఇంధనం నింపినట్లు రికార్డుల్లో నమోదు చేసినట్లు సమాచారం. ఇలా చిన్న చిన్న అక్రమాలు చేస్తూ, ఒక్కరిద్దరు అధికారులు డీజిల్ బిల్లుల్లో చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**నెలకు రూ.10 లక్షలకు పైగానే..**

పట్టణంలో చెత్త తరలించేందుకు 9 ట్రాక్టర్లు, పెద్ద కాంపాక్టర్ ఒకటి, రెండు చిన్న కాంపాక్టర్లు, మురుగు కాలువలు శుభ్రం చేయడం, డ్రోజింగ్ పనుల కోసం రెండు బాబ్‌కార్ట్ వాహనాలు, ఒక పొక్లెయినర్, మూడు నీటి సరఫరా ట్యాంకర్లు ఉన్నాయి. వీటికి నెలకు ఇంధనం బిల్లు రూ.10 లక్షలకు పైగా వస్తోంది. పారిశుద్ధ్య విభాగంలోనే రూ.8 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారు.

**చెల్లింపు ఎలా..:** గత వైకాపా ప్రభుత్వ హయాంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) పేరుతో ఇంటింటా చెత్త సేకరణకు పట్టణానికి 24 ఆటోలను ఓ ఏజెన్సీ వారితో సరఫరా చేయించారు. వారే ఆటోల నిర్వహణ చూడాలి. వారికి ప్రభుత్వం చెత్త పన్ను కింద వసూలు చేసిన సొమ్మును చెల్లించాలి. గుత్తేదారు ఆటోల నిర్వహణను సక్రమంగా చేయకపోవడంతో మున్సిపల్ అధికారులే డీజిల్ పోయించారు. దీంతో పెట్రోలు బంకు యజమానికి రూ.2.7 లక్షలు చెల్లించాల్సి ఉంది. వారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా, ఎలా పరిష్కరించాలో తెలియక అధికారులు మిన్నకుండిపోయారు. **తగిన చర్యలు తీసుకొంటాం - శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్**డీజిల్ వేయించడంలో సిబ్బంది చిన్న చిన్న తప్పిదాలకు పాల్పడుతున్న ట్లు తెలుస్తోంది. ఎక్కువ మంది వాహనాల నిర్వహణ బాధ్యతలు చూడకుండా, డీజిల్ వేయించే బాధ్యత ఒక్కరికే ఇచ్చి, అక్రమాలకు చెక్ పెడతాం. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చి వెంటనే అమలు చేస్తాం.

# ఆధునికీకకరణ పనులపై నీలినీడలు



విశాఖపట్నం: ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో విశాఖ డివిజన్‌లో జరుగుతున్న రూ.వందల కోట్ల పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. బ్యాంకుల నుంచి తెచ్చిన రుణంతో వాటిని చేపట్టారు. పనులు ఆలస్యంగా సాగుతుండడంతో మరింత భారంగా మారనున్నాయి. ఆ శాఖలో డిప్యుటేషన్ కింద విధులు నిర్వహిస్తున్న ఈఈ రమణ, డీఈ స్వామిని సింహాచలంలో గోడ కూలిన ఘటనలో బాధ్యులను చేస్తూ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. దీంతో ఆ శాఖలో పనిచేసేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. వెంటనే టూరిజం ఇంజినీరింగ్ విభాగాన్ని బలోపేతం చేయకపోతే కీలక ప్రాజెక్టులు ఆగిపోయి పర్యాటకం మీద తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

**చివరి దశలో హరితా రిసార్టు:** అప్పుఘర్‌లో హరితా యాత్రి నివాస్ రిసార్టు పనులు చివరి దశలో ఉన్నాయి. సకాలంలో దాన్ని నిర్మించకపోవడంతో విశాఖ డివిజన్ భారీగా ఆదాయం కోల్పోతోంది. గత ప్రభుత్వ హయాంలో ఈ హొటల్ నవీకరణకు రూ.8.60 కోట్లతో టెండర్లు పిలిచారు. తరువాత అంచనా విలువను ఏకంగా రూ.13 కోట్లకు పెంచడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. కేవలం నవీకరణ పేరుతో భారీగా అంచనాలు పెంచడంపై విమర్శలు వచ్చాయి. అయినా గుత్తేదారు సకాలంలో పనులు పూర్తిచేయలేదు. ఇంకా సాగుతున్నాయి.

**'ప్రసాద్' పనులకు గండి:** సింహాచలం దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం వసతుల కల్పనకు కేంద్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో రూ.54 కోట్లతో ప్రసాద్ పథకం పనులు జరుగుతున్నాయి. గత ఏడాదికే పూర్తి చేయాల్సి ఉన్నా అధికారుల మధ్య సమన్వయలోపం ఇతర కారణాల వల్ల ఆలస్యమయ్యాయి. కొన్ని పనులు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. దృష్టిసారించక పోతే ఆగిపోయే పరిస్థితి వస్తుంది.

**అరకు.. అనంతగిరిలో:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఏపీటీడీసీకి చెందిన అన్ని రిసార్టుల్లోనూ ఒకేసారి అభివృద్ధి పనులు సాగుతున్నాయి. అరకు వ్యాలీ రిసార్టు, మయూరి హొటల్, అనంతగిరి హరితా రిసార్టు పనులు మధ్యలో ఉన్నాయి. టైడాలోని జంగిల్‌బెల్ రిసార్టు పనులు కొద్ది రోజుల కిందటే ప్రారంభమయ్యాయి. దీంతో పర్యాటకుల డిమాండుకు అనుగుణంగా అధికారులు గదులు కేటాయించలేకపోతు న్నారు. మయూరి, అరకు, అనంతగిరి పనులు నత్తనడక జరుగుతున్నాయి.

# ఎన్టీఆర్ సుజల పథకం అటకెక్కించారు..?



చిత్తూరు : ఐరాల మండలం కేంద్రంలో పంచాయతీ నిధులు రూ.4 లక్షలు జడ్పీ నిధులతో 2017లో ఎన్టీఆర్ సుజల పథకం కింద శుద్ధం జలం ప్రజలకు అందించేందుకు కేంద్రం ఏర్పాటు చేశారు. రెండేళ్లు బాగా నడిచింది. ఇక్కడి నుంచి 30 గ్రామాల ప్రజలు తాగునీరు తీసుకెళ్లేవారు. ప్రస్తుతం అది మూతపడటంతో ఇతర ప్రాంతాలకు అష్టకష్టాలు పడి క్యాన్లలో తెచ్చుకోవాల్సిన దుస్థితి. రాష్ట్రంలో వైకాపా పాలన వచ్చాక దీన్ని మూసేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది.పుత్తూరు మండలం వేపగుంట నాటి జడ్పీ ఛైర్మన్ గీర్వాణీ సొంత గ్రామం కావడంతో జడ్పీ నిధులతో అక్కడ శుద్ధ జల కేంద్రం ఏర్పాటు చేశారు. తెదేపా హయాంలో ఐదేళ్లు ఆ పంచాయతీనే కాక సమీప గ్రామాల ప్రజలు అక్కడి నుంచి నీరు తీసుకెళ్లేవారు. వైకాపా అధికారంలోకి వచ్చాక కేంద్రం ఆలనా పాలనా పట్టించుకోకపోవడంతో మూలకు చేరింది.

ప్రజలకు శుద్ధ జలం అందించాలని సీఎం చంద్రబాబు 2014-19 అధికారంలో ఉన్న సమయంలో పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రవాస భారతీయులు ముందుకు వచ్చి ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు ప్రభుత్వ సహకారం ఉంటుందని చెప్పారు. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మండలాలు, పంచాయతీ కేంద్రాల్లో పలువురు దాతలు ముందుకు వచ్చి శుద్ధ జల కేంద్రాలు ఏర్పాటు చేశారు. మరికొన్ని జడ్పీ నిధులతో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలు ఐదేళ్లు బాగా నడిచాయి. రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి వచ్చాక వాటికి గ్రహణం పట్టుకుంది. సరైన ఆదరణ లేక మూతపడ్డాయి. దీంతో ఆ ప్రాంతాల్లోని ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి.

**కుప్పంలో పూర్తిగా నిరాదరణ..**

కుప్పం నియోజకవర్గంలో రూ.25 కోట్లతో 16 చోట్ల బోర్లు వేసి మదర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి పైపులైన్లతో ట్యాంకులకు శుద్ధ జలాలు సరఫరా చేసి ఐదేళ్లు 202 గ్రామాలకు అందించారు. వైకాపా అధికారంలోకి వచ్చాక పేరు మార్చి తాగునీటిని అందించేందుకు పంచాయతీల నుంచి రూ.18 లక్షలు ప్రచారానికి ఖర్చు చేసి ఆపై గాలికొదిలేశారు. దీంతో ఈ పథకం నీరుగారిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక 50 గ్రామాలకు పునరుద్ధరించారు. మిగిలిన గ్రామాలకు శుద్ధ జలం అందించేందుకు రూ.10 కోట్లు అవసరమని అధికారులు లెక్కలు వేశారు. నిధులు మంజూరైతే వాటిని పూర్తి చేసి నీటిని అందించనున్నారు.

**కూటమి ప్రభుత్వం పైనే ఆశలు..**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. ఈ నేపథ్యంలో నిరాదరణకు గురైన ఎన్టీఆర్ శుద్ధ జల ప్లాంట్లను బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కేంద్రాలు మూత వేయడంతో యంత్రాలు పూర్తిగా మరమ్మతుకు గురయ్యాయి. వాటిని బాగుచేసి భవనాలను శుభ్రం చేసి రంగులు వేసి ప్రారంభిస్తే ప్రజలకు అందుబాటులోనే శుద్ధ జలాలు అందించవచ్చు. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

# పేదల గూటికి.. పెద్దల నోటికి..!

విజయనగరం : నాలుగేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలో వైకాపా నాయకులు పేదలకు పక్కా ఇళ్లు పేరిట రూ.కోట్లు దోచేశారు. విజయనగరం జిల్లాలోని 27 మండలాల్లో 812 లేఅవుట్లు, పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో 583 లేఅవుట్లు వేశారు. చాలా చోట్ల ప్రైవేట్ భూములు కొనుగోలు చేశారు. వాటి విలువ పెంచి వైకాపా పెద్దలు, అధికారులు కలిసి రూ.కోట్లు మింగేశారు.

**ఒప్పించి.. నొక్కేసి**

డి-పట్టా భూములు పట్టాదారుల అనుభవంలో లేకుంటే పీవోటీ చట్టం కింద వెనక్కి తీసుకునే అధికారం ఉన్నా అలా చేయలేదు. గూడుపుఠాణికి స్కెచ్ వేసి ఎక్కడెక్కడో ఉన్న వాటి పట్టాదారులు, అనుభవంలో ఉన్న యజమానులను గుర్తించారు. ప్రభుత్వం ఆ భూములు వెనక్కి తీసుకుంటే పైసా రాదని, వాటి విలువ పెంచి అధిక నష్టపరిహారం వచ్చేలా చేస్తామని ఒప్పందం చేసుకున్నారు. ఆ మేరకు భూమి విలువలో 10 నుంచి 50 శాతం నొక్కేశారు. విజయనగరం గ్రామీణ మండలం కొండకరకం లేఅవుట్‌కు సంబంధించి చక్రం తిప్పిన వైకాపా నాయకులు సుమారు రూ.రెండున్నర కోట్లకు పైగా దోచేశారు. గుంకలాం లేఅవుట్‌కు కొనుగోలు చేసిన భూముల్లోనూ రూ.50 కోట్లకు పైగా వైకాపా పెద్దలు దోచుకున్నట్లు విజిలెన్స్ విచారణలో తేలినట్లు తెలిసింది.

**పాలకొండలో రూ.5.91 కోట్లు స్వాహా**

పాలకొండలోని గరుగుబిల్లి గ్రామం వద్ద వేసిన లేఅవుట్ కోసం 24.65 ఎకరాలు సేకరించారు. అప్పటి మార్కెట్ విలువ ఎకరా రూ.4.50 లక్షలు ఉంది. నిబంధనల ప్రకారం రూ.11 లక్షలు చెల్లించాల్సి ఉ



ండగా రూ.35 లక్షలు ఇచ్చారు. ఎకరానికి అదనంగా రూ.24 లక్షలు చెల్లించి రూ.5.91 కోట్లు మింగేశారు. అప్పటి జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీలోని అధికారులకు కాసులు ఎర వేసి నొక్కేశారు. ఉభయ జిల్లాల్లోని లేఅవుట్లకు కొనుగోలు చేసిన భూముల వ్యవహారంలో దర్యాప్తు పూర్తయిందని విజిలెన్స్ అధికారులు తెలిపారు. బొబ్బిలిలోని రామన్నదొరవలస వద్ద ఎకరా రూ.34 లక్షల చొప్పున 13.21 ఎకరాలు కొన్నారు. పరిహారం చెల్లింపులో అక్రమాలు జరిగాయని, తమకు పూర్తిగా దక్కకుండా వైకాపా నాయకుడు ఒకరు మధ్యవర్తిత్వంతో మోసం చేశారని భూయజమానులు లోకాయుక్తను ఆశ్రయించారు. దీనిపై సీఐడీ అధికారులు రెవెన్యూ అధికారిని కలిసి సంబంధిత దస్త్రాలు తీసుకెళ్లారు. ఎన్ని ఎకరాలు కొనుగోలు చేశారు.. ఎంత చెల్లించారో ఆరా తీశారు. పరిహారం చెల్లింపునకు జాతీయ బ్యాంకుల్లో ఖాతాలు తెరవకుండా నిబంధనలకు విరుద్ధంగా సహకార బ్యాంకులో తెరిచి పరిహారం జమ చేశారు. ఆ తర్వాత విజిలెన్సు అధికారులు దర్యాప్తు చేపట్టారు. వైకాపా నాయకులతో గతంలో పనిచేసిన తహసీల్దారు, ఇతర సిబ్బంది కుమ్మక్కై భూములకు ఎక్కువ ధర చూపి కాజేశారని గుర్తించారు.

# ఇక పారిశ్రామిక వెలుగులు

విజయనగరం : ఆసక్తి ఉన్నా ఉపాధి అవకాశాలు అందుకోలేని గ్రామీణ యువతను ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రతి నియోజకవర్గాన్ని పారిశ్రామికవాడగా తీర్చిదిద్దనుంది. ముందుగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) నెలకొల్పుతోంది. ఇందుకు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నుంచి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పరిశ్రమల స్థాపనకు పెట్టుబడులతో ఔత్సాహికులను ఆహ్వానిస్తోంది. తద్వారా వేలాది మందికి ఉపాధి కల్పించేలా ప్రణాళికలు అమలు చేస్తోంది.

**భాగస్వామ్యానికి పిలుపు**

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ప్రతి నియోజకవర్గంలో గుర్తించిన భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణం ఈ వారంలో ప్రారంభించనున్నారు. తొలుత 11 నియోజకవర్గాలకు విజయనగరం జిల్లాలోని నాలుగు, మన్యం జిల్లాలో ఒక చోట వర్చువల్‌గా



ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మకూరు నుంచి శంకుస్థాపన చేశారు. వాటి ప్రాజెక్టు వ్యయంపై అంచనాలు రూపొందించామని ఏపీఐఐసీ జోనల్ మేనేజరు మురళీమోహనరావు తెలిపారు. ప్రభుత్వ ఆమోదంతో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. మరికొన్ని చోట్ల అంచనా వ్యయంతో నివేదికలు ప్రభుత్వానికి పంపిస్తామని పేర్కొన్నారు.

**ప్లగ్ అండ్ ప్లే విధానం**

పార్కుల్లో ప్లగ్ అండ్ ప్లే విధానం అమలు.

గ్రామీణ ప్రాంతాల్లో 20 ఎకరాలకు తక్కువ లేకుండా పార్కు ఏర్పాటు

పట్టణ ప్రాంతాల్లో తక్కువ విస్తీర్ణంలోనే ఎక్కువ పరిశ్రమలు నెలకొల్పేలా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల (ఎఫ్ఎఫ్‌సీ) నిర్మాణం

షెడ్లు నిర్మించి, విద్యుత్తు, నీటి వసతి వంటి మౌలిక వసతుల కల్పన.

ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ప్రభుత్వమే దిశా నిర్దేశం.ఆసక్తి ఉన్న వారెవరైనా నేరుగా పరిశ్రమలు నెలకొల్పే వెసులుబాటు.రైతులు తమ భూముల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసుకునే అవకాశం.

# ఇక రయ్..రయ్

బనగానపల్లి: బనగానపల్లి- ప్యాపిలి మార్గం రెండు వరుసలుగా మారనుంది.. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో 52 కి.మీ. మేర విస్తరించనున్నారు. ప్యాపిలి నుంచి జలదుర్గం, పసుపుల మీదుగా బనగానపల్లి వరకు దీన్ని నిర్మించేందుకు డ్రోన్ సర్వే చేపట్టనున్నారు. అందుకు సంబంధించిన మ్యాప్‌ను సిద్ధం చేశారు. ప్రస్తుతం ఈ మార్గం ఒకే వరుసగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బనగానపల్లి నుంచి ప్యాపిలికి ఆర్టీసీ బస్సుల్లో వెళ్తే రెండు గంటలవుతోంది. ఆర్డీనరీ బస్సులే ఉండటం, రహదారి బాగోలేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బనగానపల్లి నుంచి గార్లదిన్నె వరకు సిమెంట్ లారీల రాకపోకలు ఎక్కువగా ఉండటం, ఇరుకుదారి కావడంతో దద్దణాల చెరువు సమీపంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. బనగానపల్లి- ప్యాపిలి మార్గంలో 20 వరకు గ్రామాలుండగా, యాగంటిపల్లె, పాతపాడు, చిన్నరాజుపాలెం, పసుపుల, జలదుర్గం ప్రధానమైనవి. సిగరమాన్ మెట్ట నుంచి వాహనాలు ఓ వైపు ప్యాపిలి, మరో వైపు డోన్‌కు వెళ్తాయి.

చురకలు



# విశాల గగనం.. మార్చాలి గమనం

విశాఖపట్నం: రాష్ట్రంలో పారిశ్రామిక హబ్‌గా, ఐటీ రాజధానిగా ఎదుగుతున్న విశాఖలో విమానయానానికి ప్రాధాన్యం పెరుగుతోంది. నగర పరిసరాల్లో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నారు. మరోవైపు ఇక్కడి నుంచి క్రమంగా విమాన సర్వీసులు తగ్గిపోతుండగా.. ఇప్పటికీ అంతర్జాతీయ కార్గో ప్రారంభించలేదు. విశాఖ నుంచి వాయు మార్గంలో వివిధ నగరాలకు రాకపోకలు పెరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిసారించాలని పారిశ్రామికవేత్తలు, ఏపీ విమాన ప్రయాణికుల సంఘం (ఏపీటీపీఏ) ప్రతినిధులు కోరుతున్నారు.

**నిలిచిన సర్వీసులు:** కొవిడ్ తర్వాత విశాఖ నుంచి గోవా, పుణె, కోయంబత్తూరు, ముంబయి, భువనేశ్వర్, కొలంబో, దుబాయి తదితర నగరాలకు రాకపోకలు సాగించిన 10 విమాన సర్వీసులు ఒక్కొక్కటిగా నిలిచిపోయాయి. రొయ్య పిల్లలను సూరత్‌కు ఎగుమతి చేసే ప్రత్యేక కార్గో విమానం ఎప్పుడో రద్దు చేశారు. విజయవాడకు ఉదయం వేళల్లో రాకపోకలు సాగించే రెండు సర్వీసులు ఏప్రిల్‌లో నిలిచిపోయాయి. అన్ని వర్గాల నుంచి విజ్ఞప్తులు రావడంతో జూన్ 1 నుంచి ఒక సర్వీసును పునరుద్ధరించనున్నారు. ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు చొరవతో జూన్ నుంచి విశాఖ-భువనేశ్వర్ మధ్య విమాన



సర్వీసు ప్రారంభం కానున్నట్లు తాజాగా ప్రకటించారు.

**ఉడాన్ కార్గోతో ప్రయోజనం**

అచ్యుతాపురం, పరవాడ, శ్రీకాకుళంలోని వందలాది ఫార్మా కంపెనీలు, విశాఖలోని మెడ్‌టెక్ జోన్, వీసెజ్ నుంచి దేశ, విదేశాలకు ఉత్పత్తులు ఇతర విమానాశ్రయాల నుంచి ఎగుమతి చేస్తున్నారు. విశాఖ నుంచే ప్రపంచంలోని వివిధ ప్రాంతాలను అనుసంధానం చేసేలా ప్రత్యేక కార్గో విమానం నడపాలని పారిశ్రామికవేత్తలు డిమాండ్ చేస్తున్నారు. విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి విమానాశ్రయాలను కలుపుతూ.. ఉడాన్ కార్గో విమానాన్ని ప్రారంభిస్తే ప్రయోజనం చేకూరుతుంది.ప్రతిపాదనలు పంపితే: కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ఎయిర్‌కార్గో నిర్వహణకు వేర్ హౌసింగ్, మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదించింది. రాష్ట్రంలోని అన్ని విమానాశ్రయాల్లో మల్టీటెంపరేచర్ కార్గో సౌకర్యాలు ఏర్పాటుచేయాలని ఏపీటీపీఏ ప్రతినిధులు మార్చిలో విశాఖ వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పంపితే.. పరిశీలిస్తామని ఆమె బదులిచ్చారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలని పారిశ్రామికవేత్తలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**నిర్మాణాలు పూర్తయితే మేలు..**

విశాఖ నుంచి విజయనగరం, శ్రీకాకుళం మధ్య వాహన రాకపోకలు పెరుగుతున్నాయి. ఇక్కడి నుంచి భోగాపురం విమానాశ్రయాన్ని అనుసంధానం చేయడానికి 12 వైజంక్షన్లు, కోస్టల్ కారిడార్, మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మించాలని గతంలో ప్రతిపాదించారు. కొత్త విమానాశ్రయం పూర్తయ్యేలోగా ఈ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి.
- ఏపీ విమాన ప్రయాణికుల సంఘం

# శవ 'పరీక్ష'

కర్నూలు : సర్వజన ఆసుపత్రి మార్చురీలో మృతదేహాలు కుళ్లిపోతున్నాయి. వాటిని బాధిత కుటుంబీకులు ఇళ్లకు తీసుకెళ్లి దహన సంస్కారాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. కర్నూలు సర్వజన ఆసుపత్రి, వైద్య కళాశాల అనుబంధంగా ఉన్న మార్చురీలో 18 అరలతో కూడిన ఫ్రీజర్ ఉంది. గుర్తు తెలియని, ప్రమాదాల్లో చనిపోయిన వ్యక్తుల మృతదేహాలను వాటిలో భద్రపరుస్తారు. ఏటా 1,500 నుంచి 1700 వరకు మృతదేహాలను ఫ్రీజర్లలో ఉంచుతారు. అవి పనిచేయకపోవడంతో కుళ్లిన తర్వాత పోస్టుమార్టం ప్రక్రియను నిర్వహిస్తున్నారు.

**సిబ్బంది లేక ఇబ్బంది**

మార్చురీలో రెగ్యులర్ ఉద్యోగులు లేరు. ఉన్న ముగ్గురూ బాధిత కుటుంబాలు ఏమైనా డబ్బులిస్తే వాటితోనే కాలాన్ని వెళ్లదీస్తున్నారు. వైద్య విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి మార్చురీ గది వద్దకు తీసుకెళ్తే వారంతా దుర్వాసన భరించలేక అస్వస్థతకు గురవుతున్నారు. నంద్యాలలోని కొత్త వైద్య కళాశాలకు చెందిన మార్చురీలో ఏనిమిది మందిని నియమించారు. కానీ కర్నూలు



వైద్యకళాశాలలో అవసరమైన మేర సిబ్బంది లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయించాల్సిన పరిస్థితి నెలకొంది.సర్వజన వైద్యశాలలోని మార్చురీలో 16 వరకు మృతదేహాలను ఉంచే వీలుంది. వాటిని కాపలాకాసేందుకు రాత్రి కాపలాదారులతో పాటు వార్డ్‌బాయ్స్ కనీసం ముగ్గురుండాలి. అన్ని ఖర్చులను సర్వజన వైద్యశాల, వైద్య కళాశాల నిర్వహించాలి. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు.

శవపరీక్షకు కావాల్సిన సదుపాయాలు సమకూర్చడం లేదు. పరీక్షలు చేసిన తర్వాత మృతదేహాన్ని ఉంచడానికి క్లాత్ ఇవ్వాలి. దీని నిర్వహణకు ఎలక్ట్రీషియన్ ఉండాలి. దీంతో పాటు వైద్యవిద్యార్థులకు మృతదేహాలను చూపించి పాఠాలు బోధించాలి. ఇవన్నీ సక్రమంగా జరగడం లేదని విమర్శలు రేగుతున్నాయి.**కొత్తవాటికి ప్రతిపాదనలు** ఫ్రీజర్లకు మరమ్మతులు చేసే సిబ్బంది స్థానికంగా ఎవరూ లేరు. హైదరాబాద్ నుంచి రావాలి. కొత్తవాటికి ప్రతిపాదనలు పంపించాం. పాడైన వాటిని బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. సిబ్బంది కేటాయింపుపై కలెక్టర్ దృష్టి తీసుకెళ్లాం.
చిట్టి నరసమ్మ, ప్రిన్సిపల్, వైద్యకళాశాల

# కాస్త కరుణిస్తే.. కష్టాలు తీరినట్టే!



అనంతపురం : వైకాపా హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వంలో గాడిలో పెడుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా హంద్రీనీవాకు రూ.3,243 కోట్లు కేటాయించింది. పనులు సైతం మొదలుపెట్టారు. దీంతోపాటు 5ఏళ్లపాటు నిర్వహణ కరవై బలహీనంగా మారిన హెచ్చెల్సీని పునరుద్ధరించే పనులను క్షేత్రస్థాయిలో వేగంగా చేపడుతున్నారు. మడకశిర బైపాస్ కెనాల్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. ఏడాది గడవకముందే సాగునీటి పథకాల పనులు మొదలుకావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు పెండింగ్‌లో ఉన్న ఇంకొన్ని పథకాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు. సీఎం చంద్రబాబు హంద్రీనీవా పరిశీలనకు ఉరవకొండలో పర్యటించనున్న నేపథ్యంలో కాస్త కరుణిస్తే కష్టాలు తీరుతాయని రైతులు విన్నవిస్తున్నారు.

**ఆయకట్టుకు నీరందించాలి**

హంద్రీనీవా ప్రధాన కాలువను విస్తరిస్తున్న నేపథ్యంలో ఉపకాలువలు, డిస్ట్రిబ్యూటరీలు కీలకంగా మారాయి. 2019, నాటికే 90 శాతం వరకు పూర్తయ్యాయి. వంతెనలు, కల్వర్టులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉపకాలువలు పూర్తిచేస్తే గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాల్లోని చెరువులకు నీరందించవచ్చు. తద్వారా 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి పథకాల పునరుద్ధరణ

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 1600 గ్రామాలకు తాగునీరు అందిస్తున్న శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల నిర్వహణ భారంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.30 కోట్లు విడుదల చేయడంతో ఇప్పుడిప్పుడే మరమ్మతులు మొదలుపెట్టారు. రెండు పథకాల్లోని గుత్తేదారులు తమ స్వార్థంతో కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రెండు పథకాలను పూర్తిస్థాయిలో భాగు చేయాలంటే మరో రూ.42 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. నిధులు మంజూరు చేసి బాధ్యతలను ఏదైనా సంస్థకు అప్పగిస్తే పరిస్థితిలో మార్పు వస్తుందని గ్రామీణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**మిరపకు కోల్డ్‌స్టోరేజీలు..**

ఉరవకొండ, గుంతకల్లు ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో మిరప సాగు చేస్తున్నారు. స్థానికంగా నిల్వ సౌకర్యం లేక కర్ణాటకలోని గోదాముల్లో ఉంచుతున్నారు. 8 వేల టన్నుల సామర్థ్యంతో కోల్డ్‌స్టోరేజీలు నిర్మించాలనే ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తే రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుందనే అభిప్రాయం వినిపిస్తోంది.

**పేరూరు, భైరవానితిప్ప..**

హంద్రీనీవాను ఆధారంగా చేసుకుని 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం జీడిపల్లి–పేరూరు, జీడిపల్లి–భైరవానితిప్ప ప్రాజెక్టులను మొదలుపెట్టింది. పేరూరు పథకంలో దాదాపు కాలువ పనులు పూర్తి చేశారు. భైరవానితిప్ప పథకంలో పంపుహౌసుల నిర్మాణానికి సామగ్రి కొనుగోలు చేశారు. వైకాపా పాలనలో నిర్లక్ష్యానికి గురైన రెండు పథకాలపై కూటమి అధికారంలోకి రాగానే కదలిక వచ్చింది. ఇటీవల భూసేకరణ సొమ్ము కొంతవరకు జమచేశారు. రెండు పథకాలు మళ్లీ పట్టాలెక్కుతాయనే ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ప్రకటనపై రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

**పట్టు రైతుల్ని ఆదుకోండి**

హిందూపురం, మడకశిర ప్రాంతాల్లో సుమారు 60 వేల మంది రైతులు పట్టు సాగుచేస్తున్నారు. 2014–19 మధ్యలో రైతులకు కిలోకు రూ.50, రీలర్లకు రూ.100 చొప్పున ప్రోత్సాహకాలు అందించారు. వైకాపా సర్కారు 2021లో మాత్రమే ఇచ్చి నాలుగేళ్లు ఎగ్గొట్టింది. రూ.65 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. సీఎం చంద్రబాబు స్పందించి.. బకాయిలు చెల్లించడంతో పాటు పథకాన్ని తిరిగి ప్రారంభించాలని రైతులు వేడుకుంటున్నారు.

**బృహత్తర పథకంపై..** ఉరవకొండ నియోజకవర్గంలోని 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో 2018లో తెదేపా ప్రభుత్వం రూ.842 కోట్లతో సామూహిక బిందుసేద్యం(కమ్యూనిటీ డ్రిప్ ఇరిగేషన్) పథకానికి శ్రీకారం చుట్టింది. డ్రిప్ పద్ధతిలో సాగునీరు అందిచాలనే లక్ష్యంతో పనులు మొదలుపెట్టారు. రూ.88 కోట్లు ఖర్చు చేశారు. 25 వేల ఎకరాలకు సరిపోయే సామగ్రిని కొనుగోలు చేసి ఆమిద్యాల వద్ద నిల్వ ఉంచారు. వైకాపా అధికారంలోకి రావడంతో పథకం ఆగిపోయింది.

# గోదాముల్లో ఉంచి.. గుట్టుగా తరలించి



ధర్మవరం : పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం సరిహద్దులు దాటుతోంది. రాత్రికి రాత్రే నల్లబజారుకు తరలించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ధర్మవరం నియోజకవర్గం రేషన్ బియ్యం దందాకు కేంద్రమైంది. ప్రతి నెలా కార్డుదారుల ఇళ్లకు వెళ్లి బియ్యం కొనుగోలు చేయడానికి కమిషన్ ఏజెంట్లను వ్యాపారులు నియమించారు. డీలర్ల వద్ద మిగిలిన బియ్యాన్ని వ్యాపారులు నేరుగానే కొంటున్నారు. కిలో రూ.18కు కొనుగోలు చేస్తున్నారు. కమీషన్ రూపేణా ఏజెంట్లకు రూ.2 ఇస్తున్నారు.

నియోజకవర్గంలోని గ్రామాల్లో ఏజెంట్లు.. ఆటోలు, ద్విచక్రవాహనాల్లో వెళ్లి, కొనుగోలు చేసి వ్యాపారుల వద్దకు చేరుస్తున్నారు. పట్టణంలోని పార్థసారథినగర్, ప్రియాంకనగర్, లక్ష్మీచెన్నకేశవపురం ప్రాంతాల్లో రహస్యంగా గోదాములు ఏర్పాటు చేసుకొని నిల్వ చేస్తున్నారు.

**పాలిష్ చేయించి..**

నిల్వ చేసిన బియ్యాన్ని వ్యాన్లలో అర్ధరాత్రి దాటిన తరువాత కర్ణాటకలోని కోలార్ జిల్లా బంగారంపేటలో ఉన్న మిల్లులకు చేరుస్తున్నారు. అక్కడ పాలిష్ చేయిస్తున్నారు. రూ.18కు కొనుగోలు చేసిన బియ్యాన్ని రూ.40కు బడా వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వాటిని వాహనాల్లో మంగళూరు ఓడరేవుకు తీసుకెళ్లి అక్కడి నుంచి విదేశాలకు పంపుతున్నారు. విదేశాల్లో కిలో రూ.100కు పైనే పలుకుతున్నట్లు వ్యాపారవర్గాల ద్వారా తెలుస్తోంది.

పోలీసులకు సమాచారం ఉన్నప్పుడు మాత్రమే అరకొరగా వాహనాలు పట్టుబడుతున్నాయి. విజిలెన్స్ అధికారులకు సమాచారం అందితేనే దాడులు చేసి బియ్యం పట్టుకొని స్థానిక పోలీసుస్టేషన్‌కు అప్పగించి కేసులు నమోదు చేయిస్తున్నారు. బడా వ్యాపారులు రేషన్ బియ్యం దందా నడుపుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**తనిఖీలు ముమ్మరం చేస్తాం – వంశీకృష్ణారెడ్డి, డీఎస్‌వో, శ్రీసత్యసాయి జిల్లా** రేషన్ బియ్యం నల్లబజారుకు తరలకుండా గట్టి చర్యలు చేపడతాం. ప్రతి మండలంలోనూ నిఘా ఉంచాలని సీఎస్‌డీటీలను ఆదేశిస్తాం. ఎవరికైనా తెలిస్తే రెవెన్యూ అధికారులకు సమాచారం అందించవచ్చు. అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయిస్తాం.

# నారసింహా.. సమస్యలు కనవా?

ఉరవకొండ : పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు అంతంత మాత్రమే కనిపిస్తున్నాయి. ప్రధానంగా నీటి సమస్య ఉంది. దాన్ని అధిగమించడానికి చిన్న నీటి ట్యాంకుల ఏర్పాటుకు అధికారులు దిమ్మెలు నిర్మిస్తున్నారు. వాటిపై ట్యాంకులు ఏర్పాటు చేసి, పైపులైన్ల ద్వారా నీటిని ఎప్పుడు అందిస్తారన్న దానిపై స్పష్టత లేదు. విద్యుత్తు సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఆలయ పరిసరాల్లో రెండు విద్యుత్తు నియంత్రికలు ఉన్నాయి. అందులో ఒకటి ఆలయానికి, ఇంకోటి దుకాణాలు, నివాస గృహాలకు సరిపోతోంది. ఉత్సవాల్లో దుకాణాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేస్తారు. దీంతో లోడ్ అధికం అవుతుంది. దీంతో తరచూ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. మెరుగైన విద్యుత్తు సరఫరా దిశగా చర్యలు చేపట్టింది లేదు.

**మరుగుదొడ్లు.. స్నానపు గదులు అరకొరే**

శ్రీవారి బ్రహ్మోత్సవాలు 12 రోజులపాటు కొనసాగుతాయి. రాష్ట్రంతో పాటు కర్ణాటక నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తారు. వారు దాసంగాలు పెట్టుకోవడానికి వచ్చి, రెండు మూడు రోజులు ఇక్కడే ఉంటారు. భక్తులు స్నానాలు చేయడానికి ఒకచోట మాత్రమే 20 కుళాయిలతో షవర్లు ఏర్పాటు చేశారు. ఇవి ఏమాత్రం సరిపోవు. ఇక మరుగుదొడ్లు లేవు. రెండు చోట్ల గతంలో మరుగుదొడ్లు నిర్మించినా, ఏనాడు వాటిని భక్తులకు అందుబాటులోకి తెచ్చింది లేదు. ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా దేవాదాయ శాఖ అధికారులు సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

**వాహన సేవలు ఇలా..** ఈ నెల 9న ఆమిద్యాల నుంచి శ్రీవారి ఉత్సవ విగ్రహాలు పెన్నహోబిలం చేరుతాయి. 10న ప్రాకారోత్సవం. 11న చంద్రప్రభ వాహన సేవ, 12న గో, శేష, 13న హంస, 14న హనుమంత,



15న గరుడ వాహనసేవ, శ్రీవారి కల్యాణం, 16న సూర్యప్రభ, ఐరావత వాహనసేవలు, 17న బ్రహ్మరథోత్సవం, 18న అశ్వ వాహనం, 19న ధ్వజ అవరోహణం, శయనోత్సవం, 20న పెన్నహోబిలం నుంచి ఉత్సవ విగ్రహాలు తిరిగి ఆమిద్యాలకు వెళ్లడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

**వసతుల కల్పనకు చర్యలు – రమేశ్‌బాబు, ఆలయ ఈవో**

శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ భక్తులకు మెరుగైన సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాం. నీటి ట్యాంకుల ఏర్పాటు రెండు రోజుల్లో పూర్తవుతుంది. 14 ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తాం. విద్యుత్తు సమస్యపై సంబంధిత అధికారులతో చర్చించాం. అదనంగా నియంత్రికల ఏర్పాటుకు వారు సమ్మతించారు. మిగిలిన సదుపాయాలు కల్పించేందుకు చొరవ చూపుతున్నాం.

# వాహనాలకు సామర్థ్య పరీక్షే

కర్నూలు : రవాణా శాఖ జారీ చేసే వాహన సామర్థ్య(ఫిట్‌నెస్) పత్రాలు ఇక నుంచి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు ప్రైవేటు కేంద్రాలకు అనుమతి లభించింది. వాహనాల సామర్థ్య కేంద్రం నంద్యాల జిల్లా చాబోలు వద్ద వారం రోజుల కిందట ప్రారంభమైంది. కర్నూలు జిల్లాలో చిన్నటేకూరు వద్ద ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఆయా కేంద్రాల్లో 54 రకాల పరీక్షలు చేస్తారు. శబ్ద కాలుష్యం, వాహన టైర్ల సామర్థ్యం, బ్రేక్‌లు, వాహన బరువు, హెడ్ లైట్ తదితర పూర్తిస్థాయి పరీక్షలు చేపడతారు. వాహనానికి సంబంధించిన వివరాలన్నీ కంప్యూటరులో నమోదు చేస్తారు. అనంతరం వాహన సామర్థ్యం ఆధారంగా పత్రం ఇస్తారు.

**చిన్నపాటి లోపం ఉన్నా**

వాహన బ్రేకులు సరిగా లేకపోయినా, రంగులు, నంబరు ప్లేట్లు, రేడియం స్టిక్కర్లు లేకున్నా.. ఇలా చిన్నపాటి లోపమున్నా వెనక్కి పంపుతారు. ఆయా కేంద్రాల్లో కంప్యూటర్లను రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయానికి అనుసంధానం చేశారు. వాహన సామర్థ్యం బాగుంటే పత్రం జారీ అవుతుంది. లేకుంటే తిరస్కరిస్తారు. ఇలా రెండుసార్లు పరీక్షలు నిర్వహించేందుకు అనుమతిస్తారు. రెండుసార్లు విఫలమైతే దానిని తుక్కు వాహనం కింద పరిగణించి రహదారిపైకి రాకుండా చూస్తారు.



ఏడేళ్లలోపు వాహనాలు రెండేళ్లకోసారి, ఏడేళ్లు దాటిన వాహనాలు ఏడాదికోసారి వాహన సామర్థ్య పత్రం తీసుకోవాలి. 15 ఏళ్లు దాటిన ద్విచక్ర వాహనాలకు రూ.600, ఎల్‌ఎంవీలకు రూ.800, ఎంఎంవీ, హెచ్‌ఎంవీ వాహనాలకు రూ.1,200 ఫీజుగా వసూలు చేస్తారు.

**తప్పని దూరభారం**

ఉమ్మడి జిల్లాలో కర్నూలు, ఆదోని, నంద్యాల, డోన్, ఆత్మకూరు పట్టణాల్లో రవాణా శాఖ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో మోటారు వాహన, సహాయక మోటారు వాహన తనిఖీ అధికారులు ఉంటారు. వారి పర్యవేక్షణలో నిత్యం 60 వాహనాలను పరిశీలిస్తుంటారు. ఇప్పుడా బాధ్యత ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు.

ఉమ్మడి జిల్లాలో రెండు కేంద్రాలే ఏర్పాటు చేయడం.. మిగిలిన ప్రాంతాల వాసులు అక్కడికి వెళ్లాలంటే అవస్థలు తప్పేలా లేవు. డోన్‌కు చెందిన వాహనదారులు చాబోలు కేంద్రానికి రావాలంటే సుమారు 70 కి.మీ., నందికొట్కూరు 50, ఆత్మకూరు 50, ఆళ్లగడ్డ, బనగానపల్లి 40, కొలిమిగుండ్ల వంటి ప్రాంతాల నుంచి 80, సున్నిపెంట వంటి ప్రాంతాలవారు సుమారు 150 కి.మీ. మేర ప్రయాణించి ఎఫ్‌సీ చేయించుకుని వెళ్లాల్సిన పరిస్థితి. నంద్యాలలోని ఏటీసీ కేంద్రంలో నిత్యం 45 స్లాట్ బుకింగ్ అవుతున్నాయి. రోజుకు 25 నుంచి 30 వాహనాలకే సామర్థ్య పరీక్షలు చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు వెనక్కి వెళ్తున్నారు.

# అవినీతి పునాదులు.. బహుళ అక్రమాలు

నంద్యాల : ఉమ్మడి జిల్లాలో స్థిరాస్తి వ్యాపారం మందకొడిగా సాగుతుండటంతో కొందరు నిర్మాణదారులు అక్రమాలకు తెరలేపారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కుమ్మక్కై భవనం నిర్మాణ సమయంలోనే ఫ్లాట్లను విక్రయించి వాటికి మార్టిగేజ్‌ను విడుదల చేయిస్తున్నారు. బ్యాంకుల్లో రుణాలూ ఇప్పిస్తున్నారు. మరికొన్నింటికి మున్సిపాల్టీతో సంబంధం లేకుండానే తనఖా రిజిస్ట్రేషన్ అలాగే ఉంచి సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులకు రూ.లక్షల్లో ముడుపులు ముట్టజెబుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**పుర ఆదాయానికి గండి**

నిబంధనల ప్రకారం మున్సిపాల్టీల్లో చేపట్టే అపార్ట్‌మెంట్ల ఆస్తి విలువలో 10 శాతం పురపాలిక పేరుతో మార్ట్‌గేజ్ రిజిస్ట్రేషన్ చేయాలి. నిర్మాణదారులు ప్లాన్‌లో చూపిన విధంగానే నిర్మాణాలు చేయాలి. నిర్మాణాలు పూర్తయిన తర్వాత అన్నీ సవ్యంగా ఉంటే తొలుత చేసిన మార్ట్‌గేజ్‌ను విడుదల చేస్తారు. అక్రమాల్లో ఆరితేరిన కొంతమంది నిర్మాణదారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. నిర్మాణాలు పూర్తవకుండానే మార్టిగేజ్‌లను విడుదల చేయించుకుంటున్నారు. ఇందుకు కొంతమంది టీపీవోలు, టీపీఎస్, బిల్డింగ్



ఇన్‌స్పెక్టర్లు వత్తాసు పలుకుతుండగా ఉన్నతాధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారు. దీంతో మున్సిపాల్టీలు పెద్దఎత్తున ఆదాయం కోల్పోతున్నాయి.

**అన్నింటా అక్రమాలే**

జిల్లా కేంద్రం నంద్యాలలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం వేగంగా చేస్తారనే పేరున్న ఓ నిర్మాణదారు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో అంటకాగుతుంటారు. ఈయన ఆధ్వర్యంలో పద్మావతినగర్, ఎన్జీవో కాలనీల్లో చేపట్టిన అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు పూర్తి కాకుండానే రూ.కోట్ల విలువైన ప్లాట్లను తనఖా పూచీకత్తు రిజిస్ట్రేషన్లను విడుదల చేశారు. ఆ పత్రాలతోనే నిర్మాణదారుడు ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు శాఖల నుంచి పెద్ద ఎత్తున కొనుగోలుదారులకు రుణాలు ఇప్పించారు. వచ్చిన డబ్బుతో మరికొన్ని నిర్మాణాల్లో పెట్టుబడులు పెట్టారు.

కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీ, సంతోష్‌నగర్‌లలో రెండేళ్ల క్రితం బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టిన గుర్తింపు పొందిన నిర్మాణ సంస్థ కార్పొరేషన్‌లో పూచీకత్తు ఒప్పందం విడుదల చేయకుండానే అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించారు. మరికొన్ని ప్లాట్లను ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఇతరులకు విక్రయించి వాటిని బ్యాంకులో తనఖా పెట్టించి మరి రుణాలు ఇప్పించారు. ఇదే సంస్థ నంద్యాలలో కూడా ఇటీవల ఇదే ప్రయోగం చేస్తుంది.

నంద్యాల ఫరూక్‌నగర్‌లో ఒక నాయకుడు నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో ఓ వ్యాపారి రెండేళ్ల కిందట రూ.65 లక్షలతో ఫ్లాట్ కొనుగోలు చేశారు. అప్పట్లో ఇది మార్టిగేజ్‌లో ఉండగానే బ్యాంకులో తనఖా పెట్టి రూ.38 లక్షల రుణం తీసుకున్నారు.

# నమ్రత మేడం సర్ మేడం అంతే..!

ఈ జనరేషన్ ప్రేక్షకులకు నమ్రత శిరోద్కర్ కేవలం మహేష్ బాబు భార్యగా మాత్రమే తెలుసు. కానీ రెండు దశాబ్దాలు వెనక్కి వెళ్తే ఆమె స్థాయి ఏంటో అందరికీ అర్థం అవుతుంది. 1993లో ఫెమినా మిస్ ఇండియా కిరీటాన్ని గెలుచుకుంది. హిందీలో ఎన్నో సినిమాల్లో నటించి సూపర్ హిట్స్‌ను సైతం అందుకుంది. తెలుగులో మెగాస్టార్ చిరంజీవితో పాటు పలు సినిమాల్లో నటించింది. మహేష్ బాబుతో ప్రేమలో పడ్డ నమ్రత శిరోద్కర్ ఆయన్ను పెళ్లి చేసుకున్న తర్వాత ఇండస్ట్రీకి దూరం అయింది. ఆమె ఫ్యామిలీ వ్యవహారాలు చూసుకుంటే ఈ జనరేషన్‌కి కేవలం మహేష్ బాబు భార్యగా మాత్రమే గుర్తు ఉండి పోయేలా ఆమె లో ప్రొఫైల్‌ను మెయింటెన్ చేస్తూ వస్తుంది. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో నమ్రత తన హద్దులు దాటకుండా, పరిధిలో ఉంటూ అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. చాలా మంది పెళ్లి అయిన హీరోయిన్స్ అందాల ఆరబోత చేస్తూ ఇప్పటికీ వార్తల్లో ఉన్నారు. వారి ఫామ్ కోల్పోయినా కూడా స్కిన్ షో చేయడం ద్వారా వార్తల్లో నిలవాలని ప్రయత్నాలు చేస్తున్న వారు కొందరు ఉన్నారు. కానీ నమ్రత మాత్రం ఎప్పుడూ చాలా హుందగా ప్రవర్తిస్తూ వస్తున్నారు. ఆమె తన గౌరవ, మర్యాదలు కాపాడుకోవడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. నమ్రత భార్య కావడం అనేది మహేష్ బాబు అదృష్టం అంటూ చాలా మంది అభిమానులు సైతం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా నమ్రత ఇన్‌స్టాగ్రామ్ ద్వారా



అందమైన ఫోటోలను షేర్ చేసింది. విభిన్నమైన డిజైనర్ ఔట్ ఫిట్‌ను ధరించిన నమ్రత అంతే స్టైలిష్ ఆభరణాలు ధరించడం ద్వారా చాలా ఆకర్షణీయంగా కనిపించింది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ నమ్రత సొంతం అంటూ ఉంటారు. ఆమె వయసు పెరిగినా కొద్దీ మరింత అందంగా కనిపిస్తుందని, మిస్ ఇండియా సమయంలో ఎంత అందంగా ఉందో అంతే అందంగా కనిపిస్తుందని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి నమ్రత సోషల్ మీడియాలో ఇలాంటి ఫోటోలను రెగ్యులర్‌గా షేర్ చేయాలని అభిమానులు కోరుకుంటూ ఉన్నారు. తరుణ్ తాహిళాని డిజైన్ చేసిన ఈ ఔట్ ఫిట్ నమ్రత ధరించడంతో మరింత అందంగా కనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో నమ్రత ఏ ఫోటోలు షేర్ చేసినా వెంటనే వైరల్ అవుతూ ఉంటాయి. ఎక్కువ శాతం తన పిల్లలు గౌతమ్, సితార ఫోటోలను షేర్ చేస్తూ ఉండే నమ్రత ఈసారి మాత్రం తన పిక్స్‌ను షేర్ చేసింది. ఇంత అందంగా ఉన్న నమ్రత ఎందుకు సినిమాలకు దూరం అయిందని అభిమానులు కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల బాధ్యత ఉన్న కారణంగా అప్పుడు సినిమాలకు దూరంగా ఉన్న నమ్రత ఇప్పుడు అయినా రీ ఎంట్రీ ఇవ్వచ్చు కదా అంటున్నారు. ఆ మధ్య రేణు దేశాయ్ తో పాటు పలువురు రీ ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. వారిలాగే నమ్రత ఏదో ఒక రోజున రీ ఎంట్రీ ఇస్తుందని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి నమ్రత మనసులో ఏముందో తెలియాల్సి ఉంది.

# జూనియర్ అతిలోక సుందరి వైబ్స్

నేటి జెన్ జెడ్ స్టార్లలో దూసుకుపోయే తత్వం జాన్వీకపూర్ కి ఉంది. అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలిగా సినీ ఆరంగేట్రం చేసిన జాన్వీ కపూర్ తనను తాను నటిగా నిరూపించుకుంటూ ఒక్కో మెట్టు ఎక్కుతోంది. అదే సమయంలో జాన్వీ నిరంతర ఫ్యాషన్ సెన్స్ తో ప్రజల దృష్టిని తనవైపు తిప్పేసుకోవడంలో పెద్ద సక్సెసైంది. ఇప్పుడు మరోసారి జాన్వీ తనదైన యూనిక్ స్టైల్ తో కనిపించింది. ఈ బ్యూటీ జగదేక వీరుడు - అతిలోక సుందరి పోస్టర్ ప్రింట్ చేసి ఉన్న క్లాసిక్ డెనిమ్ జీన్స్ షర్ట్ ధరించి కనిపించింది. డెనిమ్స్ షర్ట్ వెనక భాగంలో ఈ పోస్టర్ ముద్రించి ఉండటం ఆసక్తికరం. ఈ స్పెషల్ డెనిమ్ జాకెట్ అంటే తనకు చాలా ఇష్టం అని జాన్వీ తెలిపింది. శ్రీదేవిని -ఒక



దేవదూత అద్భుత యువరాణి%-% అని ప్రశంసించారు. చిరంజీవి -శ్రీదేవితో పాటు ఈ పోస్టర్ లో నాటి మేటి విలన్ అమ్రీష్ పురి ఫోటో కూడా ఉంది. జాన్వీ కపూర్ ప్రస్తుతం కెరీర్ పరంగా ఫుల్ బిజీగా ఉంది. ఈ బ్యూటీ తదుపరి రామ్ చరణ్ తో కలిసి పెద్దిలో కనిపిస్తుంది. ఆ తర్వాత జగదేక వీరుడు అతిలోక సుందరి సీక్వెల్ ని తెరకెక్కిస్తే నటించేందుకు సిద్ధమేనని కూడా జాన్వీ ఇంతకుముందు చెప్పింది. రామ్ చరణ్- జాన్వీ కపూర్ జంటగా జగదేక వీరుడు సీక్వెల్ ని తెకెక్కిస్తే బావుంటుందని చిరు కూడా సూచించారు. అయితే ఈ ప్రాజెక్టుకు ఇంకా చాలా సమయం పడుతుంది.




# వీరమల్లు : జనాలు అసూయ పడుతున్నారట!



పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' సినిమా ఈనెలలో విడుదల కావాల్సి ఉన్నా వీఎఫ్ఎక్స్ వర్క్ ఆలస్యం కావడంతో వాయిదా పడ్డ విషయం తెల్సిందే. ఈ నెల చివరి వరకు విడుదల చేయాలని భావించినప్పటికీ అది సాధ్యం కాదని తేలిపోయింది. అన్ని అనుకున్నట్లుగా జరిగితే జులైలో సినిమా విడుదల ఉండే అవకాశం ఉంది. థియేట్రికల్ బిజినెస్ కాలేదు అంటూ పుకార్లు వినిపిస్తున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ సభ్యులు కొట్టి పారేశారు. సినిమాకు మంచి స్పందన వస్తుందనే విశ్వాసంను దర్శకుడు జ్యోతికృష్ణ చెప్పుకొచ్చాడు. తాజాగా ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో దర్శకుడు జ్యోతికృష్ణ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మచిలీపట్నంలో బీచ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ప్రభుత్వం తరపున మంత్రులతో పాటు, పలువురు ఎమ్మెల్యేలు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరిహర వీరమల్లు సినిమా టీం సైతం అక్కడ సందడి చేశారు. హీరోయిన్ నిధి అగర్వాల్ చిత్ర యూనిట్ సభ్యులతో కలిసి ప్రేక్షకులను అలరించింది. ముఖ్యంగా ఆమె వేసిన స్టెప్స్ అందరి దృష్టిని ఆకర్షించాయి. అంతే కాకుండా పలువురు ప్రముఖులు పవన్ కళ్యాణ్ గురించి, ఆ సినిమాల గురించి వ్యాఖ్యలు చేశారు. క్రిష్ హరిహర వీరమల్లు సినిమా నుంచి తప్పుకోవడంతో జ్యోతికృష్ణ ఈ సినిమా దర్శకత్వ బాధ్యతలను తీసుకున్న విషయం తెల్సిందే. బీచ్ ఫెస్టివల్‌లో ఆయన మాట్లాడుతూ సినిమాపై అంచనాలు పెంచారు. దర్శకుడు జ్యోతికృష్ణ మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ గారితో వర్క్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. నేను పవన్ కళ్యాణ్ సర్‌ను డైరెక్ట్ చేయడం చూసి చాలా మంది అసూయ పడుతున్నారు. నాకు పవన్ సర్‌తో కలిసి వర్క్ చేసే అవకాశం రావడంను చూసి చాలా మంది అసూయ పడుతున్న విషయంను నేను గుర్తించాను. ఎంతో అదృష్టం ఉంటే తప్ప ఇలాంటి అవకాశం దక్కదు అనే ఉద్దేశంతో జ్యోతికృష్ణ ఈ వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ గారు నాకు అప్పగించిన పనికి పూర్తి న్యాయం చేశాను అని భావిస్తున్నాను. సినిమాను చూసిన తర్వాత పవన్ సర్ నాతో మాట్లాడారు. దాదాపు గంట సమయం నాతో సినిమా గురించి మాట్లాడుతూ ప్రశంసించారు. మరోసారి నాతో కలిసి సినిమా చేయాలని కోరికను ఆయన వ్యక్తం చేశారు. నాకు ఎప్పటికీ ఆయన మాటలు గుర్తుండి పోతాయి. హరిహర వీరమల్లు సినిమా పీరియాడిక్ డ్రామాగా రూపొందింది. ఈ సినిమాలో పవన్ గతంలో ఎప్పుడూ లేని విధంగా విభిన్నమైన గెటప్‌లో కనిపించబోతున్నాడు. ఈ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటించగా, కీలక పాత్రలో బాలీవుడ్ బ్యూటీ నటించినట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు ఆస్కార్ అవార్డ్ గ్రహీత కీరవాణి సంగీతాన్ని అందించారు. భారీ అంచనాల నడుమ రూపొందిన ఈ సినిమాను ఏఎం రత్నం నిర్మించారు.

పవన్ కళ్యాణ్ రాజకీయాలతో బిజీగా ఉన్న కారణంగా దాదాపుగా ఈ సినిమా మూడు ఏళ్లు ఆలస్యం అయింది. ఈ మూడు ఏళ్ల ఎదురుచూపులకు తగ్గట్లుగా ఈ సినిమా ఉంటుందా అనేది వచ్చే నెలలో విడుదల తర్వాత క్లారిటీ వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# వార్-2.. నిర్మాతలు పెద్ద యుద్ధమే చేయాలేమో?



టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ ప్రముఖ నటుడు హృతిక్ రోషన్ కాంబినేషన్ లో వార్-2 మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. ఆ సినిమాతోనే తారక్ బాలీవుడ్ లోకి ఎంట్రీ (డైరెక్ట్ హిందీ మూవీ) ఇస్తున్నారు. స్పై జోనర్ లో స్టార్ డైరెక్టర్ అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తుండగా.. యష్ రాజ్ ఫిల్మ్స్ భారీగా నిర్మిస్తోంది. బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ ఫిమేల్ లీడ్ రోల్ లో నటిస్తున్న వార్-2ను ఆగస్టు 14వ తేదీన ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం బిజినెస్ కు సంబంధించిన వ్యవహారాలు పూర్తి చేస్తున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే తెలుగులో కూడా వార్-2 రిలీజ్ కానుండగా.. ఇప్పటికే థియేట్రికల్ రైట్స్ కోసం టాలీవుడ్ బడా ప్రొడక్షన్ హౌసెస్ పోటీ పడినట్లు కొద్ది రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. కానీ వారెవరికీ హక్కులు ఇవ్వమని యష్ రాజ్ ఫిల్మ్స్ చెప్పిందని టాక్. రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా సినిమాను సొంతంగా రిలీజ్ చేయాలని నిర్ణయించుకుందని సమాచారం. అదే సమయంలో తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్ వాల్యూ రూ. 90 కోట్ల వరకు ఉంటుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఇప్పుడు వాటిని తిరిగి పొందాలంటే.. వార్-2 మేకర్స్.. పెద్ద యుద్ధమే చేయాలేమోనని అంటున్నారు. యష్ రాజ్ ఫిల్మ్స్ సేఫ్ జోన్ ఉండే ఛాన్స్ ఉన్నా.. రిస్క్ చేస్తుందని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా స్పై జోనర్ కు తెలుగులో మరింత అంత ఫ్యాన్ బేస్ ఉండదు. అందుకే జోనర్ తోనే ఫస్ట్ సమస్య. ఆ తర్వాత ఎన్టీఆర్ సోలో మూవీ అయితే.. తెలుగులో భారీ వసూళ్లు రాబట్టడం ఈజీనే. కానీ సినిమా కంటెంట్ అంతా బాలీవుడ్ ఫ్లేవర్ లో ఉన్నట్టు క్లియర్ గా తెలుస్తోంది. కాబట్టి తారక్ ప్రమోషన్స్ చేసినా అది సరిపోదు. అదే సమయంలో వార్-2 రిలీజ్ రోజు కూలీ మూవీ విడుదల కానుంది. రజనీకాంత్, లోకేష్ కనగరాజ్ కాంబోలో రానున్న ఆ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రమోషన్స్ కూడా జోరుగా సాగుతున్నాయి. సినిమాలో అన్ని ఇండస్ట్రీల నటులున్నారు. దీంతో వార్-2 కన్నా కూలీకే ఎక్కువ బ్రాండ్ వాల్యూ ఉన్నట్లు కనిపిస్తోంది. అందుకే ఇప్పుడు వార్-2.. తెలుగులో ఎలా గట్టెక్కుతుందో వేచి చూడాలి.

# శ్రీలీల కొంటె చూపుల వలపు బాణం

టాలీవుడ్ కోలీవుడ్ బాలీవుడ్ .. పరిశ్రమ ఏదైనా శ్రీలీల కొంటె చూపులకు దాసోహం అనాల్సిందే! అందానికి అందం, ప్రతిభ ఈ అమ్మడి సొంతం. ముఖ్యంగా డ్యాన్సింగ్ క్వీన్ గా ఓ వెలుగు వెలుగుతున్న శ్రీలీలలో గ్లామ్ యాంగిల్ కూడా ఎప్పుడూ యూత్ లో చర్చకొస్తుంది. ఇక ఫ్యాషన్ సెన్స్ లోను ఈ తెలుగమ్మాయి తగ్గేదే లే! అంటోంది. ముంబై, ఢిల్లీ, కోల్ కతా, బెంగళూరు లాంటి మెట్రో నగరాల నుంచి వచ్చిన చాలా మంది టాప్ మోడల్స్ కి పోటీనిచ్చేంత మ్యాటర్ ఉంది ఈ బ్యూటీలో. గత కొంత కాలంగా శ్రీలీల ఇన్



స్టాలో స్పెషల్ ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. తాజాగా షేర్ చేసిన ఫోటోషూట్ లో శ్రీలీల సంథింగ్ స్పెషల్ గా కనిపిస్తోంది. సింపుల్ గా నవ్వేస్తూ, హాఫ్ షోల్డర్ ఫ్రాక్‌లో ప్లెజెంట్ గా కనిపిస్తున్న ఈ బ్యూటీ గజిబిజి షూట్ లైఫ్ నుంచి రిలాక్స్ అవుతున్నట్టే కనిపిస్తోంది. ఈ అందాల భామ ప్రస్తుతం అరడజను సినిమాలతో బిజీ బిజీగా ఉంది. జూనియర్స్, మాస్ జాతర, లెనిన్ అనే చిత్రాల్లో నటిస్తోంది. మరోవైపు కార్తీక్ ఆర్యన్ సరసనా ఓ చిత్రంలో శ్రీలీల కథానాయిక. ఇది ఆషిఖి ఫ్రాంఛైజీ నుంచి వస్తున్న సినిమాగా ప్రచారం ఉన్నా, అలాంటిదేమీ లేదని చిత్రబృందం తెలిపింది. పరాశక్తి అనే తమిళ చిత్రంలోను ఈ భామ నటించింది.

# 'తెలుసు కదా' రాశి ఖన్నాకు...!

ఊహలు గుసగుసలాడే సినిమాతో దశాబ్ద కాలం క్రితం హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా. ఆ సినిమా నటిగా రాశి ఖన్నాకు మంచి గుర్తింపును తెచ్చి పెట్టింది. ఆ సినిమా కమర్షియల్‌గా కూడా మంచి ఫలితాన్ని సొంతం చేసుకుంది. అందుకే రాశి ఖన్నా చాలా సినిమా ఆఫర్లను సొంతం చేసుకుంది. టాలీవుడ్‌లో ఒకానొక సమయంలో యంగ్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా నిలిచింది. టాలీవుడ్ టైర్ 2 హీరోల్లో చాలా మందికి జోడీగా నటించడం ద్వారా నాలుగు... ఐదేళ్ల పాటు బిజీ బిజీగా సినిమాల్లో నటించింది. ఒకానొక సమయంలో ఈమె ఏడాదికి నాలుగు అయిదు సినిమాల్లో కనిపించింది. ఈమధ్య కాలంలో టాలీవుడ్ కి రాశి ఖన్నా దూరం అయింది. తెలుగు సినిమాల్లో ఈమె చివరిగా కనిపించి రెండేళ్లకు పైగా అయింది. ఈమె నాగ చైతన్య హీరోగా నటించిన థాంక్యూ సినిమాలో చివరగా కనిపించింది. 2022లో విడుదలైన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకోలేదు. పైగా అంతకు ముందు ఈమె చేసిన తెలుగు సినిమాలు కూడా అంతంత మాత్రమే అన్నట్లుగా ఆడటంతో మెల్ల మెల్లగా ఆఫర్లు తగ్గాయి. అదే సమయంలో తెలుగులో



వచ్చే చిన్నా చితకా ఆఫర్లను కాదని కోలీవుడ్‌లో రాశి ఖన్నా బిజీ అయింది. తెలుగులో సినిమా ఆఫర్లు రాకున్నా కోలీవుడ్, బాలీవుడ్‌లో ఈ అమ్మడు నటించి మెప్పించింది. టాలీవుడ్‌లో 'థాంక్యూ' సినిమా తర్వాత రాశి ఖన్నా ఎట్టకేలకు 'తెలుసు కదా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సిద్దు జొన్నలగడ్డ హీరోగా నీరజ కోన దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. చాలా కాలం క్రితమే రావాల్సిన ఈ తెలుసు కదా సినిమా కొన్ని కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు విడుదలకు సంబంధించిన ప్రకటన వచ్చింది. అంతే కాకుండా ఈ సినిమా జోనర్ ఏంటి... ఎలాంటి కంటెంట్ ఈ సినిమాలో ఉండబోతుంది అనే విషయాన్ని తెలియజేస్తూ సరదాగా ఒక వీడియోను సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఇద్దరు హీరోయిన్స్ ఈ సినిమాలో కనిపించబోతున్నారు. సిద్దు జొన్నలగడ్డకు జోడీగా రాశి ఖన్నాతో పాటు కేజీఎఫ్ ముద్దుగుమ్మ శ్రీనిధి శెట్టి సైతం హీరోయిన్‌గా నటించింది. వీరిద్దరి కాంబోలో ఉండే సీన్స్ వినోదాత్మకంగా ఉంటాయని ఇటీవల విడుదల అయిన ప్రమోషన్ వీడియోను చూస్తే అనిపిస్తుంది. తెలుగు కదా సినిమా యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా సాగే ట్రై యాంగిల్ లవ్ స్టోరీ అని క్లారిటీ ఇచ్చారు. అదే సమయంలో సినిమాలో రాశి ఖన్నా పాత్ర చాలా ప్రాముఖ్యతను కలిగి ఉంటుందని తెలుస్తోంది. తెలుగు సినిమాల్లో చాలా కాలం తర్వాత కనిపించబోతున్న రాశి ఖన్నాకు తెలుసు కదా అయినా మంచి విజయాన్ని తెచ్చి పెడుతుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తెలుసు కదా హిట్ అయితే టాలీవుడ్‌లో మరో రెండు మూడు ఏళ్ల పాటు రాశి ఖన్నా బిజీగా ఉండే అవకాశం ఉంటుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536